
# కథామంజరి

## పది కథల సమాహారం



ఫిబ్రవరి 2024

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**ఫిబ్రవరి 2024**

సంపుటి : 5 ♦ సంచిక : 2



ఈ నెల సంచికకు చేయూతనిచ్చిన వారు,

**స్వర్గీయ చిర్రావూరి సర్వేశ్వరశర్మ, లలిత గార్ల**

జ్ఞాపకార్థం వారి కుమారుడు

**డా. చిర్రావూరి శ్యామ్ గారు, (యుఎస్ఏ),**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నందూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | iii |
| కథా మార్గదర్శి | v |
| కథా పరిచయం | vii |
| వినదగునెవ్వరు చెప్పిన.. | x |
| కథాపుస్తక పరిచయం | xi |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| పితృ ఋణం | సింహప్రసాద్ | 1 |
| పరిణతి | విజయ శ్రీముఖి | 8 |
| దేవుడా.. ఏమి నీ కోరిక! | విజయార్కె | 15 |
| పసినికాయ | వాడవల్లి పూర్ణ కామేశ్వరి | 21 |
| తెర వెనుక | ఉయ్యూరు అనసూయ | 26 |
| లవ్ క్వీన్ | శ్రీచరణ్ మిత్ర | 31 |
| ప్రేమకు కళ్ళున్నాయి | శింగరాజు శ్రీనివాసరావు | 35 |
| వెన్నెలకి ఆవల... | భమిడిపాటి గౌరి శంకర్ | 39 |
| కళ్ళు | ఇంద్రగంటి జానకిబాల | 45 |
| శిథిల శిల్పాలు | అల్లం శేషగిరిరావు... | 50 |


Cover Page Credit : Cansai Mola, Silicon Valley

రచయితలకి, కవులకు రసానుభూతి కలిగినప్పుడు... సాహిత్య సృష్టి జరుగుతుంది! అసలు ఈ రసానుభూతి రచయితలకే కాదు, ప్రతీ మనిషికి కలుగుతుంది. అయితే ఆ అనుభూతికి అక్షరరూపం ఇవ్వాలనే ఆవేశం తోడైతే... కథో కవితో జనిస్తుంది. ఆ అనుభూతి.. నవరస భరితమైనది. శృంగారం, హాస్యం, కరుణ, రౌద్ర, వీర, భయానక, బీభత్స, అద్భుత, శాంత రసాలలో అనుభూతులు, సహజంగా ప్రతీ మనిషిలోనూ ఏదో సందర్భంలో కలుగుతాయి. అలా జనించినదే సాహితీ సంపద! ఈ ఉపోద్ఘాతంతో అసలు విషయానికి వస్తే... తెలుగు కథ పుట్టినప్పట్నుంచి అన్ని రసాలలో కొన్ని లక్షల కథలు వచ్చాయి, వస్తున్నాయి! ఆ మాటకు వస్తే, మన ఇతిహాసాలు, చరిత్రలు తిరగేస్తే వాటిలో కూడా ఈ నవరసాలు నిండుగా కనబడతాయి. అయితే ఆధునిక సాహిత్యం.. ముఖ్యంగా కథా సాహిత్యంలో ఆధునికత వచ్చిన తర్వాత ఈ రసాన్వేషణ పెరిగిందనే చెప్పాలి!

కథా రచనలలో దాని ప్రాముఖ్యత అనూహ్యంగా పెరిగింది. కుటుంబం, బంధాలు, అనుబంధాలు, కుట్రలు, కుతంత్రాలు, యుద్ధాలు, బీభత్సాలు, పరిశోధనలు, నేరాలు, ఘోరాలు, ప్రేమలు, పెళ్ళిళ్ళు .. ఇలా అన్ని రకాల కథలు వచ్చాయి. గడిచిన నూటిరవై సంవత్సరాల కాలంలో ఆయా కాలాల్లో ఉన్న సాంఘిక, సామాజిక పరిస్థితుల బట్టి, కథలు వచ్చాయి. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కథా వస్తువులో కొత్త ఒరవడులు వచ్చాయి. అందులో మిగతా కథా వస్తువుల విషయంలో ఎలా వున్నా, ప్రేమ కథలకి, నవలలకి... పెట్టిన పేరుగా కొందరు రచయితలకే గుర్తింపు ఉండేది. డెబ్బై దశకంలో ఈ పరిస్థితి మారింది. మిగతా కథా వస్తువులతో పాటు, ప్రేమ కథలు, నవలలు విరివిగా వచ్చేవి. ఊహాజనితమైన ఈ ప్రేమ కథలు కోకొల్లలు.. పాఠకులను జనరంజకం చేసాయి! వార, మాసపత్రికలలో ఆ కథల కోసం, సీరియళ్ళ కోసం పాఠకులు ఎదురు చూస్తూ ఉండేవారు. ఆ కథలు, నవలల ఆధారంగా సినిమాలు కూడా వచ్చేవి. ఈ మార్పు కొట్టొచ్చినట్లు కనబడింది.

అలాంటి తెలుగు నేల మీద, నేడు అందమైన ప్రేమ కథలకి ఫుల్‌స్టాఫ్ పడిందా? కారణాలు ఏమిటని ఆలోచిస్తే, కర్ణుడు చావుకు లాగే.... చాలా కనబడ్డాయి! ముఖ్యంగా గ్లోబలైజేషన్ తర్వాత... ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పడిపోయింది. విద్యా వ్యవస్థలో పెను మార్పులు వచ్చాయి. ఇలా వచ్చిన మార్పుల ప్రభావం.. మనుషుల మీద పడింది. బంధాలు, అనుబంధాలు క్షీణించాయి! ఇంకా పాత తరం వారిలో ఇవి కనబడుతున్నాయేమో గాని, ఈ తరం వారిలో ఇవి పూర్తిగా పడిపోయాయని సర్వత్రా వింటూనే ఉన్నాం! వీటికి తోడు... కంప్యూటరీకరణ! మొత్తం మనిషి జీవనం కంప్యూటర్లు చెప్పినట్లు నడుస్తోంది! ఓ రకంగా నిజమైన యాంత్రిక జీవనంలో మనిషి పడిపోయి, 'నవరసాల' రుచులకు దూరం అయ్యాడు! వెరసి.. ఆ ప్రభావం సాహిత్యం మీద పడింది! అటు పాఠకుడు, ఇటు రచయితలో ఉండవలసిన సున్నితత్వం దూరమవుతోంది.

ఈ నేపథ్యంలో 'ప్రేమ' కథలకు వస్తువు అందించే, ఈ తరం వారి జీవనగమనాలు, అభిరుచులు, ఆలోచనలు, అనుభూతులు మారిపోయాయి! ప్రేమ అనే మాటకి నిర్వచనం మారిపోయింది! ఓ అర్ధశత కాలం వెనక్కి వెళితే, ఆ రోజుల్లో టీనేజ్ నుంచే కథలు వ్రాసేవారు ఉండేవారు. వారి కలం వయసుతో పాటు పరుగులు పెట్టేది! కాని వర్తమానంలో యువతలో కథలు వ్రాసేవారు కరువై పోయారు. ఒకరో ఇద్దరో ఉన్నా... ఆ అనుభూతులు కనబడటం లేదు. వారి ఆలోచనలతో పాటు, కథావస్తువులో ఈ 'ప్రేమ' కథలకు చోటు కనబడటం లేదు!

తిరిగి.. మనసుని రంజింప చేసే ప్రేమ కథలను చదవగలమా? నిజమైన, స్వచ్ఛమైన ప్రేమ కథలు వ్రాయగల ఏ తరం వారైనా నడుం కట్టుకుంటారా? అసలు.. మన చుట్టుపక్కల స్వచ్ఛమైన 'ప్రేమ' కథ కనబడుతోందా? ఈ వైఖరి సానుకూలమా, ప్రతికూలమా?

ఇలా ఆలోచిస్తుంటే... 'మనసుని రంజింప చేసే అచ్చమైన, స్వచ్ఛమైన ప్రేమకథలు మళ్ళీ వస్తాయా' అనే ప్రశ్న నాకే కాదు, తెలుగు కథాప్రియులందరికి కూడా వస్తుంది!

దీనికి కాలమే సమాధానం చెప్పాలి!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల**

అటు సాహిత్యంలోనూ, ఇటు సంగీతంలోనూ పేరు తెచ్చుకున్న ప్రజ్ఞావంతులు... చాల తక్కువ మంది మన తెలుగునాట కనబడతారు. అయితే... అటు పుట్టింటి వారు సంగీతంలో నిష్ణాతులైతే, ఇటు మెట్టినింటి వారు తెలుగు సాహిత్యంలో ఆరితేరిన కుటుంబం. ఇక రెండు రంగాల్లో, స్వయం కృషితోనే తెలుగు సంగీత సాహిత్య రంగాల్లో తనకంటూ ప్రత్యేకమైన, సుస్థిర స్థానాన్ని అధిరోహించిన వారే.. ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, సంపాదకులు, సంగీత కళాకారిణి శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల గారు! జానకీబాల గారి తల్లి లక్ష్మీనరసమాంబ గారు బాలికోన్నత పాఠశాలలో సంగీతం టీచర్‌గా పని చేసేవారు. జానకీబాల గారు ఆమె దగ్గరే సంగీతం నేర్చుకున్నారు. పాటలు, చిన్న చిన్న రచనలతో సాహిత్య రంగంలో కూడా అడుగులు వేసిన జానకీబాల గారు తన పాతిక ఏళ్ళ ప్రాయంలో కథారచన వైపు పూర్తిస్థాయిలో ముందుకు నడిచారు. ప్రముఖ తెలుగు సాహితీవేత్త శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారి కుమారుడు శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ గారిని వివాహం చేసుకున్నారు. అటు సంగీతం... ఇటు సాహిత్యం.. ! రెండింటిలోనూ నిర్విరామ కృషితో తనకంటూ ఓ ప్రత్యేకమైన ముద్రను సాధించుకున్నారు!

పన్నెండు నవలలు, ఏడు కథా సంపుటాలు, పలు కవిత సంపుటలు, పరిశోధన వ్యాసాలు, జీవిత గాథలు... జానకీబాల గారి సాహితీవనంలో చోటు చేసుకొనగా, ఆమె సంపాదక బాధ్యతతో పలు పుస్తకాలు వెలువడ్డాయి. అటు.. జానకీబాల గారి కలం నుంచి సినిమా పాటల విశ్లేషణలతో "రాగరంజితం" పుస్తకం కూడా విడుదలయింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సాహిత్య రంగంలో మార్పులు, ఉద్యమాలు విరివిగా వచ్చాయి. ఆ ప్రభావం జానకీబాల రచనలలో కనబడుతుంది. మొదట్లో.. వీరి కథల్లో ఆర్థికంగా వెనకబడిన సామాజిక బలహీన వర్గాల జీవితాలు, ఉద్యోగ నిర్వహణలో ఎదురయ్యే ఆటుపోటులు... ఇలా కథావస్తువులు ఉండేవి. జానకీబాల గారు రోడ్డు రవాణా సంస్థలో పనిచేసేవారు... ఆ ప్రభావం కథల్లో కనబడేది. బస్సు ప్రయాణం నేపథ్యంలోనే కాకుండా, అక్కడ ఆఫీసులో ఉండే లొసుగుల్ని వెలికి తీసి, కథలు వ్రాసారు. ఇక తర్వాత కాలంలో... స్త్రీ వాద దృక్పథంతో కథలు వ్రాసారు. జానకీబాల గారి కథల్లో తన వాదనను బాహాటంగా సమర్థించుకునే ప్రయత్నాలూ, వర్ణనలూ ఉండవు. తమకి ఎదురుగా జరిగే సంఘటలాగే

పాఠకులని కట్టిపడేస్తాయి. ఆలోచించేలా, సున్నితమైన అనుభూతిని మిగిలిస్తాయి. జానకీబాల గారి రచనల గురించి మాట్లాడుతూ .. "బలమైన లక్ష్యం, మంచి వస్తువులను ఎన్నుకుంటే, టెక్నిక్కు, ఊపు వాటికి అవే వస్తాయి! అవి పుష్కలంగా జానకిబాల కథల్లో ఉన్నాయి. ఆ కథల్లో రచయిత్రి అర్థవంతమైన ఆలోచనలు ఉన్నాయి!" అంటూ శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు కితాబు ఇచ్చారు. కరిగిన హరివిల్లు, నీలిరాగం, నిజానికి అబద్దానికు మధ్య, రాగవల్లకి, పంజరం కోరిన మనిషి వంటి వీరి నవలలు.., అడుగడుగున గుడి ఉంది, అద్దం, ఆంతర్యం, ఆపదమొక్కుల ఆసామి, కళ్లు, ఎంతెంత దూరం, తెరచాటు, ధర్మయుద్ధం వంటి ఎన్నో వీరి కథలు పాఠకుల్ని ఆకర్షించాయి. లలితసంగీత కళాకారిణిగా జానకీబాల గారు ఆకాశవాణి ద్వారా తమ గానాన్ని వినిపించారు. వీరి పాటలలతో... లలిత గీతమాలిక, శివాక్షరమాల.. అనే కేసెట్లు విడుదలయ్యాయి. ఈటీవీలో "పాటల పాలవెల్లి" అనే కార్యక్రమాన్ని, తెలుగు సినిమా పాటలపై "పదాలహరి" అనే సంగీత కార్యక్రమాల్ని నిర్వహించారు.

పలు అవార్డులు, రివార్డులు అందుకున్న జానకీబాల దంపతుల కుమారుడు శ్రీ ఇంద్రగంటి మోహనకృష్ణ గారు సినీ దర్శకుడిగా తెలుగువారికి చిరపరిచితుడే! ఇలా అనేక కళా రంగాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఆ కుటుంబ సభ్యురాలు శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల గారిని ఈ సంచిక విశిష్ట అతిథిగా పరిచయం చేయడం ఓ అదృష్టంగా భావిస్తూ, నిండు నూరేళ్ళూ ఆణిముత్యాల వంటి మరిన్ని రచనలతో జానకీబాల గారు తెలుగు సాహితీ ప్రపంచాన్ని అలరిస్తారని ఆశిస్తున్నాం.

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**శ్రీ అల్లం శేషగిరిరావు**

కొన్ని కథలు చదువుతున్నప్పుడు శైలిని బట్టి ఇది ఫలానా రచయిత వ్రాసిందని ఇట్టే గ్రహిస్తాం! అలాగే కొన్ని కథాంశాలను బట్టి కూడా. కొందరు రచయితలు సాంఘిక, సామాజిక అంశాలను కాచి, వడబోసి కథలుగా వ్రాసి, తమ ప్రత్యేకతను చరిత్రలో పదిలపరుచుకున్నారు. హాస్యం, విషాదం, కరుణ, రౌద్రం వంటి రసాలతో రచనలను పూరించి, తమ ప్రత్యేక ముద్ర వేసుకున్న రచయితలూ ఉన్నారు. అలాగే... సాంఘిక విషయాలు, రాజకీయాలు, డిటెక్టివ్, సైన్స్, చారిత్రాత్మకం, ప్రేమ, ... ఇలా ఎన్నో అంశాల మీద కథలు వ్రాసి, వారికి వారే సాటి అని.. స్థిర స్థాయిగా నిలిచిపోయిన కథకులు చాలామంది ఉన్నారు. ఆ కోవకు చెందిన 'వేట' కథలలో ఆరితేరిన తెలుగు రచయితలు నలుగురైదుగురు మాత్రమే మనకి స్ఫురిస్తారు. అందులో అగ్రగణ్యులు కీ.శే. అల్లం శేషగిరిరావు గారు. చాలా సాదాసీదాగా కనబడే శేషగిరిరావుగారు మితభాషి, నిగర్వి! తన కథల్లో కనబడే ఓ అమాయక చక్రవర్తిలా కనిపిస్తారు. అలాంటి ఆయన పాఠకుల ప్రాణాలు తోడేసే భయంకరమైన కథలు వ్రాసారంటే ఆశ్చర్యం వేస్తుంది!

శేషగిరిరావు గారు ఆంగ్ల సాహిత్యాన్ని బాగా చదివేవారు. టాల్‌స్టాయ్ దగ్గర్నుంచి అరుంధతి రాయ్ వరకు.. అందరి రచనల్ని చదివేవారు. అలా ఆ రచయితల, రచనల ప్రభావం ఆయనలో అంతర్లీనంగా ఉంది. శేషగిరిరావు గారి రచనలో ఆడంబరాలు, వర్ణనలు ఉండవు. చమత్కారం లేకుండా సూటిగా, నిర్భయంగా కథ నడుస్తుంది. కథావస్తువు, శిల్పం... తన కథల్లో సరియైన పాళ్ళల్లో వీటికి ప్రాధాన్యత ఇచ్చే తీరు... చాలా తక్కువ మంది రచయితలకు అబ్బుతుంది. శేషగిరిరావుగారు ఆ కొద్దిమందిలో ఒకరని చెప్పక తప్పదు. మొత్తం మీద పదిహేడు కథలే వ్రాసినా సరే... ఆ కథలతోనే శేషగిరిరావు గారు తెలుగు సాహితీవనంలో మేలిమి రచయితగా గుర్తింపు పొందారు. అందులో "వరదు" కథకు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప గుర్తింపు వచ్చింది. అలాగే.. "డెత్ ఆఫ్ ఎ మేనీటర్", మృగతృష్ణ, పులి చెరువులో పిట్టల వేట, చీకటి, నరమేధం.. వంటి వీరి కథలు తెలుగు కథాప్రపంచంలో స్థిర స్థాయిగా నిలిచిపోయాయి! "వరదు" కథని దూరదర్శన్ వారు బాసు చటర్జీ దర్శకత్వంలో సింగిల్ ఎపిసోడ్‌గా ప్రసారం చేసారు. వీరి కథలు ఇంగ్లీషు, హిందీ, మళయాళీ భాషల్లోకి అనువదించబడ్డాయి. 1981లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డుతో బాటు ఎన్నో అవార్డులు పొందిన శేషగిరిరావు

గారు రేడియో నాటికలు కూడా రాశారు! వీరి కథలని చాసో గారి నుంచి పురాణం సుబ్రమణ్యశర్మ గారి వరకు మెచ్చుకోని వారు లేరని చెప్పాలి.

1934 డిసెంబరులో జన్మించిన శేషగిరిరావు గారు ఎం.ఏ. చదివి, రైల్వేలో పని చేసి, 1994లో పదవీవిరమణ చేసారు. ఆయన స్వస్థలం ఒరిస్సాలోని చత్రపురం, విశాఖపట్నంలో స్థిరనివాసం! రాసి కంటే వాసి ఉన్న కథలు వ్రాసి వేట కథకుడిగా ప్రసిద్ధి చెందిన అల్లం శేషగిరిరావు గారు 2000 జనవరి 3 తేదిన కన్నుమూసారు.

కథాస్రవంతి వారు, శేషగిరిరావు గారి కథల్ని సంకలనంగా విడుదల చేసారు. అందులో రచయిత గురించి నాలుగు మాటలు వ్రాసారు. "కథల్ని వారు సరదా కోసమో, సంతోషం కోసమో రాయలేదు. బాధతోనూ, భయంతోనూ, బాధ్యతతోనూ రాశారు. ప్రపంచమంతటా మంచులా పేరుకుపోయిన అన్యాయాన్ని గుప్పిళ్ళతో తీసి చూపించారు. తెలుగు కథకి కొత్త వెలుగులు, సరికొత్త సొబగులు, శబ్దాలను అక్షరీకరించడం, నిశ్శబ్దాన్ని దృశ్యీకరించడం.. అల్లం వారికి తెలిసినట్టుగా మరోకరికి తెలియదు. అతని దారి, రాదారి వేరు!" ఇవి శేషగిరిరావు గారి కథల గురించి కొన్ని మాటలే మాత్రమే! అటువంటి ఓ గొప్ప రచయితని తలుచుకుంటూ, కథామార్గదర్శిగా తరతరాలు నిలిచిపోయే అల్లం శేషగిరిరావు గారికి నివాళి అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

## వసుధేంద్ర గారి కథ "డెవిల్ డాగ్"

***అనువాదం: రంగనాథ రామచంద్రరావు***

రెండో ప్రపంచయుద్ధం సమయంలో బెలూ వుడ్స్ యుద్ధంలో ఓడిపోయాక జర్మన్లు అమెరికన్ నౌకాదళం సైనికుల్ని డెవిల్ డాగ్ లని పిలిచేవారట. అయితే మన కథలో డెవిల్ డాగ్ అమెరికన్ సోల్జర్ కాదు. అయితే అది, పలుకుబడి, ప్రాముఖ్యం ఉన్న ఒక అమెరికన్‌ను మట్టికరిపించిన భారతదేశపు కుక్కపిల్లే.

వసుధేంద్రగారు ప్రముఖ కన్నడ రచయిత. ఆయనకు కర్ణాటక సాహిత్య అకాడమీ వారి సాహిత్యశ్రీ, పుస్తక అవార్డులు, అనేక గుర్తింపులు లభించాయి. ఆయన కన్నడలో ఎన్నో కథలు, వ్యాసాలు, నవలలు రాయడం, పలు అనువాదాలు చేయడమే కాక ఆంగ్లభాషలో కూడా ఆయన పుస్తకాలు ప్రచురించారు. ఆయన రాసిన ఎన్నో గొప్ప కథలను తెలుగువారికి అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత రంగనాథ రామచంద్రరావుగారిది. రామచంద్రరావుగారికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం ఇంకో కన్నడ రచయిత శాంతినాథ దేశాయి రచించిన 'ఓం నమో' అన్న పుస్తకానువాదానికి లభించింది.

'డెవిల్ డాగ్' ఒక మంచి రచయిత కలం నుంచి వచ్చిన కథకు ఇంకో మంచి అనువాదకారుని కలం నుంచి జాలువారిన ఒక సాహిత్య కుసుమం.

శ్రీనివాసరావుగారు కల్లో కూడా అనుకోలేదు నిమ్మిలాంటి అందమైన చిన్న కుక్కపిల్లను పెంచుకోవాల్సివస్తుందని. భార్య పోయాక అమెరికాలో నివసిస్తున్న కొడుకు, కోడలు తన ఒంటరితనాన్ని తగ్గించుకోవాలంటే తనతో ఒక కుక్కను పెంచుకోవడం ఒక అవసరం అని ఎన్నోసార్లు చెప్పిన మీదట తను చిన్నతనంలో ప్రేమించిన అమ్మాయి పేరుతో ఒక పామేరేనియన్ను పెంచుకోవడం జరిగింది. నిమ్మి రావుగారి జీవితాన్ని పూర్తిగా నింపేసింది. నిమ్మి తానెంత తెలివైనదో రోజురోజుకీ కొత్త విద్యలు నేర్చుకుంటూ రావుగారిని ఆశ్చర్యపరిచేది. న్యూస్‌పేపరు తెచ్చిచ్చే మామూలు పనులే కాకుండా, సాయంత్రమయ్యేటప్పటికి ఇంట్లోకి దోమలు రాకుండా అన్ని తలుపులూ వెయ్యడం, మళ్ళీ పొద్దున్నే తీయడం లాంటివి కూడా నిమ్మికి రొటీన్ అయిపోయింది. పొయ్యిమీద పెట్టిన పాలు ఎప్పుడు పొంగుతాయో నిమ్మీకి తెలుసు. అలాగే మిగతా రోజుల్లో రావుగారు అలవాటుగా అయిదున్నరకల్లా నిమ్మీని బయటకు తీసుకెడితే, ఆదివారాల్లో మాత్రం రావుగారిని ఏడింటివరకూ పడుకోనివ్వడం లాంటి విషయాల్తో రావుగారిని తన తెలివితేటలతో అలరించేది కుక్క నిమ్మీ.

ఆ బిల్డింగ్‌లో రావుగారు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉంటే, ఒక తమిళ కుటుంబం మూడో అంతస్తులో ఉండేది. అక్కడ ఒక కుర్రాడు, పేరు స్వామినాథన్, ఫ్లూటు ప్రాక్టీస్ చేసేవాడు. అది వింటూ రావుగారు ఆనందిస్తుండేవాడు. ఒక రోజు ఆ కుర్రాడు కిందకొచ్చి పరిచయం చేసుకుని నిమ్మి గురించి మరో రహస్యం చెప్పాడు. తను ఎప్పుడు అపస్వరం వాయించినా నిమ్మి బయటకొచ్చి అరుస్తుందని! తనకెప్పుడూ వినడమే తప్ప అపస్వరాల గురించి అవగాహన లేదు. అలాంటిది నిమ్మికి ఆ జ్ఞానం ఎలా వచ్చింది? అది నిజమేనా? కొద్దిసార్లు ఆ కుర్రాడు తప్పులు వాయించి, నిమ్మి రియాక్షన్ చూసినప్పుడు అది నిజమని తేలిపోయింది. నిమ్మి స్వామినాథన్‌కి గురువుకాని గురువైపోయింది. వారిద్దరి మధ్యా కూడా సాన్నిహిత్యం పెరిగింది.

మంజుల నంబూద్రి అనే ప్రముఖ విదుషీమణి కచేరీకి స్వామినాథన్ బలవంతంతో నిమ్మిని కారులో తీసుకెళ్లారు. ఏర్పాటు ఒక పెద్ద స్టేడియంలో! స్వామినాథన్ తన తోటి కళాకారులతో పాటకు తాళం వేస్తూ వినడానికి వీలుగా ముందు సీట్లలోకి, రావుగారు నిమ్మీతో వెనక సీట్లలోకి స్థిరపడ్డారు. కచేరీ మొదలై, రావుగారికి, నిమ్మీకి ఇష్టమైన ఒక పాట మొదలు పెట్టింది గాయకురాలు! అంతవరకూ నిమ్మి ఎంతో ఆసక్తిగా వింటూన్నట్లు, ఆనందపడుతున్నట్లు, అనిపించింది రావుగారికి. అంతలో వినిపించింది అనుకోని అపస్వరం. రావుగారు గుర్తించి అనుకునేలోగానే నిమ్మి మొరగడం మొదలుపెట్టింది. అంతేకాదు. ఎక్కడో ఉన్న కుక్కలెన్నో ఒక్కసారిగా మొరగడం మొదలుపెట్టాయి. నిమ్మి ఎప్పుడు స్టేజి మీదకు వెళ్ళిందో, జనాల అరుపులు, కేకలు... రావు గారికి నిమ్మిని ఏంచేస్తారో భయం. ఇంతలోనే నిమ్మి చిన్న కంతలోంచి తప్పించుకుని బయటకు పరుగెట్టింది. రావుగారు నిమ్మీని ఎందుకు తెచ్చానో, ఇంట్లోనే ఉంటే బాగుండేది కదా అనుకుంటూ కారు దగ్గరికి రావడం, నిమ్మీ ఎక్కడ ఎప్పుడు చూసిందో, కారులోకి ఎగిరి రావడం జరిగిపోయాయి.

మంజులా నంబూద్రి కొన్ని క్షణాలు బిత్తరపోయినా, తను పాడిన అపస్వరాన్ని ఒప్పుకుని, ఆ కుక్కకి ఉన్న జ్ఞానాన్ని మెచ్చుకుంటూ ఆ కుక్క అతి ప్రత్యేకమైనదిగా పేర్కొంటూ తన కచేరీని కొనసాగించింది. మర్నాడు పత్రికలలో నిమ్మీకి ఉన్న ప్రత్యేకత మారుమోగి పోయింది.

ఈ కథ ఇక్కడితో, ఈ దేశంతో ఆగలేదు.

నిమ్మీ కథ అమెరికాలోని మొదటి యాభై ధనవంతులలో ఒకడు, ఎంతో విజయవంతంగా సాఫ్ట్‌వేర్ కంపనీలు నడిపిన గ్రెగ్ జోన్స్ అనే ఆయన చెవినపడింది. గ్రెగ్ తన సంపదతో ప్రపంచంలోని అత్యంత ప్రత్యేకమైన కుక్కల్ని తన సేకరణలో ఉంచుకోవడం ఒక హాబీ. ఆయనకు డబ్బు లెక్కకాదు. రష్యా, చైనా, మొదలగు దేశాలనుంచి ఎన్నో కుక్కలు ఆయన దగ్గరున్నాయి. ఆఫ్టర్ అల్, ఇండియా కుక్క... ఎంతసేపాయనకు సంపాదించడం? అమెరికాలోని ఒక ఇండియన్ చానెల్ లో ఆ కుక్క గురించి ప్రస్తావించడం, రావుగారి అబ్బాయిని ఇంటర్వ్యూ చెయ్యడం జరగడంవల్ల గ్రెగ్‌కు ఎవర్ని పట్టుకోవాలో సునాయాసంగా తెలిసిపోయింది.

రావుగారి అబ్బాయి ఒక రోజు ఫోన్ చేసి, గ్రెగ్ ప్రతిపాదన చెప్పాడు తండ్రికి. రావుగారు మండిపడ్డాడు. ఒకప్పుడు తనిచ్చిన కుక్కే కాబట్టి, ఒకప్పుడు వద్దన్న తండ్రికి నిమ్మీని ఇచ్చేయడం సులభమవుతుందని కొడుకు వాదన. అమెరికాలో అంత పెద్దవాడు అడగడం, మనం వద్దనడమేమిటని అతని వుద్దేశ్యం. రావుగారు ససేమిరా నిమ్మీని ఇవ్వడానికి సిద్ధంగా లేరు. గ్రెగ్ అంత సులభంగా ఓటమినంగీకరిస్తాడా? ఆరోజు రాత్రి పది గంటలకు కొడుకు దగ్గర నుంచి మరో ఫోన్ కాల్! గ్రెగ్ తన బేరాన్ని ఒక లక్ష డాలర్లు, కొడుకు ప్రోమోషన్‌కి పెంచాడు. కొడుకు బ్రతిమిలాట ఎక్కువైంది. భరించలేనంత అయింది. ఇక ఒప్పుకోక తప్పలేదు రావుగారికి... అయితే రెండు షరతులతో! ఒకటి గ్రెగ్ స్వయంగా వచ్చి నిమ్మీని తీసుకెళ్లాలి, రెండు సాయంత్రం దాటిన తర్వాత మాత్రమే రావాలి.

గ్రెగ్ గారికి ఇండియా గురించి సదభిప్రాయం లేదెప్పుడూ. తనకు ఈ కుక్క వ్యవహారం తేల్చుకోవడం ఒక ఛాలెంజ్ అయిపోయింది. ఇక తప్పలేదు. తన స్వంత విమానంలో వచ్చి, మంచి సెక్యూరిటీతో, ఇద్దరు మనుష్యులు మస్కిటో కాయిల్ వెలిగించి ముందుకు కదులుతూ సాయంత్రం ఏడు గంటలకు రావుగారింటికి వచ్చాడు. అప్పటికే రావుగారు దోమలు రాకుండా, చుట్టూన్న చెరువుల దుర్వాసన రాకుండా తలుపులు మూసేసి ఉంచారు అయిదింటికల్లా. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చొన్నారు. పరిచయాలయ్యాయి. నిమ్మీకున్న ప్రత్యేక గుణాన్ని నిరూపించడానికి స్వామినాథన్ తయారుగా ఉన్నాడు.

గ్రేగ్ లక్ష డాలర్ల చెక్ సంతకం చేసి రావుగారికిచ్చాడు. రావుగారు ఆ చెక్కును అక్కడే ఉన్న మస్కిటో కాయిల్ స్టాండు కింద ఉంచాడు అదంతా ముఖ్యం కానట్టు. స్వామినాథన్ వాయించడం మొదలుపెట్టాడు. నిమ్మి ఓ రెండు క్షణాలు ప్రశాంతంగా ఉందనుకున్నా, గ్రేగ్‌ను చూసి కోపంతో అరవడం మొదలెట్టింది. తరవాత రావుగార్ని చూసి అరిచింది. సంగీతంలో అపస్వరాలేవీ లేవు. అరవడం ఆపి చెక్కుమీద, కాయిల్ మీద ఉచ్చపోసింది. గది తలుపు గడియ ఊడేలా ఎగిరి, తలుపు తీసింది. శత్రు సైనికుల్లా దోమలు ఒక్కసారిగా గదిలోకొచ్చాయి. "డెవిల్ డాగ్, డెవిల్ డాగ్" అంటూ గ్రేగ్ బయటకు పరిగెట్టాడు.

మర్నాడు పొద్దున్నే కొడుకు ఫోను. గ్రేగ్ చెప్పాట్ట తన్ని మోసం చేశారని, అపస్వరానికి కుక్క మొరగడం అబద్ధమని. అప్పుడు రావుగారన్న మాటలతో కథ ముగుస్తుంది. "మొద్దు ముండాకొడకా, అపస్వరం అన్నది కేవలం సంగీతంలో ఉండదు, జీవితంలోనూ ఉంటుంది. డబ్బు ఇచ్చి విద్వత్తును కొనాలనుకునే నీ యజమాని, డబ్బుకు విద్వత్తుని అమ్ముకోవాలనుకునే నీ తండ్రి.., ఇద్దరి వ్యక్తిత్వాలలోనూ అపస్వరం ఉందని నిమ్మి గుర్తించింది. సంగీతం కన్నా జీవితం ముఖ్యమని దానికి తెలియదని అనుకోవద్దు. అందుకే ఫ్లూటు ధ్వని వినడం మాని, మీ యజమానినీ, నన్నూ చూసి ఆపకుండా మొరిగింది. ఆమాత్రం అర్థం కాలేదేంరా?" ఫోన్ కట్ అయింది.

ఇదీ కథ.

రచయిత సత్యజిత్ రే గారికి ప్రేమతో అంకితం ఇవ్వడం జరిగింది. జీవితంలో ఉండే అపస్వరాల్ని గుర్తించే అవసరం ఉందన్న మెసేజ్ ఇవ్వడానికి సంగీతంలో అపస్వరాల్ని గుర్తించగలిగే ఒక కుక్కను హీరోగా ఎన్నుకుని రాసిన కథ ఇది. కథను మొదటినుంచి చివరవరకు కూర్చిన విధానం గమనించదగ్గది. కథలో ఏ సందర్భంలోనో పాఠకుడికి చెప్పిన ప్రతి విషయాన్నీ, మరో సందర్భంలో ఉపయోగించుకున్నారు రచయిత. చిన్న పల్లెటూరుతో మొదలై, అమెరికాతో ముగిసిన ఈ కథ సులభంగా ఆసక్తితో చదివిస్తుంది. మంచి కథ. ఈ కథను 'కొత్త కథ 2019' పుస్తకంలో చదవవచ్చు.

*పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్*

కథామంజరి లో కథలు తులనాత్మకంగా రసజ్ఞంగా ఉంటున్నాయి. ధన్యవాదములు.

ఈ నెల 5/1 జనవరి సంచిక చేరింది. నీ కథాకీయంలో "బాలోత్సవం 2023" గురించి ప్రస్తావిస్తూ, ప్రచురితమైన కథ చదివి, ఓ 15 మంది దాకా మంచి విశ్లేషణ వ్రాసారని తెలిపారు. చాలా ముదావహం! ఆ బాలోత్సవానికి, ఆ విశ్లేషణలకు అందరికీ అందుబాటులో లేవు కదా! మీరు కథామంజరిలో ఆ కథ, మరియు ఆ విశ్లేషణలలో ఒకటి రెండు తీసుకువస్తే బాగుంటుందని నా అభ్యర్థన. ఒక కథని ఎలా విశ్లేషించాలనే కోణం నాలాటి వారికి ఉపయోగపడుతుందని అనుకుంటున్నాను. అలాగే ఆ విద్యార్థిని ప్రోత్సహించినట్లు ఉంటుంది.

పది కథల సమాహారంలో, విశిష్ట అతిథి కథ, కథా మార్గదర్శి కథ పోగా , ఎనిమిది కథలే కదా. ఆ రెండూ సంపాదకుని పరిచయ కథల కింద లెక్క కదా అని నా భావన. (ఓ రెండు కథలు ఎక్కువగా కొట్టేయచ్చు కదా)


మరొక మాట. ఈ నెల సంచికలో ఎక్కడా మీకు మా అభిప్రాయం ఎలా తెలియచేయాలనే సూచిక లేదు. (Email etc). నా మెయిల్‌కు కథామంజరి అడ్మిన్ నుండి కథలు చేరుతున్నాయి. మరి ఆయనకు మా అభిప్రాయం పంపవచ్చో లేదో తెలియదు. అందుకని, ధైర్యం చేసి, మీతో ఉన్న పరిచయంతో, మీకు ఈ మెసేజ్ పంపుతున్నాను. అన్యథా భావించవద్దు.

నమస్కారములతో..

**దుర్గాప్రసాద్, విశాఖపట్నం**

*బాలోత్సవం 2023 పిల్లలు వ్రాసిన విశ్లేషణలు వారివారి స్థాయిలో బాగా రాశారు. కథామంజరిలో కథల విశ్లేషణలు వేయడం లేదు! ఇక.. పది కథల సమాహారంలో కథ ఏ శీర్షికతో వచ్చినా.. ఆ లెక్కలోకి వస్తాయి. మీ అభిప్రాయాలను* ***submit@kathamanjari.in*** *మెయిల్‌కి పంపించండి.*

*సంపాదకుడు*




## వ్యూహం

తెలుగు కథకు నేటి చిరునామా శ్రీ విహారిగారి 16 వ కథల సంపుటి. 20 కథల సమాహారం. జులై 2023లో విడుదలైంది. వెల రూ.200/-.

ప్రతులకు


శ్రీ జె. ఎస్. మూర్తి (విహారి),
ఫ్లాట్ # 103, J బ్లాక్, రాజ్యపుష్ప అట్రియా,
గోల్డెన్ మైల్ రోడ్డు, కోకపేట,
**హైదరాబాద్-500075**
ఫోన్: 9848025600
email. Vihari912@gmail.com

## సి. యస్. శర్మ రచనలు

రచయిత శ్రీ సి.ఎస్. శర్మ.. తన 17-20 సంవత్సరాల ప్రాయంలోనే, 1939-1942 మధ్యకాలంలో ఎంతో పరిణతితో వ్రాసిన కథలు. ఈ ముప్పై కథల సంపుటిని వారి కుటుంబ సభ్యులు ఫిబ్రవరి 2022 లో ప్రచురించారు. ఈ సంపుటి వెల రూ.350/-.

ప్రతులకు

శ్రీమతి సి. వల్లీ శ్యామల,
ఫ్లాట్ నెం. 303, వంశీరిషీ రెసిడెన్స్,
బేగంపేట,
**హైదరాబాద్ – 500016.**
ఫోన్: 9346821416



# పితృ ఋణం

సింహప్రసాద్
✆ 9849061668

> ***మీకు ఎలా ఉందో గాని నాకు మాత్రం వినడానికే అసహ్యంగా ఉంది. ఆస్తుల కాగితాల మీద ఉన్న శ్రద్ధ, అస్థికల మీద లేకపోయింది. మిమ్మల్ని కన్న తండ్రి పాపం ఎంతటి దురదృష్టవంతుడో అనిపిస్తోంది. మీలాంటి కొడుకుల్ని కన్నందుకు అతడి ఆత్మ భలేగా సంతోషపడుతుందిలే!"***

"అన్నయ్యా, నాన్న సంవత్సరీకానికి వారం పది రోజులైనా ఉండేలా రా! ఆస్తులు పంచేసుకుందాం. అసలు నాన్న పోయిన వెంటనే ఆ పని పూర్తిచేసి ఉండాల్సింది! నువ్వేమో అర్జంటు పనులున్నాయని వెళ్లిపోయావు...." కించిత్తు నిష్ఠూరంగా అన్నాడు తమ్ముడు గోపాల్.

"ఈసారి అవగొట్టేద్దాంలేరా, అందరం ఉంటాంగా!"

మరి కాసేపటికి చిన్న తమ్ముడు గోవింద్ ఫోన్ చేశాడు.

"మనం నాన్న సంవత్సరీకానికి కలిసినప్పుడు వాటాలు పంచుకుందామన్నావటగా! చిన్నన్నయ్య చెప్పాడు. మీ ఇద్దరికీ ఇళ్లు ఉన్నాయి. ఏమీ లేని వాడిని, ఇద్దరూ ఆడపిల్లలే ఉన్నవాడిని నేనే! అంచేత ఇల్లు నాకే ఇచ్చేట్టు చూడు అన్నయ్యా. ఊర్లోని పెద్దలూ అదే న్యాయం అంటున్నారు. అవసరమంటే వారిని పిలిచి చెప్పిస్తాను"

"మనలో మనం వాటాలు వేసుకోవడానికి బయటి పెద్ద మనుషులు ఎందుకురా... మనం చాలమూ! అంతగా అవసరమైతే మామయ్య, బాబాయి, బావ ఉన్నారుగా! వాళ్ళని కూర్చోబెడదాం."

"నిన్నే నమ్ముకున్నాను అన్నయ్యా. అందరికన్నా చిన్నవాడిని. నాకు అన్యాయం చేయకండి!" ఏడుపు అందుకున్నాడు.

"అలాగే చూద్దాం అన్నాగా, ఆ ఏడుపు ఎందుకురా... ఊరుకో!"

ఫోన్ పెట్టేశాక, "మీ అమ్మ గారాబం వల్ల గోవింద్‌కు ప్రతీదానికీ ఏడ్చి సాధించుకోవడం అలవాటయింది. అతగాడి బుడిబుడి ఏడుపులకేం పడిపోకండి. ఇప్పుడా ఊరేం చిన్న టౌన్ కాదు, జిల్లా కేంద్రం! ఇళ్ల రేట్లు బాగా పెరిగి ఉంటాయి." నా భార్య రమ అంది.

"అవన్నీ లెక్కలోకి తీసుకుంటాంలే గాని, మా అక్క, వాటాకి వస్తుందంటావా!"

"ఏ ముఖం పెట్టుకుని వస్తుంది? తన పెళ్లికి కట్నం కింద బాగానే ముట్టచెప్పారుగా మీ నాన్న! పైగా దగ్గరలో ఉండటం వల్ల చీటికీ మాటికీ వెళ్లి పదో పరకో పట్టుకుపోతూనే ఉందాయె!"

రమ చెప్పింది నిజమే గానీ, ఆస్తంతా మా నాన్న స్వార్జితం గనుక అందులో తనకీ వాటా వస్తుందని వాదనకు దిగితే ఏం చేయాలి?

మిత్రుడిని సలహా అడిగాను. "కట్నం భారీగా ఇచ్చినా సరే, ఆస్తిపాస్తుల్లో మీతో పాటు ఆమెకీ హక్కు ఉంటుంది. అంతో ఇంతో ముట్టజెప్పేస్తే సరి!"




"దారుణం కదా! అమ్మ పోయినప్పుడు నాన్న ఉన్నారు కనుక ఖర్చంతా ఆయనే పెట్టుకున్నారు! లాస్ట్ ఇయర్ నాన్న పోయినప్పుడు, అన్ని ఖర్చులూ మేమే భరించాం. ఇదిగో వచ్చేవారం సంవత్సరీకం ఘనంగా చేయాలి. లేకపోతే పిల్లలు ముగ్గురి పరిస్థితీ బాగున్నాసరే లోభించారని ఎత్తిపొడుస్తారు!"

"మీ బాధ్యతలు మీరు నెరవేర్చాలిగా! హక్కుల్లోనే కాదు బాధ్యతల్లోనూ పోటీ పడాలి!"

అతని మాటలు రుచించలేదు. ఆ బాధ్యత ఏదో మా అక్కకు వర్తించదా? నాన్న దశదిన కర్మకి విస్తర్లలో పెట్టడానికి పది కిలోల స్వీట్లు తెచ్చి చేతులు దులిపేసుకుంది!

ఊరుకి బయలుదేరుతుంటే రమ అంది "మీరు ఇంటికి పెద్ద కొడుకు! మీకు పెద్ద వాటా ఇవ్వాలంటారు. గుర్తుంచుకోండి!"

"కుటుంబ బరువు బాధ్యతలు నేనేమీ భుజాలకు ఎత్తుకోలేదు కదుటే! అయినా చూద్దాంలే!"

నాన్న సంవత్సరీకం మరీ ఘనంగా గాకపోయినా బాగానే చేసామనిపించుకున్నాం! బంధుమిత్రులంతా మా అన్నదమ్ముల ఐకమత్యాన్ని మెచ్చుకున్నారు.

"మీ ఆస్తులు, మీ చదువులు, మీ బాగు అన్నీ మీ నాన్న రెక్కల కష్టం చలవేరా! మిమ్మల్ని వృద్ధిలోకి తీసుకురావడానికి ఎన్ని కష్టాలు పడిందీ నాకు తెలుసు. మీరు తల్లకిందులుగా తపస్సు చేసినా ఆయన ఋణం పిసరంత తీరదు. కనీసం అన్నయ్య పేరు శాశ్వతంగా నిలిచిపోయేలా ఏదో పెద్ద పని తలపెట్టండిరా అబ్బాయ్!" అంది మా మేనత్త.

"నాకూ చేయాలనే ఉంది అత్తా... తమ్ముళ్లు ఏమంటారో కనుక్కుంటా..!"

"ఇదెక్కడి చోద్యంరా! పెద్దవాడివి నువ్వు చెబితే ఎందుకు కాదంటారు?" బుగ్గలు నొక్కుకుంది.

పొడిగా నవ్వి ఊరుకున్నాను. ఆ సాయంత్రానికి బంధుమిత్రులు వెళ్లిపోయారు. బావని, మావయ్యని ఉండమన్నాను. బాబాయి ఎలాగూ దగ్గర్లోనే ఉంటున్నాడు.

ఆ ముగ్గురికీ ఆస్తుల పంపకం కార్యక్రమం అప్పగించాం!

అక్కతో సహా ఆడవారంతా ఉత్సుకతతో చూస్తూ మా వెనుకగా నిలబడ్డారు.

మొత్తం మా ఆస్తుల వివరాలు ఇచ్చాం! పెద్దకొడుకుని అని చెప్పి బ్యాంకు డిపాజిట్లకీ నాన్న నన్నే నామినీగా పెట్టాడు. వాటిల్లో ఎంత సొమ్ము ఉందో ఆ వివరాలూ వారి ముందు పెట్టాను.

"స్థిరాస్తుల మ్యుటేషన్ కోసం సక్సెషన్ సర్టిఫికేట్ కావాలంటే అదీ తీసుకున్నారుగా!" బావ అన్నాడు.

గతుక్కుమన్నాను. దానిలో నాన్న వారసులుగా అక్క పేరు కూడా ఉంది!

"ఇప్పుడు మాకు వచ్చే వాటా కన్నా అక్కకు పెళ్ళిలో ఎక్కువే ముట్టచెప్పాడు నాన్న! క్యాషూ ఇచ్చాడు. అక్కకి ఇంకెక్కడి నుంచి వస్తుంది? ఇంకెందుకు వస్తుంది?" దూకుడుగా అన్నాడు గోపాల్.

"మీ అందరి చదువులకు, ఉద్యోగాలకు, పెళ్లిళ్లకు నాన్న ఎక్కువే ఖర్చు పెట్టాడు. అందరి కన్నా చిన్నవాడిని అవడంతో నాకే తక్కువ ఖర్చు చేశాడు. అది మర్చిపోకండి!" చిన్న తమ్ముడు గోవింద్ అన్నాడు. కాదంటే చాలు ఏడ్చేయడానికి సిద్ధంగా ఉన్నాయి వాడి కళ్ళు!

"నాకు ఉద్యోగం వచ్చాక నాన్నకూ, మీకూ సహాయంగా లేనేంటి!" అన్నాను.

"మాట సాయమేగా... ఎప్పుడైనా రూపాయి ఇచ్చావా!" గోపాల్ కోడిపుంజులా లేచాడు.

"నువ్వు ఆగరా! అన్నీ లెక్కలోకి తీసుకునే మేం తెంపు చేస్తాంగా! అమ్ములూ... నువ్వేమంటావే?" అక్కని అడిగాడు మామయ్య.

"నాకేమైనా ఇవ్వాలనిపిస్తే ఇవ్వమను. లేకపోతే లేదు! ఏడాదికోసారి పిలిచి కొత్త చీర, చిటికెడు పసుపు కుంకాలు పెడితే చాలు. పుట్టింటి నుంచి అంతకంటే ఎక్కువ ఆశించను!"

తేలిగ్గా నిట్టూర్చాను. "దానికేం భాగ్యం అక్కా. ప్రతి ఏటా ఉగాదికో సంక్రాంతికో ఏదో పండక్కి పిలిచి పెడతాంలే. అక్క వద్దన్నది గనక మూడు వాటాలు వేయండి మామయ్యా!"

"చిన్నవాడి కంటే మీ ఇద్దరి పరిస్థితి మెరుగ్గా ఉంది. గనుక వాడికి కొంచెం అదనంగా ముట్టజెప్పడం ధర్మం! ఇల్లు వాడికి వదిలేయండి. మీ అమ్మానాన్నల తద్దినాలు ఎలాగూ ఇక్కడే పెడతారు గనుక వచ్చినప్పుడల్లా సొంతింటికి వచ్చినట్టు మీకూ ఉంటుంది. ఆలోచించండి!" అన్నాడు బాబాయి.

బాబాయ్‌ని గోవింద్ ముందే ఆకట్టుకున్నాడని అర్థమైంది. గోపాల్ ఎదుర్కొంటే బాగుండునని, వాడి వంక చూశాను. ఎంచేతో వాడు ఎగరలేదు సరి కదా... తాపీగా అన్నాడు. "దానికి బదులుగా నాకు ఏదో ముట్ట చెప్పండి. అన్నయ్య పిల్లలంతా స్థిరపడ్డ సంగతి మీకూ తెలుసు!"

నా గొంతులో పచ్చి వెలక్కాయ పడింది! ఏమైనా అంటే పెద్దలంతా, 'పెద్దవాడివి. తండ్రి తర్వాత తండ్రి బాధ్యతలన్నీ నువ్వే నిర్వర్తించాలి' అని చెప్పి నోరు మూయిస్తారు. అనకపోతే రమ నా పీక పట్టుకుంటుంది.

రమ కళ్ళసైగ అందుకుని, "ఎవరికీ అన్యాయం జరగకూడదు. ఎలా చేస్తారో చేయండి!" అనేసాను. 'తద్దినాలన్నీ నేనే పెట్టాలి. ఆ ఖర్చు నాదేగా!' అందామనుకునే మింగేసాను.

గోపాల్ భార్య ముందుకొచ్చి "ఇంట్లోని ఫలానా ఫలానా సామాన్లు అత్తగారివి, ఫలానావి మామగారివి! వాటిని వదిలేయటం ఎందుకు. అవీ పంచేయండి!" అంది.

"వాటిల్లో చాలా వరకు మా పుట్టింటి వాళ్ళు పెట్టినవీ ఉన్నాయి. కావలిస్తే వదినగారిని అడగండి!" అంది చిన్న మరదలు స్వరం పెంచి.

"ఇన్నేళ్లూ అత్తయ్యా మామయ్యగార్లతో కలిసే ఉన్నారు. మీ ఖర్చులూ వారి ఖర్చుల్లో కలిసిపోయాయి. ఆ లెక్కలు తీయొద్దూ!" రమ అందుకుంది.

"ఆడవాళ్లూ, మీరు కాస్త తగ్గండి! ముందు స్థిరాస్తుల పంపకం తెమిలిపోతే మిగతావి ఈజీగా తెగ్గొట్టేయొచ్చు! ఒకరు ఒక రూపాయి ఎక్కువ తిన్నా, ఒకరికి తక్కువైనా ఎవరూ ఇదవ్వకూడదు. మీరంతా ఒకే తల్లిదండ్రుల రక్తం పంచుకు పుట్టిన వారని, అన్నదమ్ములని మర్చిపోకూడదు. రామలక్ష్మణుల్లా కలిసి మెలిసి ఉండాలి తప్ప, వాలిసుగ్రీవుల్లా కొట్టుకోకూడదు! ఊళ్లో మీ నాన్న పరువు ప్రతిష్టలకి భంగం కలగకుండా మసలుకోవాలి!" హితవు చెప్పాడు మామయ్య.

మౌనంగా ఉండిపోయాం. ఆయన, బాబాయి, బావలు కూడబలుక్కుని ఒక ప్రతిపాదన మా ముందు పెట్టారు. వాటి విలువల్లో తేడాలు ఉన్నాయని గట్టిగా ఎదుర్కొన్నాం! మొత్తానికి కిందా మీదా పడి, మార్పు చేర్పులు చేసి మా అందర్నీ ఒప్పించారు!

చిత్రం! మా ముగ్గురికీ అసంతృప్తిగానే ఉంది. అయినా తలాడించక తప్పలేదు. వారి పెద్దరికాన్ని గౌరవించాలిగా!

ఆలస్యం అమృతం విషం అన్నారు! ఆ మర్నాడే పార్టిషన్ డీడ్ రాసుకుని రిజిస్టర్ చేయించాం! అక్క తన వాటా వదులుకున్నట్టు అందులో రాయించడం మర్చిపోలేదు. అందుకు ముదరాగా బ్యాంక్ డిపాజిట్‌లో నుంచి కొంత మా అక్కకు ఇప్పించారు. అక్క ఖుష్!

ఆస్తి పంపకాలు పూర్తయ్యాయి గనుక ఊళ్ళకు వెళ్లడానికి సిద్ధమవుతుంటే అక్క మెల్లగా అంది.

"నాన్న అస్థికలు స్మశానంలోనే ఉండిపోయాయిరా తమ్ముడూ!"

వాటి ప్రసక్తి రాకముందే జారుకోవాలని చూస్తుంటే అదే ఎదురైంది!

నాన్న బెడ్ మీద ఉండగా, "ఎన్నిసార్లు ప్రయత్నించినా కాశీ, రామేశ్వరం వెళ్ళలేకపోయానురా" విచారంగా అన్నారు.

"మీకేం కాదు నాన్నా! త్వరలోనే కోలుకుంటారు. అప్పుడు నేను విమానంలో తీసుకెళ్లి ఆ రెండూ చూపిస్తాను!" అన్నాను గొప్పగా.

ఆ మాట కోసమే ఎదురు చూసినట్టు అవాళే చనిపోయారు. చిన్న కర్మ రోజున అస్థికల సేకరణకు వల్లకాటికి వెళుతుంటే ఆ మాటే గుర్తుచేసింది అక్క. "నాన్న ఎలాగూ వెళ్లలేకపోయారు. కాశీ రామేశ్వరాల్లో అస్థికలైనా నిమజ్జనం చేస్తే నాన్న ఆత్మ శాంతిస్తుందిరా!"

"ఓ ఎస్, అలాగే చేస్తాం అక్కా! కడుపున పుట్టిన కొడుకులుగా అది మా బాధ్యత. మన సంప్రదాయాన్ని మేమెలా నిర్లక్ష్యం చేస్తాం చెప్పు!" అనేశాను.

అస్థికల్ని మూడు చిన్న మట్టి పిడతల్లోకి తీసి అక్కడి లాకర్లో భద్రపరిచాం. కాశీ రామేశ్వరాలతో పాటు రాజమండ్రి గోదావరిలోనూ నిమజ్జనం చేద్దామనుకున్నాం!

అప్పట్లోనే ఆ వేడిలో వేడిగా చేసేసి ఉంటే సరిపోయేది. ఇతర అర్జెంటు పనుల వల్ల కనీసం రాజమండ్రి కూడా వెళ్లలేకపోయాం. ఇప్పుడు వాటిని ఆ మూడు చోట్లకీ తీసుకెళ్లాలంటే డబ్బు, పది రోజుల సెలవు ఖర్చు చెయ్యక తప్పదు!

తమ్ముళ్ళ వంక ఏమంటారన్నట్టుగా చూశాను. ఎవరూ సానుకూలంగా స్పందించలేదు.

ఇక లాభం లేదని, "ముగ్గురం మూడు చోట్లకి వెళదాంరా! అన్నీ పంచేసుకున్నాం. ఈ పని కూడా పంచుకుని జరిపిస్తే, నాన్న ఆత్మ సంతృప్తి పడుతుంది. నాన్న మనల్నందర్నీ ఎంత ప్రేమగా పెంచాడో ఒక్కసారి గుర్తు చేసుకుని ఈ ఆఖరి బాధ్యతని సైతం సక్రమంగా నిర్వర్తిద్దాం!" సెంటిమెంట్ జోడించి చిన్న సైజు ఉపన్యాసమే ఇచ్చాను.

కానీ ఈ 'వాటా' తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు.

"అసలు ఇప్పటిదాకా నిమజ్జనం చేయకపోవడం చాలా పెద్ద తప్పు! నువ్వు పెద్ద కొడుకువి. నాన్నకు తలకొరివి పెట్టిన వాడివి. నీ చేతుల మీదుగా ఆ పని పూర్తి చేసి, మీ నాన్న ఆత్మకు శాంతి చేకూర్చు!" అన్నాడు మామయ్య.

తమ్ముళ్లు తలలాడించారు. "అది కూడా నీ చేతుల మీదే అయిందనిపించరా తమ్ముడూ!" వంత పాడింది అక్క.

రమ గుర్రుగా చూస్తున్నా, "మీలాగా నేను దులిపేసుకోలేను. ఇందుకే కాబోలు పెద్ద కొడుకు అంటే పెద్ద పాలేరు అనేవారు పూర్వం! ఇప్పుడు అటూ ఇటూ వెళ్లడం వీలుకాదు గాని సిటీకి వెళ్ళేక వీలు చూసుకుని వెళతాను!"

"అస్థికల్ని ఇంటికి తీసుకు రాకూడదు, తీసుకెళ్లకూడదు. ఊరుకి వెళ్లే ముందు స్మశానానికి వెళ్లి, అవి తీసుకుని ట్రైన్ ఎక్కు! సిటీకి వెళ్ళాక వాటిని ఏ చెరువుగట్టు మీదో లేదా అక్కడి స్మశానంలోనో దాచిపెట్టు. నీ ఇంటికి తీసుకెళ్లకూడదు!" మామయ్య వివరించాడు.

'మళ్ళీ ఇది ఒకటా నా ప్రాణానికి!' లోలోన విసుక్కున్నాను.

స్టేషన్ వెయిటింగ్ రూములో రమని కూర్చోబెట్టి అస్థికల కోసం స్మశానానికి వెళ్లాను.

వారిచ్చిన రసీదు చూసి నా వంక ఎగాదిగా చూసి అన్నాడు "ఇప్పుడు వచ్చారేంటి! మా ప్రకటన చూడలేదా?"

"ప్రకటన ఏమిటి?"

"మీలాగే చాలామంది అంత్యక్రియలు నిర్వహించి ఎంతోకాలంగా అస్థికల్ని ఇక్కడే వదిలేస్తున్నారు తప్ప, సంబంధీకులు ఎవరూ రావట్లేదు. కోవిడ్ టైంలోని వారు అసలే ముందుకు రాలేదు. వాటిని నిలువ చేసే గదిలోని లాకర్లన్నీ నిండిపోయాయి. కొత్తవి భద్రపరచడానికి చోటు లేక చాలా ఇబ్బంది అవుతోంది. అందుకని సంవత్సరం పైబడి ఉన్న వాటిని మా ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజాక్రతువులు నిర్వహించి, ఇక్కడి జలాల్లో కలిపేస్తామని పత్రికాప్రకటన ఇచ్చాం! కొందరు వచ్చారు. చాలామంది రాలేదు. చెప్పినట్టుగానే ఆ కార్యక్రమం నిన్ననే పూర్తి చేసాం. మీరేమో ఇవాళ వచ్చారు!"

దిమ్మెర పోయాను. "మొన్ననే సంవత్సరీకం అయిందండీ!" కీచు గొంతుతో అన్నాను.

"కావచ్చు! రసీదు మీద తారీకు ఉందిగా చూడండి. సంవత్సరం మీద పది రోజులు అయింది. తప్పు మీలో ఉంచుకుని మమ్మల్ని ఎత్తిచూపుతావేంటి!"

ముసలోడికి చాదస్తం జాస్తి కాబోలు ఏదేదో గొణుక్కుంటున్నాడు.

హతాశుడినై వెనుదిరిగాను. సంగతి మామయ్య, అక్కలకు తెలిస్తే ఎంత నామోషీ! ఇప్పుడు ఏం చేయాలో పాలు పోలేదు. ఏదో తప్పు చేసిన భావన మనసుని రంపంతో పరపర కోస్తుంటే తిరిగెళ్లాను. రిక్తహస్తాలతో వచ్చిన నన్ను చూసి ఆశ్చర్యపోయింది రమ. పిమ్మట సంగతి విని విపరీతంగా భయపడిపోయింది.

"మనకు గానీ మన పిల్లలకు గాని కీడు జరగదు కదా!"

"అబ్బే, ఇందులో కీడు జరగడానికి ఏముంది! అదో సంప్రదాయం. ఆచారం. అంతే. మనిషే పోయాక వీటికి ఎవరు విలువిస్తారు? దహనం చేయడంతోనే మన బాధ్యత తీరిపోయింది! ఆ తర్వాత ఇతర కర్మకాండలు చేసామా లేదా అన్నవి అనవసర విషయాలు! ఒక్కో మతంలో ఒక్కో రకంగా ఉంటాయి. వాటి గురించి అతిగా ఆలోచించడం అనవసరం. నాస్తికులయితే అవన్నీ మూఢనమ్మకాలు అని కొట్టి పారేస్తారు!" నన్ను నేను సంతృప్తి పరచుకోవడానికి అన్నట్టు రెండు వేదాంతం ముక్కలు జత కలిపాను.

అయినా రమ సంతృప్తి పడలేదు. మరచిపోలేదు. మా ఇంటికి వెళ్లిపోయాక కూడా ఆ సంగతి వదలలేదు. పీడకలలు వస్తున్నాయని గోల పెట్టింది. కొన్ని కలల్లో మా నాన్న తన వంకే రెప్ప వేయకుండా చూస్తున్నాట్ట!

"దీనికి ఏదో పరిహారమో ప్రాయశ్చిత్తమో ఉండే ఉంటాయి... కనుక్కోండి!"

ఆమె పోరు పడలేక, ఆవేదన చూడలేక పురోహితుడిని కలిసి జరిగిందంతా వివరించాను.

"అస్థికలు ఆస్తి కాదు గనుక, విలువ లేదు గనుక పంచుకోకుండా వదిలి పెట్టేసారన్నమాట! తెలివైన వాళ్ళు! ఎంతైనా, చదువుకున్నవాళ్ళు కదా!"

ముఖం ఎర్రగా చేసుకుని ఎంబరాస్సింగా చూశాను.

"నిమజ్జనం చేయడానికి మీ ముగ్గురిలో ఏ ఒక్కరికీ ఏడాది గడిచేదాకా తీరక లేకుండా పోయిందన్నమాట! ఆ కార్యానికీ లాభనష్టాలు బేరీజు వేసుకున్నారు కాబోలు! ఇంతకీ అవి ఎవరివి... మీరు ఇవాళ భూమ్మీద ఇలా నిటారుగా నిలబడటానికి

కారణమైన మీ నాన్నవి! అంతేనా!!"

"దగ్గరైతే అప్పుడే వెళ్లే వాళ్ళం కానీ... ఆఫీసు పని, సెలవు, వెసులుబాటు చూసుకోవాలిగా..!"

"నాకు తెలియక అడుగుతున్నా, రాజమండ్రి కూడా దూరమేనా?"

"దగ్గరే గాని బ్యాంకుల కెళ్ళి నాన్న డిపాజిట్ల వివరాలు తీయడానికి, సర్పంచినీ విలేజ్ అసిస్టెంట్ని అడిగి పొలాల స్థలాల వివరాలు సేకరించడానికి, సక్సెషన్ సర్టిఫికేట్ కోసం తిరగడానికీ మా పుణ్యకాలమంతా ఖర్చు అయిపోయింది! పెద్దకర్మ అవుతూనే ఎవరిళ్లకు వాళ్లం వెళ్లిపోయాం... ఉద్యోగులం కదా!"

"చాలా బాగుంది. వచ్చిపడే వాటికి మైలకాలంలోనే కర్మకాండలు పూర్తి చేయకుండానే కట్టుదిట్టం చేసుకున్నారు. ఆ రంధిలో పడ్డ మీకు అస్థికలు ఎందుకు గుర్తుంటాయిలే! మీకు ఎలా ఉందో గాని నాకు మాత్రం వినడానికే అసహ్యంగా ఉంది. ఆస్తుల కాగితాల మీద ఉన్న శ్రద్ధ, అస్థికల మీద లేకపోయింది. మిమ్మల్ని కన్న తండ్రి పాపం ఎంతటి దురదృష్టవంతుడో అనిపిస్తోంది. మీలాంటి కొడుకుల్ని కన్నందుకు అతడి ఆత్మ భలేగా సంతోషపడుతుందిలే!"

"మాకు తెలియకుండానే మేం చాలా పెద్ద తప్పు చేశాం! ఆ సంగతి ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. అది పాపమే. కాదనను. దానికిప్పుడు పరిహారం చెల్లించడానికి లేదా ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ఎంత ఖర్చైనా పర్వాలేదు. ఏదో మార్గం చెప్పండి..." ఉద్విగ్నుడినయ్యాను.

"చూడు నాయనా! అస్థికల్ని సూర్యగ్రహణం లేక చంద్రగ్రహణం రాకుండానే నిమజ్జనం చేయాలి. లేకపోతే గ్రహణ దోషం వల్ల మైల పడతాయి. అస్థికలు భూమిలో ఉంటే ఆ దోషం అంటదు. కానీ మీదంతా లాకర్ల వ్యవహారమాయె! అక్కడైనా దాని మీద చిన్న దర్భకర్ర వేస్తే ఫర్వాలేదు. మీరు వెయ్యరు. మీకు ఎవరూ చెప్పరు. ఇప్పుడేమైందో చూడండి. మీ నాన్న కాలం చేశాక రెండు గ్రహణాలు వచ్చి వెళ్ళాయి. ఆ తర్వాత అవి అస్థికలు కాదు, కేవలం బూడిదే! కనీసం ఆ బూడిద ఉన్నా, పంచామృతాలతో ప్రాయశ్చిత్తం చేసుకునేవారు. కానీ అదీ లేదు! ఈ పితృ ద్రోహానికి మీకు పితృ దోషం చుట్టుకోక తప్పదు!" శపిస్తున్నట్టుగా అన్నారు.

ఒక పెద్ద అగ్నికెరటం వచ్చి బలంగా నా ముఖాన్ని ఢీ కొట్టింది! మనశ్శరీరాలు రెండూ నిలువునా కాలిపోతుంటే బయటికి పరుగు తీశాను.

సరిగ్గా అప్పుడో సాధువు అటుగా వెళుతూ ఆగి ఇంత బూడిద నా ముఖాన కొట్టాడు!

"బూడిద... బూడిద...!" గగ్గోలు పెట్టాను.

"విబూది!" అన్నాడు.

అది కచ్చితంగా మా నాన్న గొంతే! గబుక్కున పాదాభివందనం చేద్దామని వంగాను.

ఎవరూ లేరు!

# పరిణతి

విజయ శ్రీముఖి

***ఇన్నేళ్ల తర్వాత కూడా చదువుండీ.. ఎందుకీ పిల్లలు ఇంత ఆలోచనా రహితంగా జీవితాన్ని చిందరవందర చేసుకుంటున్నారు? వీళ్ళ తెలివితేటలు, సాంకేతిక పరిజ్ఞానం శాంతియుతమైన జీవితం కోసం మాత్రం ఉపయోగించుకోవడం లేదు. చెప్పినా వినరు!'***

'ఏమి సేతురా లింగా... ఏమీ సేతూరా

గంగ ఉదకము తెచ్చి నీకు

లింగపూజ చేతమంటే...

గంగనున్న చేప కప్పా

ఎంగిలంటున్నాయి లింగా...

మహానుభావా... మా దేవ శంభో...'

వసారాలో ఉన్న మంచం మీద పడుకుని, నిర్వికారంగా తత్త్వాలు పాడుకుంటున్నాడు శేషయ్య!

తండ్రి వేపు జాలిగా వేదనగా చూశాడు నాగరాజు. అంతకుముందే పక్కవీధిలో ఉండే సోమయ్య వచ్చి గుండెలవిసే వార్త చెప్పివెళ్ళాడు. నాగరాజుకు ఆయన చెబుతున్నప్పుడు శేషయ్య కూడా విన్నాడు. అది విన్న దగ్గర నుండి నాగరాజు గుండె చెరువైపోతోంది.

'సోమయ్య చెప్పిన ఆ వార్తకు నాన్నకు కలవరం కలగలేదా? కలిగిన కలతను కప్పిపుచ్చుకోవడానికేనా ఈ తత్త్వాలు పాడుకుంటున్నాడు?' అనుకుంటూ అవతలకు నడిచాడు నాగరాజు.

'ఏం చేయాలిప్పుడు?' ఇంటి ముందున్న వేపచెట్టు అరుగు మీద కూర్చుని... ఎన్నిసార్లు ఆ ప్రశ్న వేసుకుంటున్నా జవాబు మాత్రం తోచడం లేదు. స్థిమితంగా ఉండలేకపోతున్నాడు. ఊపిరాడనట్లుగా, దాహంతో నాలుక పిడచకట్టుకు పోతున్నట్లుగా... ఉక్కిరి బిక్కిరిగా ఉంది నాగరాజుకు!

పోనీ... ఇరుగుపొరుగుతోనో, రోజూ పిచ్చాపాటీ మాట్లాడే వాళ్ళతోనో చెప్పే... చెప్పుకునే సమస్యా... అంటే కాదు!

'ఏం చేయాలి ఇప్పుడు?' మళ్లీ అదే ప్రశ్న! కొండంత ఉండి, బండలాగా బరువౌతూ ఉంది.

తానెంత మంచిగా అనునయంగా చెప్పాడా రోజు హంసకు? విందా? ఊహూ!

"నాకు నమ్మకం ఉంది నాన్నా! నన్ను నమ్మండి." పదే పదే అదే ఆమె మాట!

“నమ్మకం అనే మాటక్కూడా చాలా పార్శ్వాలున్నాయమ్మా... ఒక్కోసారి అందంగా ఆత్మీయంగా వెంటనే ఆకర్షించేస్తుంది. తెర తొలిగాకే దాని వికృతరూపం బైటపడేది! అగ్నిలా వెలుగులు చిమ్ముతుంది... ఆదమరుపున కాల్చేస్తది. నీరులాగానే అగుపిస్తుంది... దప్పిక తీర్చుకోబోయేలోగా మనల్ని ముంచేస్తది! అసలైన నమ్మకం చాలా నెమ్మదిగా అనుభవంలోకి వస్తుంది...” చెబుతూ కూతురి ముఖంలోకి చూసాడు నాగరాజు.

మౌనంగా వింటోంది హంస.



“ఐనా... ఇంకా చాలా టైముంది. నువ్వు ఈ విషయాలు ఆలోచించకు!” అనునయంగా చెప్పాడు నాగరాజు.

నిశ్శబ్దంగా లేచివెళ్ళింది హంస.

‘ఫరవాలేదు... నా కూతురు తెలివిగలది, ఆలోచించగలదు’ తెరిపినపడ్డాడు ఆ తండ్రి.

ఆలోచనల్లోఉన్న నాగరాజును చూసి, “ఏంటి నాగరాజూ... ఒక్కడివే కూచ్చున్నావ్?” గడ్డిమోపుతో ఆ దారినపోతున్న జమలయ్య ఆగి, చెట్టుక్రింద ఒక్కడే కూర్చున్న నాగరాజుని అడిగాడు.

“అహ... ఏంలేదు బాబాయ్, చెట్టు క్రింద చల్లగా ఉంటేనూ...” చెప్పాడు.

“మీ నాన్నేం చేస్తున్నాడు?”

“ప్రశాంతంగా పడుకుని, తత్త్వాలు పాడుకుంటున్నాడు!” కొంచెం నవ్వి చెప్పాడు నాగరాజు.

“పాడుకోనీరా పాపం! బతుకంతా కాయకష్టం చేసినోడు… మడిసికీ, ఆడి మనసుకీ కూడా శాంతం లేకుండా చేసిపోయేరు మీ ఆడంగులు…” అంటూ సాగిపోయాడు జమలయ్య.

జమలయ్య రాకముందు, జోరీగల్లా ముసిరిన ఆలోచనలు చెదిరిపోయి, ఆయన వెళ్తూ అనేసిన మాటలు నాగరాజు గత స్మృతులను తేళ్లు, జెర్రులుగా తట్టిలేపాయి!

బరువెక్కిన అతని గుండె గునపమై గతాన్ని తవ్వుతోంది… దాదాపు ముప్పైఐదేళ్ల క్రితం…

★★★

తొమ్మిదేళ్ల నాగు, రాత్రి ఎనిమిది గంటలకు నాలుగవ తరగతి పుస్తకాలున్న ఖాకీ గుడ్డసంచిని భుజానికి తగిలించుకుని ప్రైవేట్ నుండి ఇంటికి వచ్చాడు. వాకిట్లో చల్లగాలికి నులకమంచం వేసుకొని పడుకున్న తండ్రిని చూసి అడిగాడు “నాన్నా, అమ్మేది?” అని.

“పేరంటాలమ్మ గుడి దగ్గరకి ఎవరో స్వాములోరు వచ్చారని… ఆయనేదో చెబుతున్నాడని అందరూ ఎళ్తుంటే మీ అమ్మకూడా ఎళ్ళింది. తలుపు తీసి అన్నం తిను పో!” అన్నాడు శేషయ్య.

“నేను కూడా అమ్మ దగ్గరికి వెళ్తాను, వచ్చాక తింటానులే!” అంటూ ఆ వెన్నెల్లో గుడివైపుగా పరుగులు తీసాడు నాగు.

గుడి ముందు అరుగు మీద కూర్చుని ఏదో చెప్తున్నాడు స్వామీజీ. ఆయనకు ఎదురుగా ఇరవైమంది దాకా ఉన్న ఆడవాళ్లు భుజాల నిండా పైటచెంగులు కప్పుకుని ఆయన చెప్పేది భక్తిగా వింటున్నారు. కొద్దిమంది మాత్రమే మగవాళ్ళు ఉన్నారు

తన భుజంపై చేయివేసిన కొడుకుని చూసి ‘ఇష్…మాట్లాడకు’ అన్నట్లుగా సైగచేసి కూర్చోమన్నట్లుగా తన ప్రక్క చోటు చూపింది కావేరి.

స్వామీజీ వైపు చూశాడు, నుదుటన విభూదిరేఖల మధ్య పెద్ద కుంకుమ బొట్టుతో అందర్నీ కలియజూస్తూ చెబుతున్నాడు.

కోడి, వేట, చేపలు లాంటి ఆహారం పాపహేతువని, ఏ జీవిని హింసించకూడదని… చెబుతున్నాడు.

రోజూ గోధుమరవ్వ, పంచదార కలిపి చీమలకు, పళ్ళుగింజల్లాంటివి పక్షులకు పెడుతుంటే ఎంత పుణ్యం వస్తుందో ఉదాహరణగా కొన్ని కథలు కూడా చెబుతున్నాడు..

అవి వింటూ వింటూనే నిద్రలోకి జారిపోయాడు నాగు. అది ఎప్పటికి ముగిసిందో… తల్లితో నిద్రలోనే నడుస్తూ ఇంటికి వచ్చాడు. వాకిట్లో మంచం మీద పడుకున్న తండ్రి పక్కలోకి వెళ్లి పడుకున్నాడు.

“వీడు అన్నం తినలేదు, పెట్టు” భార్యతో చెప్పాడు శేషయ్య.

లేపుతున్న తల్లిని “ఏం కూర?” అని అడిగాడు నాగు.

"చేపల పులుసు" చెప్పింది తల్లి.

"నాకొద్దు" అన్నాడు. అంతకుముందు స్వామీజీ చెప్పిన మాటలు వాడి లేతమనసులో నాటుకుపోయాయి.

"పోనీ... పెరుగు వేసుకొని తినిరా పో!" లేపాడు తండ్రి.

★★★

గుళ్లో ప్రవచనాలు, పతివ్రతామతల్లుల కథలు చెప్పడం ఐపోయాక, ఇంక భజనలు మొదలైనవి, స్వామీజీ ఆధ్వర్యంలోనే! వారాలు వారాలుగా గడిచిపోతున్నాయి!

పల్లెటూరు కనుక గ్రామీణ స్త్రీలకు అదొక సత్కాలక్షేపంగా మారింది.

ఇంతకుముందు వంట చేసి, భర్తకు పెట్టి, ఇల్లు సర్దుకుని, భజనలకు వెళ్లే కావేరి... రానురాను ఎక్కడివి అక్కడే వదిలేసి ఆరుగంటలకే వెళ్లి, గుడి ప్రాంగణానికి చేరుకుంటుంది. ఒక్కోరోజు అన్నం మాత్రం వండేసి, 'ఏదో ఒకటి వేసుకు తినండి' అంటూ వెళ్లి, నడిరేయికి తిరిగి వస్తోంది.

"కొంపా, గోడు పట్టకుండా మరీ భక్తి పిచ్చి ముదిరిపోయింది, తగ్గించు!" అంటూ శేషయ్య కేకలు వేసేవాడు. పట్టించుకునేది కాదు కావేరి.

అమ్మవారికి అరటిపళ్ళు, కొబ్బరి కాయలు... స్వామీజీకి రోజుకొకరు చొప్పున మృష్టాన్న భోజనాలు తెచ్చి సమర్పించుకునేవారు. ఆయన చెప్పినవి విన్నాక వెళ్లబోయే ముందు పాదాలకు నమస్కరించి, ఆశీర్వచనాలు అందుకుని, అక్కడ ఉన్నచిన్న ఇత్తడిపళ్ళెంలో తోచినంత కానుక వేయడం పరిపాటయింది.

స్వామీజీకి కావేరి ప్రియభక్తురాలు ఐపోయింది. అందుక్కారణం ఆమె ఒంటిరంగూ, అవయవసౌష్టవమే! అది ఎంతవరకు వెళ్లిందంటే... ఒకరోజు స్వామీజీ భక్తులందరికీ గత రాత్రి తనకొచ్చిన స్వప్నవృత్తాంతాన్ని సెలవిస్తున్నారు... అందరూ ఆసక్తిగా, ఆతృతగా ఆలకిస్తున్నారు... "మనం కొలుస్తున్న ఈ దేవదేవి కరుణించింది. రాత్రి నా స్వప్నంలో సాక్షాత్కరించింది. ఆ తల్లి చెప్పినది ఏమిటంటే... 'నా అంశను మహిమను కావేరీ అను భక్తురాలిలో ప్రవేశపెడుతున్నాను. ఇన్నాళ్ళు ఆమె భౌతిక లంపటాల్లో కొట్టుకుపోతోంది. అది ముగిసే సమయం ఆసన్నమైంది... ఇకమీదట ఆమె ప్రతి పలుకు నేను పలికించేదే' అని చెప్పిన ఆ తల్లి అంతలోనే అంతర్ధానమైపోయింది!" అని చెప్పాడు స్వామీజీ.

అందరి చూపులు కావేరి వైపుకు మళ్లాయి. ఇవాళ ఆమెలో వింత తేజస్సు కనిపిస్తోంది... నమ్మిన వాళ్ల కళ్లకు! నమ్మలేని వాళ్లు మౌనం వహించారు!

ఆ రోజు నుండి కావేరిని అమ్మవారు ఆవహించి పూనకాలు మొదలైనవి. ఏవేవో చెప్పసాగింది!

రాగా రాగా కావేరి స్నానం కోసం మాత్రమే ఇంటిమొహం చూస్తోంది. భర్త, కొడుకులాంటి భవబంధాలు ఆమె మనసును తాకటంలేదు! స్వామీజీతో పాటు ఆమెక్కూడా సకలం అక్కడే సమకూరుతున్నవి.

భార్య భక్తిని... బైట వారి మాటలను భరించలేని శేషయ్య కావేరిని గుడి వైపు వెళ్లొద్దని కట్టడిచేశాడు. మూడవరోజు

తెల్లారిపాటికి ఇంట్లోని డబ్బు బంగారంతో సహా కావేరి, గుళ్లో స్వామీజీ ఊర్లో నుంచి మాయమైపోయారు.

అసలే మితభాషి ఐన శేషయ్య, అవమానంతో మరింత మూగవాడై పోయాడు. ఉన్న కాస్త పొలాన్ని సాగు చేసుకుంటూ, కొడుకుని సాకుకుంటూ కాలం గడిపాడు.

★★★

ఉన్న ఊర్లోనే పదవతరగతి వరకు చదివిన నాగరాజు, తండ్రి వరికుప్పపై నుండి పడి కాలువిరగడం వలన తన చదువు ఆపేసి ఊళ్లోనే చిన్న ఫ్యాన్సీ షాపు పెట్టుకున్నాడు. పెళ్లయిన పదేళ్లకే ఏడేళ్ల కూతురు హంసను తన చేతుల్లో పెట్టి, నూరేళ్లు నింపుకొంది నాగరాజు భార్య.

"నా తలరాత అట్టా ఏడ్చింది... నీ తలరాతిట్టా తెల్లారింది... మన ఖర్మ!" కొడుకుతో అన్నాడు శేషయ్య.

ఆ ఇద్దరికీ ఆశాదీపం, ఆరో ప్రాణం హంస!

హంస ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో ఉండగా "నాన్నా! ఆన్లైన్ క్లాసులు పెడుతున్నారు, నాకు స్మార్ట్‌ఫోన్ కొనివ్వు!" అని అడిగింది.

కొనిచ్చాడు నాగరాజు.

ఆ తర్వాత అర్థమైంది... అమ్మాయి స్మార్ట్‌ఫోన్‌ని చదువుకు కాక, సరదా కబుర్లకే వాడుకుంటోందని!

"అది తగదమ్మా" అని నచ్చచెప్పాడు... సున్నితంగా మందలించాడు!

"నన్ను అనుమానిస్తున్నావా?" అని ఆవేశపడింది, రోషపడింది.

కానే కాదంటూ అనునయంగా, బుజ్జగించాడు.

ఆ రాత్రి నాగరాజుకు నిద్రలేదు.

'ఈనాటి పిల్లలకు తెలివితేటలు పెరుగుతున్నాయి కానీ, సహనం తగ్గిపోతోందేమో అనిపిస్తుంది. ఇలాంటి పిల్లలు దొరికిన స్వేచ్ఛ, చరవాణిలతో మరింత చెడిపోతున్నారా?' అనుకున్నాడు.

ఇంటర్మీడియట్ పరీక్షలైన నాల్గు రోజులకే హంస ప్రేమపక్షిలా ఎగిరి పోయింది. ఇంట్లో ఒక కాగితం పెట్టి.

'నాన్నా! వినోద్ చాలా మంచోడు...నన్ను ప్రాణంకంటే ఎక్కువగా చూసుకుంటాడనే నమ్మకం నాకుందంటే...

నువ్వు నమ్మకాల మీద నాకోసారి ఉపన్యాసం ఇచ్చావు. పైగా అప్పుడే ప్రేమేమిటి... ముందు చదువు!' అని

కేకలేశావు. అందుకే మీకు దూరంగా వినోద్‌తో వెళ్లిపోతున్నాను. నన్ను వెదకవద్దు! నాకోసం వస్తే మీతో వచ్చేది నా

శవమే!' అని వ్రాసి ఉందా కాగితంలో.

హతాశుడైపోయాడు నాగరాజు

"పిల్ల ఎక్కడుందో ఆరా తీయరా!" అంటున్న తండ్రితో "వద్దు, పోనివ్వు నాన్నా!" విరక్తిగా అన్నాడు.

★★★

దాదాపు సంవత్సరంన్నర తర్వాత... ఈరోజు ప్రక్క వీధిలో ఉండే సోమయ్య వచ్చి చెప్పిన వార్త!

సోమయ్య, ఆయన భార్య కలిసి బెంగళూరులో ఉన్న తమ కూతుర్ని, అల్లుడ్ని చూడటానికి వెళ్లారట. ఒకరోజు వాళ్ల కూతురు తల్లిని తీసుకుని అక్కడ బట్టల షాపుకు వెళ్తే షాపులో సేల్స్‌గర్ల్‌గా హంస కనిపించిందని, తన భార్య ఆ పిల్లను వివరాలు అడిగితే... తీసుకువచ్చిన అతను నాలుగైదు నెలలకే వదిలిపెట్టి వెళ్లిపోయాడని... ఇంటికి రావటానికి మొహం చెల్లక ఇక్కడుండి పోయాను' అని చెప్పిందట హంస!

ఆ రోజుల్లో అమ్మకు చదువులేక, ఎదుటివారి మాయమాటలను గ్రహించే నేర్పులేక... కన్నకొడుకుని, కట్టుకున్న భర్తను వదిలేసి, కపట స్వామితో వెళ్ళిపోయింది.

కొన్నేళ్ల తర్వాత ఎవరి ద్వారానో తెలిసిందిట నాన్నకు... లేపుకుపోయినవాడు కొన్నాళ్లకు వదిలేస్తే, వచ్చిన కడుపుతో ఇంటికి తిరిగి రాలేక, రైలుకింద పడి చచ్చిపోయింది అని!

ఇన్నేళ్ల తర్వాతకూడా చదువుండీ... ఎందుకీ పిల్లలు ఇంత ఆలోచనా రహితంగా జీవితాన్ని చిందరవందర చేసుకుంటున్నారు? వీళ్ళ తెలివితేటలు, సాంకేతిక పరిజ్ఞానం శాంతియుతమైన జీవితం కోసం మాత్రం ఉపయోగించుకోవడం లేదు. చెప్పినా వినరు!' తనలో విసుగ్గా అనుకుంటున్నాడు నాగరాజు

"ఒరే... నాగూ" పిలిచాడు శేషయ్య.

ఆలోచనాపేసి "ఏంటి నాన్నా?" అడిగాడు నాగరాజు.

"ఆ సోమయ్య దగ్గరికి ఎళ్లి... ఆళ్ళ అమ్మాయి అడ్రస్ అడుగు!" అన్నాడు.

"ఎందుకు?"

"ఎందుకేంట్రా... ఎక్కడో అడిగి, ఎళ్లి హంసమ్మని ఇంటికి తీసుకురా!"

విని ఊరుకున్నాడు నాగరాజు.

"ఈ మాత్రం అజ ఆయాళ మీ అమ్మ గురించి తెలిత్తే... నేనెల్లి తీసుకొచ్చేద్దు! ఆళ్లకి తెలిచ్చావక చేసే పనులు రా! ఇయి..."

"..."

"పంతాలు పట్టింపులు పిల్లచేష్టలు రా! పెద్దోళ్ళు పెద్దమనసు చేసుకోవాలె..."

"..."

“మంచో చెడో మన కడుపులోనే దాసుకోవాలి! పయోళ్ళు ఏవనుకుంటారోనని ఆళ్ళమాటలకి, మెప్పుకోళ్లకి చూత్తే... ఏడిచేది మనవూ మన బిడ్డలే!”

“నేను చిలక్కి చెప్పినట్టు చెప్పాను నాన్నా... వినిపించుకుందా? నమ్మకం ఉందంట నమ్మకం...”

“అయ్యన్నీ వదిలేయ్‌రా... ఒకోసారి శని అమ్మోరు పలికిచ్చే మాటలయి! దానికింకా బోలెడు బతుకుంది. ఎల్లు ముందు!” తొందరపెట్టాడు శేషయ్య.

తండ్రి మాటలు సమంజసంగా అనిపించాయి నాగరాజుకు.

# దేవుడా ఏమి నీ కోరిక!

విజయార్కె
✆ 9700289681

***“మరి నైవేద్యం ఎందుకు తింటున్నావు” “నాకు నైవేద్యం పెడుతున్నారు కాబట్టి”***
***“మరి ముడుపులు ఎందుకు స్వీకరిస్తున్నావు?” “నాకు వాళ్ళే ముడుపులు చెల్లిస్తున్నారు కాబట్టి”***
***“అయితే నిన్ను నేను ఒకటి కోరుకోవచ్చా?” అడిగింది ప్రద్య. “కోరుకో తల్లీ...”***
***“నా ఫ్రెండ్ రిత్వికకు క్యాన్సర్ అట! తను చచ్చిపోతుందిట... తనను కాపాడి నా ప్రాణం తీసుకో పాపం రిత్విక ఏడుస్తుంది!” అమాయకంగా అంది ప్రద్య.***

ఒక్కసారిగా కలకలం! పూజగదిలో దేవుడికి పెట్టిన నైవేద్యం మాయం! ఆ ఇంట్లో ఈ దృశ్యం చూసి మొట్టమొదటిసారిగా షాకైన వ్యక్తి వసుధ!

ఆ రోజు పొద్దున్నే లేచి తలారా స్నానం చేసి, దేవునికి పాయసం, పరమాన్నం నైవేద్యంగా పెట్టింది. కళ్ళు మూసుకుని దేవుడిని ప్రార్థించింది. కొబ్బరికాయ కొట్టింది, అటో కొబ్బరి చిప్ప, ఇటో కొబ్బరి చిప్ప పెట్టింది, హారతి ఇచ్చింది. అలా వంటగదిలోకి వెళ్లి, పూజగదిలోకి తొంగి చూసి స్థాణువైనది!

ఒకటికి పదహారుసార్లు కళ్ళు నులుముకుని మరీ చూసింది. వెండిగిన్నెలో పెట్టిన పాయసం, స్టీల్ ప్లేట్ లో పెట్టిన పరమాన్నం మాయమయ్యాయి. కొబ్బరిచిప్పల్లో ఒక కొబ్బరిచిప్ప మాయమైంది. వసుధ మొట్టమొదటి అనుమానం... మొగుడి మీదకు మళ్లింది. పైగా పాయసం చూడగానే నాలుక తడుపుకుని “ముందు తినేద్దాం...” అన్నాడు. పైపెచ్చు... ఇలాంటి నమ్మకాలూ గట్రా లేవు. “అయినా నీ దేవుడు తింటాడా? ఏదో నీ తృప్తి కోసం! ఎటూ దేవుడు తినడని నైవేద్యం పెడుతున్నావు గానీ,..” అంటూ సెటైర్లు వేసాడు.

తనని ఏడిపించడానికి నైవేద్యం తిని కొబ్బరిచిప్ప దాచి, ఇలా చేస్తున్నాడేమో... పడగ్గదిలోకి వెళ్లి ముసుగు తన్ని పడుకున్న భర్తను కుదిపి లేపింది. రెండు చేతులు తలకింద దిండులా పెట్టుకొని కళ్ళు మూసుకున్నాడు.

“నేను గొంతు చించుకుని అరుస్తుంటే కనీసం ‘ఊ’ అనొచ్చుగా!” అంది ఉక్రోషంగా.

“ఊ” అని మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు వసుధ భర్త విహారి.

“అదేంటి నాలుగు మాటలు మాట్లాడితే మాటల్లోని రత్నాలు రాలిపోతాయా?” రుసరుసలాడుతోంది. “నేను నీ దేవుడిని అన్నావుగా” తాపీగా అన్నాడు విహారి.

“అన్నాను! అంటే అదేమైనా నేరమా... అలా అన్నానని మాట్లాడరా?”

“దేవుడు మాట్లాడకపోయినా, భక్తితో రోజూ పూజ చేస్తూ వుంటావుగా! నీ పతిదేవుడు ఒక్కసారి మాట్లాడకపోతే అంత కోపమెందుకు డియర్” నవ్వుతూ అన్నాడు విహారి.

ఉక్రోషాన్ని దిగమింగి, అసహనాన్ని వెళ్లగక్కింది. అనుమానాన్ని కక్కేసింది.

"ముందు పూజగదిలో ఉన్న దేవుడి సంగతి చూడండి." అని. ఎందుకైనా మంచిదని మొగుడి మూతి వంక చూసింది. ప్రసాదం తిన్న దాఖలాలు కనిపించలేదు.

"పూజగదిలో ఉన్న దేవుడికి ఏమైంది?" బద్ధకంగా అడిగాడు విహారి.

"దేవునికి ఏమీ కాలేదు. దేవుడికి పెట్టిన నైవేద్యం మాయమైంది. కొబ్బరిచిప్ప కనిపించడం లేదు!" గబగబ చెప్పింది.



"నీకు చత్వారమో, అనుమానమో... రెండింటిలో ఏదో ఒకటి ఎక్కువైంది. దేవుడిగదిలో నైవేద్యం మాయమవడం ఏమిటి? సరిగ్గా చూడు. లేదంటే నీ ముద్దుల కూతురు ప్రద్యను అడుగు. పొద్దున్నే ఎవరైనా 'అమ్మా ఆకలి' అని వచ్చి ఉంటే 'పోనీలే పాపం' అని వాళ్లకు పెట్టేసిందేమో! అసలే జాలిగుండె!" కూతురిని ముద్దు చేస్తూ అన్నాడు విహారి.

వెంటనే మొగుడు ముద్దుగా కూతురిని పొగిడి చెప్పిన స్కూల్‌కు రెడీ అవుతున్న ప్రద్య దగ్గరికి వెళ్లి అనుమానంగా అడిగింది.

"లేదు మమ్మీ..." చెప్పింది ఆరేళ్ల కూతురు ప్రద్య.

కూతురు అబద్ధం చెప్పదని తెలుసు. అందుకే ఈ పని ఎవరు చేసి ఉంటారా? అని మళ్ళీ ఎంక్వయిరీ మొదలుపెట్టింది. వసుధ అనుమానం కొత్తగా చేరిన పనిమనిషి కుసుమ మీదకి మళ్లింది. కిచెన్‌లో అంట్లు తోముతున్న కుసుమ దగ్గరికి వెళ్ళింది. అటువైపు తిరిగి అంట్లు తోముతోంది.

"కుసుమా..." అని పిలిచింది.

వెంటనే ఉలిక్కిపడి వెనక్కి తిరిగి "మీరా అమ్మా..." అంది.

పరిశీలనగా చూసింది. కుసుమ నోరు వైపు చూసింది. కుసుమ చేతులు చూసింది. చిన్న అనుమానంతో "కుసుమా... పాయసం ఎలా వుంది?" అతి తెలివితో అడిగింది.

"పాయసమా... మా ఇంట్లో పాయసం చేసుకోలేదమ్మా! పొద్దున్నే నిన్న మిగిలిన అన్నం ఉంటే, పచ్చడితో తినేసి వచ్చాను!" అమాయకంగా చెప్పింది.

“నేను అడిగింది పూజగదిలో ఉన్న దేవుడికి నైవేద్యంగా పెట్టిన పాయసం!” అంటూ పనిమనిషి ముఖకవళికలు డిటెక్టివ్‌లా పరిశీలించింది.

ఏమాత్రం తొట్రుపాటు లేకుండా “అదేమిటమ్మా... పూజ అయ్యాక కదా, మీరు పాయసం పెట్టేది. అదీ అందరూ తినేసాక మిగిలిపోతే” నిజాయితీగా చెప్పింది.

ఆ మాటతో ఏమనాలో తోచక పూజగది వైపు వెళ్ళింది.

అప్పటికే విహారి స్నానం చేసి వచ్చాడు. “ఏమైందోయ్ భార్యామణి. నీ డిటెక్షన్ ఎంతవరకు వచ్చింది?” నవ్వుతూ అడిగాడు భార్యను.

“అసలే నైవేద్యం ఏమైందని నేను బుర్ర బద్దలు కొట్టుకుంటుంటే, మీ సెటైర్స్ ఏమిటి? అయినా దేవుడికి పెట్టిన నైవేద్యం ఏమై ఉంటుంది? మనమే తింటాం కదా అని బోల్డు నెయ్యి, కిస్మిస్, జీడిపప్పు వేసాను. కొబ్బరిచిప్ప పచ్చడికి పనికి వస్తుందనుకున్నాను!” తనలో తానే గొణుక్కుంటున్నట్టు అనుకుంది వసుధ.

“పోనీలే ఈ ఒక్కరోజు ఆ దేవుడే నీ నైవేద్యం తిన్నాడనుకో!” అన్నాడు విహారి.

ఆ మాటతో కంగారుగా మొగుడి వంక చూసింది. ‘నవ్వుతూ అన్నా ఇది నిజం కాదు కదా’ అన్నట్టు చూసింది. ఈ నైవేద్యం మాయమైన మిస్టరీ అంతు చూసే వరకు తనకు నిద్ర పట్టదు. దీని అంతు తేల్చాల్సిందే అనుకుంది. ఈలోగా కూతురు రెడీ అయ్యింది. పూజగదిలోకి వెళ్లి దేవుడికి మొక్కుకుంది. రోజూ దేవుడికి మొక్కుకుని బడికి వెళ్తుంది. దేవుడితో అన్నీ చెప్పుకుంటుంది ప్రద్య. దేవుడు తన మాటలు వింటున్నట్టు ఫీలవుతుంది.

పనిమనిషి వెళ్ళిపోయాక, కూతురు బడికి, మొగుడు ఆఫీస్‌కు వెళ్ళిపోయాక, మరోసారి పూజ గది మొత్తం అణువణువూ శోధించి గాలించింది. దీని సంగతి తేల్చాల్సిందే అనుకుంది.

మర్నాడు ఎప్పుడు తెల్లారుతుందా... అని ఎదురు చూసింది.

తెల్లారగానే పాయసం చేసింది. పాయసంలో ఈసారి జీడిపప్పు తగ్గించింది. చిన్న కొబ్బరికాయ కొట్టింది. పరమాన్నంలో బెల్లం, పాలు తగ్గించింది. పూజగదిలో పెట్టి తలుపులు వేసి, దూరంగా వెళ్లి నిలబడింది. వసుధ దృష్టి అంతా పూజగది మీదే! పది నిమిషాల వ్యవధి తర్వాత భర్తను లేపి, పూజగది తలుపులు తెరిచి, చూసి స్థాణువైనది. ప్రసాదం లేదు. పరమాన్నం, పాయసం, కొబ్బరిచిప్ప మాయం!

ఈసారి భయంగా భర్త వైపు చూసింది.

“ఏమిటండీ ఇది.. వేసిన తలుపులు వేసినట్టే ఉన్నాయి. నైవేద్యం ఏమైంది?” భయంగా అడిగింది. “అప్పుడెప్పుడో వినాయకుడు పాలు తాగినట్టు పూజగదిలో దేవుడు నైవేద్యాన్ని స్వీకరించాడేమో, నీ భక్తికి మెచ్చి!” నవ్వుతూ అన్నా సీరియస్‌గా ఆలోచిస్తూనే ఉన్నాడు. అతనికీ మిస్టరీగానే ఉంది.

“నిజంగా నైవేద్యాన్ని దేవుడే తిన్నాడంటారా? అయినా దేవుడు తినడం ఏమిటి?” తనలో తనే గొణుక్కున్నట్టు అంది వసుధ.

"ఓ పని చేద్దాం. పూజగదిలో సీసీ కెమెరా పెడదాం. అప్పుడు కరెక్ట్‌గా తెలుస్తుంది!" సాలోచనగా అన్నాడు విహారి.

వెంటనే ఆచరణలో పెట్టింది వసుధ. సీసీ కెమెరా పూజ గదిలో ఫిక్స్ అయ్యింది.

"దేవుడు అపార్థం చేసుకుంటాడేమో..." చెంపలు వేసుకుంటూ అంది వసుధ.

"నువ్వే దేవుడికి ఏదో సర్ది చెప్పేయ్... ఓ వెయ్యి నూట పదహార్లు ముడుపు కట్టి, దేవుడి దగ్గర పెట్టెయ్. అప్పుడు దేవుడు అపార్థం చేసుకోడు!" చెప్పాడు భార్యలో భయాన్ని పోగొట్టడానికి.

అలాగే వెయ్యి నూట పదహారు రూపాయలు ముడుపు కట్టి దేవుడి దగ్గర పెట్టింది. పూజగదిలో సీసీ కెమెరా పెట్టినందుకు పరిహారంగా!

మరుసటి రోజు యథావిధిగా నైవేద్యం పెట్టి పూజగది తలుపులు వేసింది. క్షణక్షణం ఉత్కంఠ... భారంగా పది నిమిషాలు గడిచాయి. పూజ గది తలుపులు తెరిచి చూస్తే నైవేద్యం లేదు. సీసీ టీవీ ఫుటేజ్ చూస్తే... ఆరు నుంచి ఏడో నిమిషం మధ్య ఫుటేజ్ రికార్డు కాలేదు. విహారి చిత్రంగా దేవుడి విగ్రహం వైపు చూసాడు. దేవుడి విగ్రహం పెదవుల మీద నైవేద్యం అంటుకుని వుంది. దేవుడి విగ్రహం ముందు ముడుపు కట్టిన డబ్బు అదృశ్యమైంది.

విహారి వణుకుతున్న చేతులతో దేవుడి విగ్రహం వైపు చూపించాడు.

"దేవుడు నైవేద్యాన్ని స్వీకరిస్తున్నాడు... ముడుపులు తీసుకుంటున్నాడు!" చెప్పాడు లోగొంతుకతో.

"నేను నమ్మలేకపోతున్నాను" అంది వసుధ ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు.

"మనం మాటవరసకు అన్నా, దేవుడు నైవేద్యంగా స్వీకరిస్తున్నాడు. ముడుపులు కూడా స్వీకరిస్తున్నాడు" చెప్పాడు విహారి.

ఈ మాటలు చిన్నారి ప్రద్య వింటూనే వుంది. వసుధ వెంటనే తన స్నేహితురాలికి ఫోన్ చేసింది.

"నేనే నీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను! నాకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. రోజూ నైవేద్యం మాయమవుతుంది. అందుకే వారానికి రెండు రోజులు మాత్రమే నైవేద్యం పెడుతున్నాను. అదీ కొద్దికొద్దిగా... కొబ్బరికాయ వారానికి ఒకసారి కొడుతున్నాను. మొన్న మన కృష్ణవేణి, వాళ్ళ అబ్బాయికి వీసా వస్తే నిలువుదోపిడీ ఇస్తానని మొక్కుకుందిట, వీసా వచ్చింది! తెల్లారి లేచి చూసేసరికి ఒంటి మీద నగలు లేవు..." చెప్పింది.

"అంటే దేవుడితో జాగ్రత్తగా ఉండాలి!" అంది కాస్త భక్తిగా, ఇంకాస్త భయంగా!

తను కూడా వారానికి ఒకసారి నైవేద్యం పెట్టాలని నిర్ణయించుకుంది. దేవుడిని తనకు లాభం ఉండే విధంగా ఎలాంటి కోరికలు కోరుకోవాలి, వాటికీ ఎంత ముడుపు కట్టాలో_ _ _ ఆలోచిస్తుంది.

తెల్లారి లేచి చూసేసరికి ప్రద్య కనిపించలేదు. కంగారుగా ఇల్లంతా వెతుకుతుంటే... పూజ గది తలుపులు మూసి ఉన్నాయి. లోపలి నుంచి మాటలు వినిపిస్తున్నాయి. ప్రద్య మాటలతో పాటు, అశరీరవాణి మాటలు. "దేవుడా నువ్వే నైవేద్యం తింటున్నావా?" ప్రద్య గొంతు అది.

"అవును ప్రద్యా." దేవుడి మాటలు.

"నీకు కూడా ఆకలి వేస్తుందా?"

"మాకు ఆకలి దప్పికలు వుండవు."

"మరి నైవేద్యం ఎందుకు తింటున్నావు"

"నాకు నైవేద్యం పెడుతున్నారు కాబట్టి"

"మరి ముడుపులు ఎందుకు స్వీకరిస్తున్నావు?"

"నాకు మీరే ముడుపులు చెల్లిస్తున్నారు కాబట్టి"

"అయితే నిన్ను నేను ఒకటి కోరుకోవచ్చా?" అడిగింది ప్రద్య.

"కోరుకో తల్లీ.."

"నా ఫ్రెండ్ రిత్వికకు క్యాన్సర్ అట! తను చచ్చిపోతుందిట... తనను కాపాడి నా ప్రాణం తీసుకో. పాపం రిత్విక ఏడుస్తోంది!" అమాయకంగా అంది ప్రద్య.

అంతే... ఒక్క ఉదుటున వసుధ పూజ గది తలుపులు తెరిచి బిడ్డను లాక్కొచ్చింది. కోపం, దుఃఖం, భయం... అన్నీ కలిగాయి. "నీకేమైనా పిచ్చా... నీ ఫ్రెండ్ కోసం." వసుధకు దుఃఖం ఆగడం లేదు. విహారి కూడా మొదటిసారి భయపడ్డాడు.

★★★

ఒక అద్భుతం జరిగినట్టు రిత్విక కోలుకుంది. దానితో వసుధ మొహంలో భయం మొదలైంది.

"దేవుడా నా బిడ్డ తెలియక మొక్కుకుంది. కావాలంటే నా ప్రాణం తీసుకుని నా బిడ్డను బతికించు" వసుధ దేవుడి ముందు మోకరిల్లింది.

మొదటిసారి విహారి దేవుడిని వేడుకున్నాడు. "నా భార్యను బిడ్డను బ్రతికించి నా ప్రాణం తీసుకో" అని. ఆ రాత్రి అంతా నిద్ర లేదు. కళ్ళు తెరిచేసరికి తెల్లవారింది.

తన బిడ్డ బ్రతుకు తెల్లారిందా?

భయంతో పక్కలో చూస్తే కూతురు లేదు. పూజగది తలుపులు వేసి వున్నాయి. కూతురి మాటలు వినిపిస్తున్నాయి "దేవుడూ నువ్వు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నావు. నా ప్రాణం తీసుకో, మా అమ్మానాన్నలు ధైర్యంగా ఉండేలా చూడు!" చిన్నారి ప్రద్య వేడుకుంది. ప్రద్య పెట్టిన నైవేద్యం అలాగే వుంది. పొద్దున్నే తన కోసం తల్లి ఇచ్చే అరటి పండ్లు దేవుడికి పెట్టింది. అవి అలాగే వున్నాయి.

"చిట్టితల్లీ... భక్తులు మొక్కుబడిగా, దేవుడు తినడం లేదన్న ధైర్యంతో నైవేద్యం పెడుతున్నారు. నేను తింటానని తెలిసాక, నైవేద్యం పలుచబడింది. స్వార్థంతో మొక్కుబడిగా పెట్టే నైవేద్యం, నేను స్వీకరించి ఏం చేస్తున్నానో చూడు..." దేవుడు ప్రద్యకు దివ్యదృష్టి ప్రసాదించాడు.

దేవుడు కొన్ని వేల మంది పేదలకు, అనాథలకు ఒక తేజస్సు మూర్తీభవించిన సాధువు రూపంలో అన్నదానం చేస్తున్నాడు. భక్తులు పెట్టిన నైవేద్యం అన్నార్తుల ఆకలి తీరుస్తోంది.

"భక్తుల ముడుపులు మొక్కులు లేమితో ఉన్నవారికి చేరుతాయి!"

"నువ్వు మంచి దేవుడివి!" దేవుని పాదాలు చుట్టేసుకుంది ప్రద్య.

వసుధ, విహారి ఏకధాటిగా ఏడుస్తున్నారు. పూజగది తలుపులు బాదుతున్నారు భయంతో... బాధతో... ప్రద్య కళ్ళు తెరిచి చూసింది. తను మెరిసిపోతుంది.

"నన్ను నీ దగ్గరికి తీసుకువెళ్తావా?" దేవుడిని అడిగింది.

"లేదు. నువ్వు సంపూర్ణ ఆయుష్షుతో జీవిస్తావు!"

"అదేంటి నేను మొక్కుకున్నానుగా?"

"దేవుడికి మీ మొక్కులు ముడుపులు అవసరం లేదు! నీ కోరికలో స్వార్థం లేదు. మంచితనం ఉంది. మానవత్వం ఉంది. అందుకే నీ కోరిక నెరవేర్చాను!"

"మా అమ్మానాన్నలు మొక్కుకున్నారుగా?"

"వాళ్ళు కూడా నీ ప్రాణం కాపాడడానికి వాళ్ళ ప్రాణం ధారపోస్తామని మొక్కుకున్నారు. మనుష్యుల స్వార్థం కోసం దేవుడిని వాడుకోవద్దు! మనసులో ధ్యానించుకుని మంచి పని చేస్తే చాలు. నిజాయితీగా ఉండి కృషి చేస్తే చాలు!" పూజగదిలో దేవుడి మాటలు ఆగిపోయాయి. తలుపులు తెరుచుకున్నాయి.

ప్రద్య బయటకు వచ్చింది. వసుధ, విహారి పూజగదిలో దేవుడి విగ్రహం వైపు చూస్తూ చేతులు జోడించారు. భక్తులు అవసరంతో, అవకాశవాదంతో ఎన్నో కోరుకుంటుంటారు. దేవుడు మాత్రం ఒకటే కోరుకుంటాడు.

"దేవుడా ఏమి నీ కోరిక ? అని అడిగితే...

"మీ స్వార్థం కోసం నన్ను పూజించకండి." అని!

ఆ దేవుడి మనసులో మాట... ఈ కథ !

# పసినికాయ

## వాడవల్లి పూర్ణ కామేశ్వరి

***ఆ పసిమనసుని చూసుకుంటావు కదూ... నన్ను చంటిపిల్లను చేసి చూసుకుంటున్నాననుకున్నాడు ఆ వెర్రి నాగన్న! వాడి గారాంతో నేను చంటిపిల్లనే అయ్యాను. కానీ అమ్మ మనసు వాడి గురించి ఆలోచిస్తూనే ఉంటుందని వాడికి తెలియనివ్వనేలేదు. నా మాటను మన్నిస్తావని ఆశిస్తూ...***

“హరీ, హరీ! ఇంకా లేవలేదా? ఇవాళ కృష్ణాష్టమి!! బోలెడు పనులున్నాయి. త్వరగా తెంవలాలి” అంటోంది అన్నపూర్ణమ్మ. వేకువఝాము కోడి కూయలేదు. పొద్దుపొడకుండా మూడో గంటకల్లా నిద్ర లేచి చేస్తున్న హడావుడి అది.

‘ఈ రోజు కృష్ణాష్టమి వంక అని కానీ, రోజూ ఇదే వరస కదమ్మా’ మనసులో అనుకుంటూ... “అమ్మా! అది సరేగానీ... నిన్న వార్తాపత్రికలన్నీ చదివావా?” అమాయకంగా అడిగినట్టుగా ఉన్నా, మాట మారుస్తున్నది... అమ్మ పసిగట్ట కూడదని ముక్కోటి దేవుళ్ళనీ మనసులోనే వేడుకుంటూ అన్నాడు.

“అవున్రా హరీ! ఈ కృష్ణాష్టమి సందడిలో పడి ఆ విషయమే మరిచిపోయాను సుమా!” కృష్ణాష్టమిపై సారించిన దృష్టి ఇప్పుడు మరో క్లిష్టమైన సమస్యపైకి మళ్ళింది. ముంచుకొస్తున్న సమస్య గురించిన బెంగనంతా వెళ్ళకక్కడం మొదలెట్టింది అన్నపూర్ణమ్మ.

అమ్మకు కాఫీ ఇవ్వడాన్ని ఐదింటిదాకా వాయిదా వెయ్యచ్చునని దృష్టి మళ్ళించిన హరికి, ఇప్పుడు మరో సమస్య ఎదురయ్యే ప్రమాదం లేకపోలేదు. ఐనా సరే, అమ్మ మాట కొట్టెయ్యడం ఇష్టం ఉండదు.

“ఇదిగో హరీ... మనం ఇంక ఇక్కడుండడం క్షేమం కాదు! మన కల్పాకం రేవుకి దగ్గర్లోనే ఆ చైనా వారి ఓడ నిలపబడి ఉంది. అది గూఢచారి ఓడనీ, లంకకే సమీపంగా ఉందనీ అనుకుని ఊరుకోవడానికి లేదు. దానివల్ల మనకు ముప్పు తప్పక రావచ్చు. అంచేత మనం మన ఊరు వెళ్ళిపోవడం మంచిది. వెంటనే సామాన్లన్నీ సద్దు!” కంగారుగా అంది.

కాఫీని గంటపాటు సడలించడం కోసం చేసిన ప్రయత్నం మకాం మార్చడానికి వచ్చింది. అరవై ఏళ్ళుగా మద్రాసులో మకాం ఉంటున్న ఎనభై ఆరేళ్ళ అన్నపూర్ణమ్మ... ఇప్పుడు ఈ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది హరికి!

బిగ్గరగా ఊపిరి పీల్చుకుంటూ కొత్త సమస్యను ఎదుర్కొందుకు సిద్ధమౌతున్నాడు హరి.

“అలాగే నమ్మా, ఇంతలో నువ్వు బెంగ పెట్టుకోకు. ఏదో దారి దొరుకుతుందిలే! మరో రెండు రోజుల్లో ఆ ఓడను తరలించాలని ప్రభుత్వాలు మాట్లాడుకుంటున్నాయిగా...” సద్దిచెప్పాడు.

తెల్లవారు ఝామున అమ్మను మాటల్లో పెట్టకపోతే మూడో గంటకే కాఫీ పెట్టమంటుంది. హైపరేక్టివ్‌గా వున్న అమ్మ

సంధించే ఎన్నెన్నో ప్రశ్నలకు జవాబులు సిద్ధం చేసుకుంటూ, చెప్పలేకపోతే, "నీకసలు ఉద్యోగం ఎవరిచ్చారు? బొత్తిగా ఏదీ తెలికుండా ఉన్నావు." అని అమ్మ పెట్టే నాలుగూ తింటూ ఉండడం హరికి షరా మామూలే! మొన్నటికి మొన్న ఉదయాన్నే రెండో గంటకు లేచి, అది మధ్యాహ్నం అన్న వాదన. అమ్మన్నదే 'సరి' అని ఒప్పుకుని గుప్పెడు పెరుగన్నం తినిపించి పడుకోపెట్టవలసి వచ్చింది.

అమ్మ ఈ రోజున కనీసం ఇలా ఉందంటే అది నాలుగేళ్ళ సుదీర్ఘ ప్రయాస ఫలితమే! అమ్మ ఉన్న నాటి స్థితిని తల్చుకుంటే ఇంకా మనసు వికలమౌతుంది. ఆ సంఘటన ఇప్పటికీ హరి కళ్ళల్లో మెదుల్తూనే ఉంది.

★★★



"నాకు మందు అవసరం లేదు, అందరూ వెళ్లిపొండి. నేను బతకను. నన్ను మీరెవ్వరు బతికించలేరు. బతికించనవసరం లేదు!" మూడేళ్ళ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఒక్కసారిగా పొంగిన ఉప్పెన అది.

భర్త కన్నుమూసిన నాటి నుంచీ, పసినికాయగా అల్లుకుంటున్న గూటిలోకి పట్టుపురుగు కూరుకుపోతున్నట్టు వెళ్లిపోయింది అమ్మ. తెలియని నిశ్శబ్దంలోకి జారుకుంది. తన వాళ్ళెందరు చుట్టూ ఉన్నా ఒంటరినన్నట్టు, ఏవో చీకట్లు తనను ఆవరించినట్టు అనిపించేది. అది యాభైయ్యేళ్ళ అనుబంధం మరి. ఎలాంటి హెచ్చరికా లేకుండా ఒక్కసారి విడిపోయింది.

తేరుకోడానికి కొంత సమయం పడుతుందిలే అనుకున్నారు ఐనవారు! కడుపున పుట్టిన పిల్లలూ ఏమీ చేయలేకపోయారు. పదమూడో రోజు ఎవరి గూళ్ళకు వారెగిరిపోయారు. రోజులు సంవత్సరాలయ్యాయి. బరువుగానే సాగాయి.

అన్నిటికీ ఓ హద్దున్నట్టే, హరి ఓపికా హద్దులు దాటింది! చేజారి పోతున్న అమ్మ ఊపిరిని గట్టిగా పట్టుకుని కాపాడాలన్న ప్రయత్నంతో పెద్దాసుపత్రికి తీసుకెళ్ళాడు. కానీ, పరిస్థితి చూస్తుంటే ఆ ఆశ కూడా సన్నగిల్లింది. అమ్మది శారీరక సమస్య కాదు, మానసిక సమస్య! దీర్ఘకాలిక యత్నంతో కానీ కొంతైనా మెరుగుపడే అవకాశం లేదని వైద్య నిపుణుల తేల్చేశారు.

"ఇంక నిర్ణయం తీసుకోవాలి. మానవ ప్రయత్నం చేయాలి. నా తల్లిని నేనే కాపాడుకునేందుకు నా వంతు కృషి చేసానన్న

తృప్తైనా నాకు మిగలాలి. ఏ ప్రయత్నమూ చేయకుండా అమ్మను పోగొట్టుకోలేను!" మనసు నిండా బలాన్ని కూడగట్టుకుని డాక్టరుగారి గదికి పరుగు తీసాడు శ్రీహరి.

"ఆమె డిప్రెషన్ స్టేజీ దాటి, ఇప్పుడు హిస్టీరిక్ స్టేజిలో ఉన్నారు. మీరు ఆమెను ఒంటరిగా హేండిల్ చేయడం ఇంపాజిబుల్!" కూడకట్టుగున్న ధైర్యంపై చన్నీళ్ళు గుమ్మరించినట్టు అన్నాడు డా.వికాస్.

"లేదు డాక్టర్ గారూ... నేను నిశ్చయించుకున్నాను. దయచేసి అమ్మను డిస్చార్జి చేయండి!" దృఢంగా చెప్పాడు శ్రీహరి.

"ఈ నిర్ణయం మీరు చేసే సాహసమే అవుతుంది. ఆపై ఆమె ప్రాణాల మీదకు వచ్చినా, మమ్మల్ని అని ప్రయోజనం ఉండదు!" నిష్ఠూరంగా అంటూ నిష్క్రమించాడు డా.వికాస్.

★★★

ముప్పైయేళ్ళ ప్రభుత్వ సర్వీసు పూర్తైయ్యింది. రెండో ఆలోచన లేకుండా, స్వచ్ఛందంగా పదవీ విరమణను ఆమోదించమంటూ దరఖాస్తు పెట్టుకున్నాడు. నెల్లాళ్ళ నోటీసు సమయంలో ఉద్యోగ బాధ్యతలు తొలగిపోతాయి. సెలవు పెట్టేసాడు.

'నేను చేస్తున్నది చాలా పెద్ద సాహసమే! ఐనా సరే, పరిస్థితుల బలహీనతలకు లొంగిపోయి అమ్మను బలి చేయలేను. ఇదంతా అనవసరంరా అని అక్కయ్యలతో నాలుగు మాటలు పడవలసి వస్తుందని, అసలు ప్రయత్నమే చేయకుండా ఉండలేను. ఈ సాహసం నాదే. దీని పర్యవసానానికీ నేనే బాధ్యుణ్ణి!' దృఢంగా సంకల్పించుకున్నాడు.

★★★

ఊపిరి ఆడడం మినహా ఇంచుమించు శవంగా పడివున్న అమ్మను ఇంటికి తీసుకొచ్చాడు. ఏ విషయం గురించీ చలించని, ఏ మాటకూ ఆసక్తి చూపని ఆమ్మను మామూలు మనిషిని చేయాలనుకున్నాడే కానీ, ఎలాగో తెలియలేదు. సతమతమయ్యాడు.

"అక్కయ్యా, నాదో విన్నపం! హరిణిని కాస్త రోజూ వచ్చి అమ్మను పలకరించి వెళుతూ ఉండమని చెప్పవూ! 'అమ్మమ్మ ఏమీ మాట్లాడదుగా, నేనెళ్ళి ఏం మాట్లాడతాను' అనుకోకుండా వచ్చి స్పందించినా లేకున్నా నాలుగు మాటలు చెప్పి వెళుతూ ఉండమను. నాకది చాలు. నేను చేస్తున్న ప్రయత్నంలో ఇదొక్కటే నేను మీనుండి ఆశించేది!" అన్నాడు.

'ఏఁవిటో వీడి పిచ్చి కానీ, ఇక అమ్మలో సకారాత్మక మార్పు వస్తుందన్న ఆశ నాకు మాత్రం లేదు!' మనసులోనే అనుకుంది పెద్దక్క కాత్యాయని.

బాహ్యంగా ఎన్ని చేసినా అమ్మ మారదు. అమ్మ ఆంతరంగ బలమొక్కటే ఆమెను మామూలు మనిషిని చేయగలదు. విషయం అర్థం చేసుకున్న క్షణం నుంచే ప్రయత్నం మొదలు పెట్టాడు. ఫలితం ఉండవచ్చును లేకపోవచ్చును... వెంట్రుకపోచ మాత్రంగా ఉన్నా అందుకు చాలా కాలం వేచి ఉండాలనీ తెలుసు. అందుకు సిద్ధపడ్డాడు కూడా!

★★★

"అమ్మా, ఈ పుస్తకం చూడు! ఇందులో కథెంత బావుందో తెలుసా? నాలుగు లైన్లు చదువమ్మా! నీకిష్టమైన భేతాళుడి కథ ఉంది! చిన్నప్పుడు నాకు చందమామలో చెప్పేదానివి!"

ఎలాంటి చలనమూ లేదు.

"సరే, నేనే చదువుతాలే. నువ్వు విను, చాలు" అంటూ నెమ్మదిగా చదివాడు. రోజుకో గంటతో మొదలు పెట్టి పెంచుకుంటూ వెళ్ళాడు.

అలా నెలల తరబడి కథలు చదవడం అవుతోంది కానీ, ఏమాత్రం చలించలేదు అన్నపూర్ణమ్మ. హరి ఓర్పుకు జవాబుగా ఆమెలో చలనం కనిపించింది ఒక శుభదినాన! తనకిష్టమైన మరో కథకు చిన్నపాటి స్పందన చూపింది. మొదటి మెట్టు దాటాడు. ముందుకు సాగాడు. క్రమేపీ ఆమెలో ఆసక్తి పెరగడం జరిగింది.

కరువులో అధిక మాసమన్నట్టు అంతలోనే నీళ్ళగదిలో కాలుజారి పడడంతో పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది.

కళ్ళు మూసుకుని మంచమ్మీదే ఉన్న అమ్మకు చదివి వినిపించడం కొనసాగుతూనే ఉంది. క్రమేపీ కొద్దిగా లేచి కూర్చో పెట్టి చదవమనడం అలవాటు చేసాడు.

"నాకు చేతులు నెప్పిగా ఉన్నాయి. ఎక్కువ సేపు పుస్తకం పట్టుకోలేను!" బడికి వెళ్ళడానికి మొరాయిస్తున్న చిన్నారిలా చేస్తున్న అన్నపుర్ణమ్మకు ఏ మాత్రం తీసిపోని ముద్దు బిడ్డడే అతడు. అదే పట్టు తానూ పట్టి, "సరే నేను పట్టుకుంటాను, నువ్వు చదువు!" అన్నాడు.

గంటల తరబడి కళ్ళెదురుగుండా పత్రికను పట్టుకుని చదివించాడు. బలవంతంగా మొదలైన అన్నపూర్ణమ్మ పుస్తక పఠన ప్రయాణం కొద్ది కాలానికి వ్యసనంగా మారింది.

రోజుకు అవలీలగా నాలుగు వార్తాపత్రికలు పూర్తి చేసేసి, ప్రతీ రాజకీయ విషయాన్ని కొడుకుతో చర్చించి, విశ్లేషిస్తే కానీ ఊరుకునేది కాదు. అంతగా మారిపోయింది. అవీ చాలదన్నట్టు, ప్రభ, జ్యోతి, స్వాతి పత్రికలు కూడా తెప్పించాల్సి వచ్చేది. అంత వేగంగా చదివేసేది. అమ్మలోని మార్పుని చూసి అక్కలు ముక్కున వేలేసుకున్నారు. అన్న కృషికి ఆనందిస్తూ అమ్మ మామూలైనందుకు సంతోషించింది చెల్లెలు కమల.

★★★

"అమ్మ అర్జెంటుగా రమ్మని నిన్న ఫోను చేసింది. నేను కాలేజీకి వెళ్ళి రావడం ఆలస్యమైంది. రాలేకపోయాను. ఈయన ఆఫీసుకి వెళ్ళాకా ఇదిగో ఇప్పటికి కుదిరింది. ఏం జరిగింది అన్నయ్యా?" చెల్లెలు కమల అడిగింది.

నిస్తేజంగా ఉన్న హరి కమల ప్రశ్నలకు సమాధానంగా ఆమె చేతిలో ఓ కాగితాన్ని పెట్టాడు.

అమ్మ ఉత్తరం అది!

"కమలా, భూమ్మీద నాకు నూకలు చెల్లిపోతున్నాయి. రెండు రోజుల నుంచీ నాకు తెలుస్తోంది. ఇంక నేను ఎక్కువ కాలం బతకను. హరి ఒట్టి అమాయకుడు. ఇరవై నాలుగు గంటలూ నాతోనే గడుపుతూ, వాడికంటూ ఓ ప్రపంచాన్ని కూడా

సృష్టించుకోలేదు. నేను లేకపోతే ఒక్కసారిగా బ్రతుకు శూన్యమైపోతుంది వాడికి! పసినికాయగా మారిపోకుండా, నన్ను కాపాడి నా ఆయుషుని ఇన్నాళ్ళు నిలిపినవాడు ఇప్పుడు అలా అయిపోతాడేమోనని బెంగగా ఉంది. వాడలా అయిపోకుండా చూసుకోవలసిన బాధ్యత నీదే!

నా ఈ కోరిక పెద్దదే ఐనా, అందరిలోకీ చిన్న దానివైన నువ్వు, దాన్ని మన్నించగలవన్న ఆశతో ఉత్తరం రాస్తున్నాను. ఆ పసిమనసుని చూసుకుంటావు కదూ... నన్ను చంటిపిల్లను చేసి చూసుకుంటున్నానను కున్నాడు ఆ వెర్రి నాగన్న! వాడి గారాంతో నేను చంటిపిల్లనే అయ్యాను. కానీ అమ్మ మనసు వాడి గురించి ఆలోచిస్తూనే ఉంటుందని వాడికి తెలియనివ్వనేలేదు. నా మాటను మన్నిస్తావని ఆశిస్తూ......

మీ అమ్మ"

"నీ కడుపున పుట్టిన మేమందరమూ ఆశ వదులుకుని ఎవరి సంసారాల్లో వాళ్ళు తలమునకలైనప్పుడు, నీ కోసం ఆరాటపడి నిన్ను మామూలు మనిషిని చేయాలని పూనుకున్నాడు అన్నయ్య. ఆ సాహసం నాకు తెలియంది కాదు. ఉద్యోగాన్ని వదిలేసాడు. ఒక్కరి వల్ల అంతటి పని అసాధ్యమని వారిస్తున్న డాక్టర్లతో పోరాడి, తానొక్కడూ నిన్ను మామూలు మనిషిని చేసాడు. అటువంటి అన్నయ్యను నేను కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటానమ్మా. నీ అమ్మ ప్రేమనంతా ఈ జాబులో రంగరించి పోసావు కదమ్మా! పసినికాయగా తన చుట్టూ అల్లుకుపోయి అందులో బందీ అయ్యే పట్టుపురుగుగా అన్నయ్యను మారనివ్వనమ్మా" కనులు ధారాపాతమవ్వగా, అమ్మ పార్థివ దేహానికి నమస్కరించుకుంటూ అంది కమల.

ఉయ్యూరు అనసూయ
✆ 9550506829

***నేను అందుకుంటున్న ఈ నీరాజనాల వెనుక ఎందరో కళాకారులు వున్నారు. అందరికీ న్యాయం చేయలేక పోవచ్చు కానీ, నా బాలుకి నేను తప్పక చేసి తీరాలి! అప్పుడే కెమెరా ముందు నా ముఖంపై మీరనుకున్న ఎఫెక్ట్ రాగలదు!***

హీరో వీరేన్ సెట్ లోకి వస్తూనే మేకప్‌మెన్ బాలుని చూసి "చాలా కాలమైంది బాలు నిన్ను చూసి... ఎలా ఉన్నావ్?" అడిగాడు.

"బాగున్నాను సర్!" అని జవాబిచ్చి వీల్ చైర్ వైపు చూపించాడు కూర్చోండి అన్నట్లు.

వీరేన్ అందులో కూర్చోబోయి ఆగిపోతూ, "సా...ర్ ఏంటి కొత్తగా? చాలాకాలం అయింది కదా! మర్చిపోయావన్నమాట!" అన్నాడు.

"అయ్యయ్యో అదేంలేదు!" నొచ్చుకుంటూ పెద్ద హీరోకి ఇచ్చే మర్యాదే అన్నట్లు ముఖం పెట్టి ఇంకేం మాట్లాడాలో అర్థంకాక బ్రష్ చేతిలోకి తీసుకున్నాడు.


అతనలా బిడియం పడటం చూసి వీరేన్ ఓ క్షణం అతని ముఖం వైపు చూసి, వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. ఈలోపు ఆ చిత్ర దర్శకుడు హరిరాం లోపలికి వచ్చి, షాట్ ఏంటో తెలుసుగా 'త్వరగా కానివ్వు' అన్నాడు బాలుని ఉద్దేశించి.

బాలు తలూపి క్షణాల్లో తన పని వేగం పెంచి, హీరోకి మేకప్ వేయటం మొదలెట్టాడు. కొంచెం సేపు గమనించి సంతృప్తి చెందిన డైరెక్టర్ "ఇదేనయ్యా బాలు నీలో నచ్చేది. మాటలు తక్కువ పని ఎక్కువ... సరే కానీయ్!" అని సంతృప్తితో మరో ఆర్టిస్ట్ వైపు వెళ్ళాడు. బాలు చకచకా తన పనిచేసుకుంటూ వుండటం వల్ల వీరేన్ పెదవి విప్పకుండా కూర్చోవాల్సి రావటంతో అతని కదలికల్ని అద్దంలోంచి గమనిస్తూ కూర్చున్నాడు.

అతనికి బాలుని చూసిన మొదటిరోజు గుర్తొచ్చింది. ఓ దర్శకుని దగ్గర తన టాలెంట్ చూపించి అవకాశం ఇమ్మని అడగటానికి వెళ్ళాడు తను. బాలు కూడ అదే సమయంలో అక్కడకు మేకప్‌మాన్ అవకాశం కోసం వచ్చాడు. తనకి ఓ సీన్ చెప్పి, స్క్రీన్‌టెస్ట్ చేయటానికి బాలుని మేకప్ వేయమని ఇద్దరికీ పరీక్ష పెట్టాడు ఆయన. వీరేన్‌కి మేకప్ వేసాడు బాలు. కెమెరామెన్ విశ్వంతో షూట్ చేయించారాయన. ఆ మేకప్‌కి తన పెర్ఫార్మెన్స్ సీన్‌లో కన్నా ఫ్రేమ్‌లో చాలా బాగా వచ్చింది. అది ప్రొడ్యూసర్‌కి కూడా బాగా నచ్చి సహాయ నటుడు అనుకున్నది కాస్తా కథానాయకుడు పాత్ర ఇచ్చారు. ఆ అవకాశం తర్వాత బాలుని కల్సి కృతజ్ఞతలు చెప్పాడు వీరేన్. "నాదేముంది? అది విశ్వంగారి గొప్ప" అన్నాడు. అతని నమ్రత నచ్చింది. ఇద్దరూ నాలుగేళ్ల పాటు మంచి స్నేహితులుగా కొనసాగారు. ఆ నాలుగేళ్ళూ తన సినిమాలకి బాలూనే మేకప్‌మ్యాన్‌గా వున్నాడు.

అన్నీ హిట్ సినిమాలతో వీరేన్ దశ తిరిగి స్టార్ ఇమేజ్ వచ్చేసింది! అప్పుడే కాస్ట్యూమ్స్‌కి కూడ ఎక్కువ క్రేజ్ వచ్చింది. దాంతో మేకప్‌మేన్లు కాస్ట్యూమ్ డిజైనర్లుగా అవతారం ఎత్తి, అన్నీ వాళ్ళ మనుషులతోనే చేయించుకోవటం మొదలెట్టారు. బాలుకి ఆ స్తోమత లేక మేకప్‌మెన్‌గా మిగిలిపోయాడు! ఆ రేస్‌లో తెలియకుండానే బాలు తనకి దూరంగా జరిగాడు. ఈ పదేళ్ళలో వీరేన్ అన్నిరకాలుగా చాలా ఎదిగాడు. కానీ బాలు అక్కడే ఆగిపోయాడు.

ఆలోచిస్తున్న వీరేన్‌ని బాలు ఫోన్ రింగ్ డిస్టర్బ్ చేసింది. బాలు ఫోన్ తీసి "ఒక్క నిమిషం" అంటూ పక్కకి వెళ్ళి ఫోన్ మాట్లాడి వచ్చిన తర్వాత అతని ముఖంలో ఆందోళన కన్పించింది వీరేన్‌కి.



"ఏమైంది"? ఏంటి ఫోన్ సారాంశం అన్నట్లు అడిగాడు.

"ఏం లేదు వీరూ! నీకు ఇప్పుడు ఇంపార్టెంట్ షాట్ వుంది.. ముందు అది కానీయ్!" అన్నాడు నాదేం పెద్ద విషయం కాదు అన్నట్లు.

'వీరూ!' అని అతను సంబోధించగానే అతని మనసు అదోలా ఉలిక్కిపడింది.

మరేం మాట్లాడకుండా లేచి సెట్ వైపు వెళ్ళాడు. అక్కడ కెమెరా ముందు వున్న డైరెక్టర్ అందరికీ సీను వివరించి వీరేన్

రావటం చూసి "ఓకే స్టార్ట్ చేద్దామా?" అన్నాడు.

నవ్వుతూ బొటనవేలు పైకి ఎత్తి వెళ్ళి కెమెరా ముందు నిలబడి, డైరెక్టర్ యాక్షన్ చెప్పగానే సీన్లో ఇన్వాల్వ్ అయిపోయాడు. కానీ ఆ సీను అంత బాగా రాలేదనిపించింది డైరెక్టర్‌కి!

"కాంప్రమైజ్ ఎందుకు... మరో టేక్ తీసుకోండి!" అని తనే చెప్పి మళ్ళీ టేక్‌కి సిద్ధమైనాడు. ఆరేడు టేకులు తీసుకున్నా డైరెక్టర్ అనుకున్నది రాలేదు.

అప్పుడు అడిగాడు ఆయన "ఆర్ యు ఓకే?".

"ఓకే...ఓకే... ఎందుకు వచ్చిందా అనుమానం?"

అప్పటి వరకు షూట్ చేసిన సీన్లు వెనక్కి ప్లే చేసి చూపించాడు డైరెక్టర్.

నిజమే తన ఎమోషన్స్ చాలా పేలవంగా ఉన్నాయి. "ఒక గంట టైం ఇవ్వండి ప్లీజ్" అని రిక్వెస్ట్‌గా అడిగాడు.

"ఏదైనా ప్రాబ్లం ఉంటే... పోనీ రేపటికి మార్చుకుందాం!" అన్నాడాయన తన మీద ఉన్న గౌరవంతో.

"లేదు... లేదు! నా మూలంగా ఎవరిని ఇబ్బంది పెట్టకండి. నేను ఒక గంటలో వచ్చేస్తా!" చెప్పి గ్రీన్‌రూమ్ లోకి వచ్చాడు.

అక్కడ బాలు అసిస్టెంట్ దిగాలుగా కూర్చొని ఏదో సర్దుకుంటున్న వాడల్లా తనని చూసి తడబడ్డాడు.

"బాలు ఎక్కడ?" అడిగాడు.

"ఇప్పుడే హాస్పిటల్ కని వెళ్లారు సార్!"

"ఏమైంది బాలుకి?

"నాకు తెలియదు సార్... కానీ మీకు ఏదైనా అవసరమైతే నన్ను చూసుకోమని, వెంటనే వచ్చేస్తాను అని చెప్పారు సర్!" అన్నాడు.

అతని వెనకే వచ్చిన డైరెక్టర్ "ఏమైంది వీరేన్... ఏమైనా కావాలా?" అడిగాడు.

"బాలు హాస్పిటల్‌కి వెళ్ళాడట కదా... దేనికి?"

"ఓ అదా! నాకు ముందే చెప్పాడు... మీకు మేకప్ వేసాక ఓసారి ఇంటికి వెళ్ళి వస్తానని. కానీ హాస్పిటలుకని తెలియదు... మీ మేకప్‌మెన్ ఫ్యామిలీతో సింగపూర్ వెళ్ళాడని అనుకోని పరిస్థితుల్లో అతను అక్కడ మరో నాలుగు రోజులు స్టే చేయాల్సి వుందని మీ మ్యానేజర్ చెప్పారు. కానీ మన షెడ్యూల్ అంతా రెడీ చేసుకున్నాం కదా! అంటే రెండు రోజులే కదా... బాలుని పిలవండి అని అతనంటేనే పిలిచాను. నా బలవంతం మీదే వచ్చాడు. మీకు మేకప్ వేసాక వెళ్ళిపోతానన్నాడు. ఆ విషయం మీకు కూడా తెలుసునుకున్నాను. ఏదైనా తప్పు జరిగిందేమిటి?" నిదానంగా అడిగాడు డైరెక్టర్.

అతని ప్రశ్నకి జవాబివ్వకుండా "బలవంతంగా వచ్చాడా?" అన్నాడు.

“అవును... వాళ్ళ అమ్మగారికి పెరాలసిస్. తనే దగ్గరుండి అన్నీ చూసుకుంటున్నాడు పాపం! చాలా మంచివాడు, కష్టపడి ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళి చేశాడు. అందుకోసం ఇంటి మీద అప్పు చేసి వడ్డీలు కట్టుకోలేక, తల్లిని చూసుకోలేక సతమతమవుతున్నాడు. ఎవరినీ ఏ సహాయం అడగడు. తను చేసిన పనికి కూడా ఎదుటివారు ఎంతిస్తే అంతే తీసుకుంటాడు. అందుకే సంపాదనలో ఎదగలేకపోయాడు. అప్పుడప్పుడు నేను సహాయం చేస్తాను. కానీ ఈరోజు అమ్మని వదిలి రానంటే, నేనే ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్దువు గాని, రా అని పిల్చాను!” అన్నాడు.

అది విన్న తర్వాత వీరేన్‌కి బాలు ఇందాక ఫోన్ మాట్లాడటం గుర్తొచ్చింది. “బాలు ఎక్కడున్నాడో కనుక్కోండి” అన్నాడు.

డైరెక్టర్ ఫోన్ చేసి “బాలూ, ఎక్కడున్నావ్?” అంటూ స్పీకర్ ఆన్ చేశాడు.

“అమ్మ వీల్‌చెయిర్ నుండి కింద పడిందట సర్. పక్కింటి ఆయన ఫోన్ చేసాడు. హాస్పిటలుకి తీసుకెళ్లారట. చూసి వెంటనే వచ్చేస్తా!” అన్నాడు.

అది వింటున్న వీరెన్ “వద్దు... రావద్దని చెప్పండి. మనం ఏదోలా మేనేజ్ చేసుకుందాం... అది ఏ హాస్పిటలో కనుక్కోండి!” అన్నాడు.

వీరేన్ చెప్పినట్లుగా చేసిన డైరెక్టర్ ‘అయ్యో నా మూలంగానే అతనక్కడ లేకపోబట్టి ఆవిడకి అలా జరిగిందని’ నొచ్చుకున్నాడు.

అతని ఫీలింగ్ అర్థం చేసుకున్న వీరేన్ కూడా మనసు విప్పి బాలు గురించి చెప్పాడు “బాలు, నేను.. ఒకే రోజు.. ఒకే సంస్థ ద్వారా చిత్రపరిశ్రమకి వచ్చాం. ఆరోజు బాలు వేసిన మేకప్‌కి... నాకు, అతనికి ఒకే సినిమాలో అవకాశం వచ్చింది. దానికన్నా కూడా ఆ ఫొటో స్టిల్స్ చూసి... “మనకెందుకురా సినిమాలు?” అనే మా అమ్మ కూడ ఎంతగానో సంతోషించింది. వాళ్ళ అమ్మకి చూపిస్తే నా మేకప్ చూసి, “మా వాడే వేసాడా!” అని ఆశ్చర్యపోతూ, “నీకు మంచి భవిష్యత్తు ఉంది నాయనా!” అని దీవించింది. అన్నట్లుగానే నాకు అవకాశాలు వచ్చాయి. నాకు నాలుగైదు చిత్రాలకు పనిచేశాడు అతను. స్నేహితుల్లాగా ఉండేవారం.

అతను కాస్మోటిక్స్ ఎక్కువ వాడకుండా మేకప్ వేయాలనుకుంటాడు. ఆ రోజుల్లోనే చిత్రవిచిత్రమైన గెటప్‌లు సహజసిద్ధంగా వేసి మురిపించేవాడు. విదేశీ మేకప్‌మెన్‌లు ఎందుకూ పనికిరారు అన్నట్లుండేవి అవి! చాలా సహజసిద్ధంగా తయారైన గులాబీ, బంతి, చామంతి, శంఖపుష్పి లాంటి పూరేకుల నుంచి ప్రాసెస్ చేసిన సువర్ణ భరితమైన ఫేస్‌పౌడర్లు, కలర్ షేడింగ్స్ తయారుచేసేవాడు. ఆరోజు నాకు వేసిన కలర్ కూడా అటువంటిదే! చాలామంది మంచి నటులు ఈ కృత్రిమ కాస్మోటిక్స్ వల్ల స్కిన్ ఎలర్జీలతో, వేసిన మేకప్పే వేయటం వల్ల శరీరం మొద్దు బారడం, షాట్ అయ్యాక మేకప్ వదిలించుకోవడం ఎంతో కష్టం అయ్యి పరిశ్రమకు దూరమైనారు.

అటువంటి వారికి బాలు తయారుచేసిన ఈ ప్రోడక్ట్స్‌తో ఒక ఉపశమనం ఇస్తాడనుకున్నా! నేను వరుస హిట్లతో బాగా స్థిరపడే సమయానికి నా ఆలోచనలలో బాలు నాకు దూరమయ్యాడు. అతనికి వచ్చిన మంచి పేరు విన్నాను కానీ ఆర్థికంగా అతని పరిస్థితి ఇదని తెలియదు. ఈరోజు బాలుని చూసి నాకు పాతరోజులు గుర్తొచ్చాయి. అతను ‘వీరూ!’ అని పిలవగానే నా శరీరం కంపించింది. నేను అందుకుంటున్న ఈ నీరాజనాలు వెనుక ఎందరో కళాకారులు వున్నారు. అందరికీ న్యాయం చేయలేకపోవచ్చు కానీ, నా బాలుకి నేను తప్పక చేసి తీరాలి! అప్పుడే కెమెరా ముందు నా ముఖంపై మీరనుకున్న ఎఫెక్ట్

రాగలదు!" అని చెప్తూ జేబులోంచి చెక్‌బుక్ తీసి, "అతని ఇంటిపై అప్పు మాఫీ చేయించండి. వాళ్ళ అమ్మగారికి కావలసిన మెడికల్ ఎయిడ్ నా సంస్థ నుంచి వెళ్తుంది. ఇవన్నీ గోప్యంగానే వుంచండి! ఏవైనా విపత్తులు వచ్చినప్పుడు ప్రభుత్వాలకు చందాలిస్తున్నా. అవి ఏ మేరకు ఉపయోగ పడుతున్నాయో తెలియదు. అంతకన్నా పెద్ద ఎమౌంట్ ఏం కాదు ఇది. కానీ నా స్నేహితునికి ఇది తప్పక ఉపయోగపడుతుంది. ఆర్థిక సమస్యల నుండి బయటకి వస్తే బాలు తప్పకుండా తనలాంటి వారిని వందమందిని తయారుచేసి, విదేశాల్లో మన మేకప్‌మెన్‌లకి డిమాండ్ సృష్టించగలడు. అలా చేయటానికి మీరే తగిన వారధి!" అంటూ బ్లాంక్ చెక్ అతని చేతిలో ఉంచాడు.

తర్వాత తన మేనేజర్‌కి ఫోన్ చేసి "ఇంక మీదట నా కాస్ట్యూమ్ డిజైనర్‌తో పాటు బాలు కూడ వుండేలా చూడండి!" చెప్పి ఫోన్ పెట్టేసాడు.

వింటున్న డైరెక్టరు 'ఇతను తెర మీదే కాదు తెర వెనుక కూడ హీరోనే' అనుకున్నాడు.

# లవ్ క్వీన్

శ్రీచరణ్ మిత్ర
✆ 9573566990

***'మా స్టార్ల క్రేజుతో కోటీశ్వరులే భార్య పిల్లలు ఉండి కూడా వారిని వదిలేసి మమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటారు. అది మాకున్న క్రేజ్! మా అందానికి ఫిదా అయిపోతుంటారు. నువ్వైనా అంతే కదా...'***

వెన్నెల్లో విరిసిన పూమొగ్గలా, నింగిలో అప్పుడప్పుడు మెరిసే మెరుపుతీగలాంటి తన కలల రాణి అయిన సినిమా తార ప్రవల్లిక అంటే పంచప్రాణాలు అజయ్‌కు! ఆమె సినిమా తొలి రోజునే చూడటం... ప్రవల్లిక నక్షత్రంలా ఆ సినిమాలో కనిపిస్తే పదే పదే ఆవిడని చూసి తరించిపోతుంటాడు. అసలు ఆ దేవుడు అంత అందంగా ఆమెను ఎలా పుట్టించాడో అనుకుంటూ... అనుక్షణం ఆమె ధ్యాసలో గడిపేయడం అతనికి శ్వాస తీసుకునేటంతటి నిరంతర ప్రక్రియ. ప్రవల్లిక నవ్వు, ప్రవల్లిక తనువు, ప్రవల్లిక కవ్వింత, ప్రవల్లిక డాన్స్, ప్రవల్లిక మాట, ప్రవల్లిక పాట అన్నీ అజయ్‌కు అపురూపాలే! ఒక్కోసారి ఆమె పాదాలపై తన ప్రాణాలను వదిలేయాలన్నంత కోరిక. ప్రేమ కావచ్చు, వయసులో ఉన్న ఆకర్షణ కావచ్చు ఏదైనా ఆమె అంటే ఒక పిచ్చి అజయ్‌కు!

రాత్రీ పగలు తన ఆండ్రాయిడ్‌లో ఆమె వీడియోలు చూడడం, నిద్ర వస్తే పడుకోవడం, లేచాక మళ్ళీ ఆమె ఆలోచనలతో గడపడం... అంతకుముందు చిన్నప్పటినుంచి తన ఇంటి గోడలకు అంటించిన హీరో ఫోటోలు ఒక్కొక్కటిగా పోయి ఆ గోడల మీద ప్రవల్లిక ఫోటోలే ఆక్రమించి గోడంతా నిండిపోయింది. అలాగే అజయ్ హృదయం కూడా!

ఆమె నటించిన 'ప్రేమ స్వరూపం' సినిమా అజయ్ ఎన్నిసార్లు చూశాడో లెక్కేలేదు. తనపై ప్రేమను పెంచుకున్న కొత్త హీరో ప్రవీణ్ కోసం తన ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడే మనోజ్ఞ క్యారెక్టర్‌లో ప్రవల్లికను చూసి, ఆ సినిమాను వందల సార్లు చూశాడు!

ప్రేమించిన మనసును ప్రేమించే అదృష్టం ఉంటే అది ఒక వరం. తను అలాంటి ప్రేమికుడినని అతనికి ప్రగాఢ నమ్మకం.

ప్రవల్లికను తాను దేవతలా ఆరాధిస్తాడు. ఆమె తనను కరుణగా చూస్తే చాలు ఈ జన్మకు ఇంకేం అవసరం లేదనుకుంటాడు. అందుకే ఆమె దృష్టిలో పడ్డానికి చాలాసార్లు ప్రయత్నం చేసేడు. ఆమె ఎక్కడ షూటింగులో ఉంటే, అక్కడకు తన స్వంత ఖర్చులు, లేదా అప్పులు చేసైనా వెళ్ళేవాడు. తను వెళ్లడం, దూరం నుంచి అయినా ఆమెను చూసి ఆనందించడం, ఇదే ఆతని లక్ష్యంగా ఉండేది. నిజంగా పాలరాతి శిల్పంలా ఉండే ప్రవల్లిక, ఏ డ్రెస్ వేస్తే మరింత అందంగా కనిపిస్తుందో కాస్ట్యూమ్స్ వారి కంటే అజయ్‌కే బాగా తెలుసు. అతను డిగ్రీ చదువుకున్నవాడైనా, అందుకు తగ్గ ఉద్యోగం ప్రయత్నపు ఆలోచన కన్నా, ప్రవల్లిక చింతనే చేస్తూ, ఎక్కువగా ఆమెని చూస్తూ గడిపేయాలన్నది ఆతని కోరిక.

అందుకు తగ్గట్టే ప్రయత్నాలు చేయగా... చేయగా...

ప్రవల్లిక సెక్రటరీ బంధువు ఒకరు పరిచయమయ్యారు. ఆయన సాయంతో అతనికి బహుమతులు ఇచ్చి, బ్రతిమలాడుకొని,

కాళ్లు పట్టుకొని అజయ్ అనుకున్నట్టే ప్రవల్లిక ఇంట్లో సర్వెంట్ గా చేరగలిగాడు. ఆ రోజు అజయ్ ఆనందానికి అవధులు లేవు. 'కార్ డ్రైవింగ్ తో పాటు ఇంట్లో అన్ని పనులూ, అవసరమైతే ప్రవల్లికతో పాటు షూటింగ్ కి వెళ్లి, ఆమెకు అవసరమైన అన్ని పనులు దగ్గరుండి చూసుకోవాలి. అవసరమైతే ప్రవల్లిక ఎండలో ఉంటే గొడుగు పట్టాలి, చెమట పడితే టచప్ పనులు సైతం చేయాలి' అన్న కండిషన్ మీద, ఆ ఇంట్లో ఆ ఇంటి పనిలో చేరాడు!



ప్రవల్లికను తాకి, అందమైన ఆమె ముఖానికి టచ్అప్ చేయడమంటే తన జన్మ సార్థకమైనట్టుగానే అజయ్ భావించాడు. ఆమెకు అవసరమైన పనులు చేసి పెట్టడం అంటే తన పూర్వజన్మ సుకృతమే అనుకున్నాడు. ఎలా అయితేనేం... చిన్న అవసరానికి కూడా 'అజయ్' అని ప్రవల్లిక పిలిచేలా ఆమె నోట్లో నాలుకలా అయిపోయాడు. ఈ అవకాశానికి తాను ఎన్నాళ్లు తపించిపోయాడో తలుచుకుంటే తనకే ఆశ్చర్యం అనిపిస్తుంది అజయ్‌కు.

రెండు మూడుసార్లు తనకు తెలిసిన వారితో అజయ్ మంచి సర్వెంట్ అని ప్రవల్లిక చెప్తుండడం అతనికి తెలిసింది. చాలా ఆనందం అనిపించింది. సర్వెంట్ అన్నందుకు అజయ్‌కు కోపం కూడా వచ్చేది కాదు. ఆ అందాల రాశికి సర్వెంట్ అవ్వడం కూడా మహాభాగ్యమే కదా అనిపించేది. తన సర్వీస్‌లో ఆమె అజయ్‌ను 'నా' అనుకోవడమే గొప్ప అనుకునేవాడు.

ప్రవల్లిక ఇంటిలో రెండు బుజ్జి పమేరియన్ పెట్ డాగ్స్ ఉండేవి. అవి ఆవిడకు బాగా మచ్చిక! ప్రవల్లిక షూటింగ్ నుంచి రాగానే ఆమె కాళ్ళ చుట్టూ తిరిగేవి. ప్రవల్లిక కూడా వాటిని ఎత్తుకొని ముద్దాడి, వాటిని కాస్త బుజ్జగించి వాటితో ఆడుకునేది. ఒక్కోసారి వాటిని సరదాగా కొడుతూ కూడా ఆనందించేది. అది చూసిన అజయ్ 'తానా కుక్కపిల్లల్లా పుట్టినా బాగుండేది' అనుకునేవాడు. భయం లేకుండా ప్రవల్లిక ఒళ్ళో కూర్చోవచ్చు. పరువంతో తొణికసలాడే ఆమె పరువాలను తాకవచ్చు. ఆమె గుండెలకు హత్తుకున్నప్పుడు ఆమె ఎదపై సేద తీరవచ్చు. అమృతం ఒలికే ప్రవల్లిక పెదాలతో ముద్దులను అందుకోవచ్చు... ఇలా ఎన్నో ఆలోచనలతో సాగిపోయే ఆలోచనలతో 'లవ్ క్వీన్' అనే పేరు గాంచిన ప్రవల్లిక తన మీద కూడా అంతే ప్రేమను ఏనాటికైనా అందిస్తుందని నమ్ముకుంటూ ఉండేవాడు!

ఇలా ఉండగా.... ఒకసారి ముంబై నుండి అప్పటికి ఒక స్టార్‌యాక్టర్ అయిన షహనాజ్ తన ఇంటికి వస్తుందని చాలా హడావిడి చేసింది ప్రవల్లిక! అంత పెద్ద సెలబ్రిటీ తన ఇంటికి రావడం అంటే చాలా గొప్ప అంటూ ఇంట్లో రాత్రి డిన్నర్‌కు చాలా ఖరీదైన ఏర్పాటు చేయమంది. ఆ రోజంతా ప్రవల్లిక ఇంట్లో ఒకటే హడావిడి. ఆ రాత్రి డిన్నర్ అయిపోయాక

షహనాజ్ ముద్దుగా ఉన్న ఆ పెట్ డాగ్‌ను చూసి చాలా ముచ్చట పడింది. ప్రవల్లిక అజయ్‌ను పిలిచి... "ఆ వైట్ పెట్ మేడం గారికి కావాలట. దాని కాళ్లు కట్టేసి మౌత్ మాస్క్ వేసి మేడంగారి కారులో పెట్టు" అంది ప్రవల్లిక.

గొంతులో తడి ఆరినట్టయింది అజయ్‌కు. "ఆ పెట్ కు మీరంటే ఎంతో ప్రేమ కదా!" అన్నాడు ఎలాగో గొంతు పెగుల్చుకొని. "నాన్సెన్స్... పెంపుడు జంతువులకు ప్రేమలు అంటకడతావు ఏంటి? అవి పెంచుకోవడానికి, నచ్చిన వారికి ఇవ్వడానికే ఉండేది! ఇలాంటి మాటలు వింటే మేడం గారు ఏమనుకుంటారు? చెప్పింది చెయ్!" అంటూ ఆర్డర్ వేసి వెళ్లిపోయింది ప్రవల్లిక.

ఆమె ఆజ్ఞకు ఆ ఇంట్లో ఎదురేముంది? తనక్కూడా కాస్త మచ్చిక అయిన ఆ పెట్ డాగ్‌ను కాళ్లు కట్టి, అరిస్తే శబ్దం కాకుండా ప్లాస్టిక్ మౌత్‌మాస్క్‌ను ఆ మూతికి అమర్చి షహనాజ్ గారి కారులో వేశాడు అజయ్. తర్వాత షెహనాజ్ మేడం గారి కారు కదిలిపోయింది కూడా!

★★★

తనకు వచ్చిన సెల్‌ఫోన్లో పేరు చూసి విసుగ్గా ఆపేశాడు అజయ్. తన అక్క కూతురు పద్మ నుంచి ఆ ఫోను. తను ప్రవల్లిక కోసం ఆరాటపడుతుంటే పద్మ అజయ్ కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. తనను పెళ్ళాడమంటుంది. పద్మ బాగానే ఉన్నా, అజయ్ మనసు ప్రవల్లిక చుట్టూనే తిరుగుతుంటుంది కదా. సినిమా యాక్టర్ ప్రవల్లిక దగ్గరకు, మిగతా సినిమా యాక్టర్లనూ చూడాలని ఆశ పడుతూ ఉంటుంది. కానీ పద్మను తీసుకెళ్తే తన మేనకోడలుగా చెప్తే ప్రవల్లిక తనకు దూరం కావచ్చు. కనుక ఫిల్మ్ ఇండస్ట్రీ ఉన్న ఊరికే తీసుకురాలేదు అజయ్.

మళ్లీ పద్మ ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తి, "చాలా బిజీగా ఉన్నాను పద్మా, తర్వాత ఫోన్ చేస్తాను" అని ఒక మాట చెప్పి ఫోన్ కట్ చేసాడు అజయ్. ఇది చాలా ఏళ్ళుగా జరిగే తతంగమే.

★★★

"అజయ్! సౌగంధిక యాక్టర్ నీకు తెలుసు కదా.... కొత్తగా ఇండస్ట్రీకి వచ్చిన యాక్టర్. తనకు మంచి నమ్మకమైన సర్వెంట్ కావాలట, నేను నీ పేరు సజెస్ట్ చేశాను. నీవు ఆమె ఇంటికి వెళ్లి ఈరోజే డ్యూటీలో జాయిన్ అవ్వు!" అంది ఒకరోజు ప్రవల్లిక.

ఒక్కసారిగా గతుక్కుమన్నాడు అజయ్. "నేనేం తప్పు చేశానని నన్ను పంపించేస్తున్నారు?" అని అడిగాడు. "నో.... నో... నువ్వేదో తప్పు చేసావు అని కాదు. ఆమెకు సర్వర్ కావాలన్నారు. నేను నిన్ను పంపిస్తానని చెప్పాను. నువ్వు వెళ్ళాలి" అంది ప్రవల్లిక చాలా క్యాజువల్‌గా.

"నేను వెళ్ళను మేడం!" స్థిరంగా చెప్పాడు అజయ్.

"నువ్వు అక్కడికి వెళ్లకపోతే... ఇక్కడ కూడా మానేయ్!" అంది నిష్కర్షగా ప్రవల్లిక.

"అదేంటి మేడం... మీరంటే ఎంతో అభిమానంతో, ప్రేమతో మీకు వర్కర్‌గా చేరాను. నన్ను అక్కడికి పంపించేస్తాను అంటారేమిటి మేడం?"

“డోంట్ బి సిల్లీ అజయ్! సినిమా స్టార్ల అందానికి, క్రేజ్‌కు చాలామంది మా వెంట పడతారు. మా కన్నుల్లో పడాలనుకుంటారు. ఆ ఫీలింగ్‌లో ఉన్నవార్ని అందర్నీ సినిమా స్టార్లు ప్రేమించలేరు కదా. మా స్టార్ల క్రేజుతో కోటీశ్వరులే భార్య పిల్లలు ఉండి కూడా వారిని వదిలేసి మమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటారు. అది మాకున్న క్రేజ్! మా అందానికి ఫిదా అయిపోతుంటారు. నువ్వైనా అంతే కదా... సౌగంధిక కూడా చాలా అందంగా ఉంటుంది. కొన్నాళ్ళు ఆవిడను కూడా దగ్గరగా చూస్తూ ఎంజాయ్ చెయ్! దట్సాల్...”

“కానీ నేను మిమ్మల్ని నిజంగా అభిమానించి, మిమ్మల్నే చూస్తూ ఉండాలని వచ్చాను మేడం! కానీ మీరు నన్ను ఓ పెట్ డాగ్‌లా... కుక్కపిల్లని షెహనాజ్ గారికి బహుమతి ఇచ్చినట్టుగా... నన్ను సౌగంధికగారి దగ్గరకు ఒక జంతువుగా భావించి ఆవిడకు ఇచ్చేస్తామంటున్నారు.. కానీ నేను మనిషిని మేడం! జంతువునో, పక్షినో కాదు! మా అభిమానాన్ని ప్రేమను సిల్లీగా భావిస్తూ మీ ఎదుగుదలకు మా అభిమానాలను స్టెప్పింగ్ స్టోన్స్‌గా భావించే మిమ్మల్ని ‘లవ్ క్వీన్స్’ అని భ్రమసే మాకు మీరు ఎప్పుడూ నటీమణులే మేడం! మాలాంటి సినీరంగ అభిమానులను మాడ్చి పారేసే సినీరంగ మార్తాండులే!” అలా అంటున్నప్పుడు అతని గొంతు సన్నగా వణికింది.

కళ్లలో నీరు ఉబికి.... అసహనం గుండెల్లోంచి పొంగుకు వస్తుంటే.... ఫోన్ మోగింది. తీశాడు, పేరు చూశాడు. పద్మ నించి ఫోన్. ఈసారి ప్రేమగా ఫోన్ ఎత్తాడు!

# ప్రేమకు కళ్ళున్నాయి

శింగరాజు శ్రీనివాసరావు
✆ 9052048706

***"బాబూ... నాకంటూ పిల్లలు లేరు. ఎప్పటి నుంచో అలవాటుగా ఈ పార్కుకు మీరిద్దరూ వస్తున్నారు. మీ పద్ధతులు, వ్యవహారాలు నాకు నచ్చాయి కనుకే మిమ్మల్ని ఇద్దరినీ కలపాలనుకున్నాను. అయినా ఇందులో నాదేముంది బాబూ! అంతా ఆ పైవాడి నిర్ణయమే."***

ఆ కళ్ళకు వాకిళ్ళతో పనిలేదేమో... తదేకంగా చూసుకుంటున్నాయి! మౌనమే భాషగా మాట్లాడుకుంటున్నాయి కాబోలు... పెదవులు సందడి చేయడం మానేశాయి. చుట్టూ ఏంజరుగుతున్నదో... చూసే సమయం, ఆలోచన, రెండూ శూన్యమై ఏదో తహతహలో మనసులు మూగగా పలకరించుకుంటున్నాయి. అటు ఎండ, ఇటు చీకటి రెండూ ఇబ్బంది పెట్టని సంధ్యాసమయం. యువజంటలకు ఎంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఇస్తుందనేది అందరికీ అనుభవైకవేద్యమే.

సింధూరాన్ని వంటికి పూసుకున్నట్లుగా అందంగా తన నునువెచ్చని కిరణాలను నేలపై పరుస్తున్నాడు భానుడు. ఆ స్పర్శను అనుభవిస్తూ, స్వీట్ నథింగ్స్ చెప్పుకుంటూ ఎన్నో యువజంటలు ఆ పార్కులో సందడి చేస్తున్నాయి. అక్కడే ఒక పొద మాటున బెంచి మీద కూర్చున్నారు నివేద, అధర్వ! ఒకరి ప్రక్కన ఒకరు కూర్చున్నట్లుగా కనిపిస్తున్నా, ఒకరిలో మరొకరు దాగివున్నారు ఇద్దరూ! ఆహ్లాదకర వాతావరణం శరీరానికి సుఖమయ స్పర్శనిస్తూ మౌనాన్ని విచ్ఛిన్నం చేయమని ప్రేరేపించిందేమో, అప్పటిదాకా మాట్లాడుకోని వారి పెదవులు ఇప్పుడు మౌనాన్ని వీడాయి.

"నివేదా... మన పెళ్ళి గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు అధర్వ.

"మన పరిచయమే చాలా చిత్రంగా జరిగింది. రంగయ్య బాబాయికి ఎందుకు అనిపించిందో మనలను దగ్గర చేయాలని..." గతాన్ని గుర్తు చేసుకుంది నివేద.

"ఇది భగవంతుని కూర్పు నివేద. రంగయ్య ద్వారా ఆయన ప్రేరేపించాడు అంతే. ఏది ఏమైనా నీ పరిచయం నాలో కొత్త ఆశలకు జీవం పోసింది. నిర్లిప్తత నిండిన నా హృదయాన్ని ఉత్తేజితం చేసింది!" అంటూ నివేద చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు అధర్వ.

"నిజమే. రంగయ్య బాబాయి ఎందుకు కలిపినా, మన విషయంలో మంచే జరిగింది. ఎటుపోతుందో తెలియని నా జీవితానికి నువ్వొక ఆశాదీపంలా కనిపించావు అధర్వా! ఏదో పాటలు పాడుకుంటూ జీవితం సాగించే నాకు నీ పరిచయం కొత్త ఆశలకు ఊపిరిపోసింది. మన ఇద్దరి సమస్య ఒకటే కావడం వలన కూడానేమో, మనిద్దరి మధ్య బంధం త్వరగా చిగురించింది!" అంటూ అధర్వ చేతిని తీసుకుని తన బుగ్గలకు ఆనించుకుంది నివేద.

ఆ స్పర్శంటే ఎంతో ఇష్టం అధర్వకు. కనిపించే ఏ అందమూ ఇవ్వని మత్తును, మోహాన్ని కలిగిస్తుంది ఆమె స్పర్శ అతనికి.

మెత్తని దూదిపింజలలా ఎంతో మృదువుగా ఉంటాయి ఆమె చెక్కిళ్ళు! మెల్లగా ఆమె చేతిలో నుంచి తన చేతిని విడిపించుకుని, ఆమె బుగ్గలను మెల్లగా నిమురుతూ, ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని నుదుటిపై చుంబించాడు అధర్వ.

"అధర్వా... నేనంటే నీకంత ఇష్టమా?"



"ఆ ఇష్టాన్ని చెప్పగలిగే పదాలుంటే, నా కవితలోనే పలికించేవాడిని నివేదా! నీ మీద నా ప్రేమను కొలువగలిగే పరికరాలు కానీ, నా ప్రేమను వివరించగలిగే అక్షరాలు కానీ లేవు నివేదా! నీపై ప్రేమను తెలుపగలిగేది నా స్పర్శ మాత్రమే!" అంటున్న అధర్వ గుండెల మీద తల ఆనించింది నివేద.

"జీవితాంతం నీ గుండెల మీద తలవాల్చి బ్రతుకుతూ, నీ చేతులలో మరణిస్తే చాలనిపిస్తున్నది!"

"ఛ... అవేం మాటలు నివేదా?" తన చేతితో ఆమె నోటిని మూశాడు.

"కలలో కూడా అలా అనకు. ఎందుకు పనికిరావనుకున్న మన జీవితాలను మనమే నందనవనం చేసుకుందాం. కలిసే బ్రతుకుదాం, కలిసే కాలం చేద్దాం! నువ్వు లేని లోకం, నాకూ శూన్యమే నివేదా!" ఉద్వేగానికి లోనయ్యాడు అధర్వ.

"సారీ అధర్వా... ఇంకెప్పుడూ అలా మాట్లాడను. నిన్ను బాధపెట్టను!"

అధర్వ ఒడిలో తలవాల్చి పడుకుంది నివేద. ఆమె తల నిమురుతూ ఏదో లోకంలోకి వెళ్ళిపోయాడు అధర్వ.

"మన పెళ్ళి మీద నా అభిప్రాయం అడిగావుగా. ఇప్పటికైనా అర్థమయిందా!" అని అతని ఒడిలో నుంచి లేచి అడిగింది నివేద.

"మాటల్లో కాకుండా చేతలలోనే అంతా చూపావుగా!"

"అధర్వా... మన షరతు గుర్తుందిగా!"

"ఏమిటి? మనకు పిల్లలు వద్దనేగా..!"

“అవును. మన సమస్య వాళ్ళకు వారసత్వం కాకూడదు!”

“అలా జరగాలని ఏమీ లేదుగా!”

“అలా జరగదని గ్యారంటీ కూడా లేదుగా. అయినా కన్ను పోయేటంత కాటుక ఎందుకు చెప్పు!”

“మాతృత్వం లోని మాధుర్యం నీకు దూరమవుతుంది కదా!”

“అమ్మ ప్రేమంటే తెలియని అనాథలం. మనకు ఇంకా అటువంటి ఆశలు ఉండాలా?”

“నిజమే నివేదా! కంటేనే తల్లి కాదు కదా. మనం పెరిగిన ఆశ్రమంలో మనలాంటి అనాథలకు కొదువలేదుగా. వారికి మనమే తల్లిదండ్రులుగా మసలుదాం!”

“అప్పుడు మనకు బోలెడంత మంది పిల్లలు!”

“నిజమే కదా” ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

“నివేదమ్మ తల్లీ. ఈరోజు పాటల ప్రోగ్రాం లేదా... అధర్వబాబుతో ముచ్చట పెట్టావు!” అంటూ వచ్చాడు పార్కు వాచ్‌మేన్ రంగయ్య.

“లేదు బాబాయ్. మంగళవారం కదా... సెలవు. అయినా ఇక ఆ ట్రూపులోకి వెళ్ళను బాబాయ్, అదొక పెద్ద మాఫియాలా తయారయింది. మాకు టార్గెట్లు పెడుతున్నారు. అధర్వ వాళ్ళ ప్రైవేటు ట్రూపు ఉన్నది. దాంట్లో చేరుతాను. వాళ్ళకు బయట ప్రోగ్రాములు బాగానే వస్తాయట. ఎలాగూ పెళ్ళి చేసుకోబోతున్నాం కదా. అందుకని ఈ నిర్ణయం తీసుకున్నాను!” చెప్పింది నివేద.

“అవునా..మంచిపని చేశావు తల్లీ! పెళ్ళి రేపేనటగా... అదీ నా చేతుల మీదుగానే జరగాలట! అధర్వబాబు మాట కూడ తీసుకున్నాడు. అందుకే తల్లీ... అన్నీ రెడీ చేశాను. రేపు పది గంటలకు రిజిస్ట్రారు ఆఫీసుకు రండి. నేను అన్నీ సిద్ధం చేసి ఉంచుతాను. మీరు వస్తే అరగంట లోపే అన్నీ చేసి పంపిస్తానని చెప్పారు ఆఫీసు వాళ్ళు. అక్కడ మా అన్న కొడుకు పనిచేస్తున్నాడులే. అందుకే మన పని సులభమయింది!” చెప్పాడు.

“రంగయ్యా .. నీ మేలు మరిచిపోలేనిది. నాకు తండ్రి వున్నా కూడ నీ అంత కేర్ తీసుకుని ఉండేవాడు కాదు. నాకు పిల్లను నువ్వే చూసి, పెళ్ళి కూడ చేస్తున్నావు. ఏనాటి బంధమో ఇది!” కృతజ్ఞతాపూర్వకంగా పలికాడు అధర్వ.

“బాబూ... నాకంటూ పిల్లలు లేరు. ఎప్పటి నుంచో అలవాటుగా ఈ పార్కుకు మీరిద్దరూ వస్తున్నారు. మీ పద్ధతులు, వ్యవహారాలు నాకు నచ్చాయి కనుకే మిమ్మల్ని ఇద్దరినీ కలపాలనుకున్నాను. అయినా ఇందులో నాదేముంది బాబూ! అంతా ఆ పైవాడి నిర్ణయమే. సరే ఇక పదండి. ముచ్చట్లలో పడి మీకు టైం తెలిసినట్లు లేదు. పార్కు మూసే వేళయింది. పదండి మిమ్మల్ని ఆటో ఎక్కించి వస్తాను!” అని వాళ్ళిద్దరి చేతులు పట్టుకున్నాడు రంగయ్య.

“నీకెందుకు బాబాయ్ శ్రమ. మేము వెళతాంలే!” అన్నది నివేద.

"మొన్నటి దాక ఇద్దరిదీ చెరొక దారి. నిన్ననే కదా ఒక ఇల్లు తీసుకుని అందులో చేరారు. ఇప్పుడు ఇద్దరిదీ ఒకే దారి. అందుకే ఈ బాబాయిని కనీసం ఆటో దాకనన్నా సాగనంపి రానీయమ్మా!" అంటూ వారిని చేతులు పట్టుకుని ముందుకు సాగాడు రంగయ్య.

★★★

నవారు మంచం మీద పరచిన దుప్పటి మీద మల్లెలు గుబాళిస్తున్నాయి. ఆ గుబాళింపును తలదన్నే సువాసనలను నివేద సిగలో మల్లెలు వెదజల్లుతున్నాయి. అప్పటిదాకా వారికి దారి చూపిన చేతికర్రలు మంచం కిందకు జారుకున్నాయి. ఒకరి మనోనేత్రంతో మరొకరు వారి అందాలను చూసుకుంటున్నారు. 'ప్రేమ గుడ్డిది' అన్న నానుడి కళ్ళున్న గుడ్డివాళ్ళు చేసిన వ్యాఖ్యలా అనిపించింది వారికి. ఒకరి శ్వాస మరొకరికి ఉత్తేజాన్ని కలిగిస్తున్నది. అధర్వ చేతులలో అలవోకగా ఇమిడిపోయింది నివేద. ఆమె శరీర స్పర్శ అతని తనువులోని అణువు అణువులో తమకాన్ని నింపుతున్నాయి. అతని చేతులు ఆమె సౌష్టవాలను స్పృశించి అందని లోకపు అంచులను చేరవేస్తున్నాయి!

"ఈ బంధం మనకు ఇక శాశ్వతమే కదూ!" ఆమె చెక్కిళ్ళు నిమురుతూ అడిగాడు అధర్వ.

"నా మనసు గుడిలో నీవే దేవుడివై నిలిచావు అధర్వా. రూపంతో సంబంధం లేని ప్రేమ మనది. మన మరణం తప్ప వేరేది మనలను వేరుచేయలేదు!" నివేద చెక్కిళ్ళ మీద తడి చేతికి తగిలింది అధర్వకు.

"బాధపడుతున్నావా... ఎందుకు?" ఆమె చెంపల మీద నీటిధారల తుడుస్తూ అడిగాడు అధర్వ.

"బాధ కాదు అధర్వా... ఆనందం. నేనెలా ఉంటానో తెలియకుండానే నన్ను ఇంతగా ప్రేమిస్తున్నావే... ఆ సంతోషాన్ని తట్టుకోలేక చూపులేని నా కళ్ళు స్పందించి రాల్చిన ఆనంద బాష్పాలు ఇవి!"

"కంటికి కనిపించే అందం అశాశ్వతం నివేదా. కానీ మనది స్పర్శలతో పొందే ఆనందం. ఇది మనసు మాత్రమే చూడగలిగే అందం. ఇది శాశ్వతం నివేదా. మనకు చూపు గుడ్డిది కావచ్చు, కానీ మన ప్రేమ గుడ్డిది కాదు. ఈ జీవితానికి నువ్వు చాలు నివేదా. నీ కోయిల స్వరం, నీ కోమల దేహమే నాకు రెండు కళ్ళు. నీ స్వరాన్ని వింటూ, నీ స్పర్శను అనుభవిస్తూ జీవితాన్ని ఆనందంగా గడిపేస్తాను" అధర్వ గొంతులో ఏదో తెలియని ఆనందం.

ఆమె చేతులు అతడిని మరల అల్లుకున్నాయి. పవిత్రమైన ప్రేమ గుడ్డిది కాదు, చూపులేని వారికి కూడ దారిని చూపే చుక్కాని. ప్రేమకు కూడ కళ్ళుంటాయి. అది ప్రేమలో పడిన వారికి మాత్రమే తెలుస్తుంది. అది అజరామరం, అదో అలౌకిక ఆనందం.

# వెన్నెలకి ఆవల...

భమిడిపాటి గౌరి శంకర్
✆ 9492858395

***సమస్యల్ని చిరునవ్వుతో సాధించిన వాడే తన లక్ష్యాన్ని చేరుకుంటాడు. సుబ్బయ్య కథలో నీతి అదే. ఈ మధ్య శాస్త్రజ్ఞులు చంద్రుని వెన్నెల ఆవల విపరీతమైన ఎండ ఉంటుందని అన్నారుట! కానీ, మనకు 'శశి' చల్లదనమే కావాలి!"***

"వ్యాపార వర్గాల్లో ఇదో సాధారణమైన వార్త... కానీ... అంత అవసరమేమొచ్చింది నవీన్‌కి..." డాక్టర్ రంగనాథం నాతో అన్నాడు.

"కనుక్కుంటాను కానీ... వాడి పరిస్థితి ఏమిటి?" అన్నాను నేను గాబరాగా రంగనాథంతో.

"ఇబ్బంది ఏమీ లేదు. అతను చాలా కాలిక్యులేటెడ్. ఆత్మహత్యాయత్నంలో కూడా..." అన్నాడు నవ్వుతూ... డాక్టర్స్‌కి ఇవన్నీ సహజమే!

నేను వాడి ప్రక్కన కుర్చీలో కూర్చున్నాను నిశ్శబ్దంగా... డాక్టర్ ఇచ్చిన మందుల ప్రభావంతో మెల్లగా కళ్ళు తెరిచాడు.. అతని ముఖంలో గూడు కట్టుకున్న విషాదం యొక్క నీడ...

"త్రాగండి అన్నయ్యగారూ..." అంది నిర్మల కప్పుతో కాఫీ అందిస్తూ...

మెల్లగా వేడివేడి కాఫీ త్రాగుతూ... చల్లని ఏ.సి. గది వాతావరణంలో కాస్త రిలాక్సయ్యాను.. వార్త నిర్మల ఫోన్లో చెప్పగానే... బెంగళూరు నుంచి విశాఖ పరిగెత్తుకు వచ్చాను..

"అసలేమి జరిగిందమ్మా" అన్నాను నిర్మల వైపు చూసి. ఆమె ముఖంలో నిర్లిప్తత... విషాదం. ఎప్పుడూ నవ్విస్తూ సరదాగా, ఏభై ఏళ్ల వయసులో కూడా... నలభై ఏళ్ల దానిలా తిరిగే నిర్మల... ఓ విషాద మూర్తిలా...

"ఏమి చెప్పనన్నయ్యా! వ్యాపారంలో నష్టం... అప్పులు... మీకు తెలియనిదేముంది?" అంది దుఃఖిస్తూ... వస్తున్న కన్నీటిని చీర చెంగుతో తుడుచుకుంటూ.


నిర్మల... నిజమైన భార్య. ఆమె నా మిత్రుడిని పాడిస్తుంది, నవ్విస్తుంది. ఒంటరితనాన్ని పోగొడుతుంది. వర్షపు చినుకుల శబ్దాన్ని కలిసి వినిపిస్తుంది. అన్నింటికన్నా ముఖ్యంగా అతనికి బ్రతకడం నేర్పింది! ఆమెను అలా ఎలా చూడటం! నా మిత్రుడు మెల్లగా... కళ్ళను పూర్తిగా తెరిచాడు. తన భార్య వంక చూశాడు. నా వైపు చూసాడు. అతడి ముఖంలో నెర్వస్‌నెస్. ఏదో చెప్పాలనుకున్నాడు.

"వద్దులే తర్వాత మాట్లాడదాం." అన్నాను నేను మెల్లగా.

ఆమె కాఫీ కప్పులో పోసి, ప్రక్కన కూర్చుని నెమ్మదిగా త్రాగించింది. అతని ముఖంలో ఇప్పుడు కాస్త ప్రశాంతత! ఏం తిన్నాం, ఏం చూసాం అన్నది ముఖ్యం కాదు.. మనసు విప్పి ఏం చెప్పుకున్నాం అనేది ముఖ్యం. భార్యాభర్తలిద్దరూ "మా... ట్లా...డు...కున్నారు" నిశ్శబ్దంగా మనసుతో.

★★★

రాత్రి ఎనిమిది గంటల సమయం... ఆసుపత్రి గది... నిర్మలను ఇంటికి పంపించాను. రేవతి... నా భార్యకి ఫోన్ చేశాను. రమ్మన్నాను. తను వస్తే నిర్మలకి తోడుగా ఉంటుంది. నేను వెళ్లి ఫ్రెషయి రావచ్చు.




నాకు, నా మిత్రుడు గోపాలానికి నాలుగు దశాబ్దాలకు పైగా స్నేహముంది. ఒకరికొకరు అన్నదమ్ముల లాగానే ఉంటాం. తిండికి లేని దశ నుంచి శ్రమించి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగాం. నాకు ఒక కొడుకు, కూతురు. పెళ్లిళ్లు అయిపోయాయి. అమెరికాలో సెటిల్ అయిపోయారు. నాకు 'అల్యూమినియం' ప్రాసెసింగ్ యూనిట్స్ హైదరాబాదు, చిత్తూరు, బెంగళూరులో ఉన్నాయి. కన్స్ట్రక్షన్స్ రంగంలో మా బాబు, అమ్మాయి ఉన్నారు. వారు జేఎన్టీయూలో ఎం.టెక్ చేశారు. అలాగని జీవితమంతా సంతోషం అనుకునేరు. నా కష్టాలు నాకున్నాయి. నా మిత్రుడు గోపాలానికి ఆస్తులున్నాయి. కాకపోతే అతనికి ఇద్దరు కొడుకులున్నారు. ఆస్తి వారికి పంచేసి, ఇల్లు, కారు, బ్రతకడానికి కావలసిన ఆస్తి ఉంచుకున్నాడు. వారు ఆస్తులను పెంచే క్రమంలో తండ్రికున్న కెమికల్ ఫ్యాక్టరీ యూనిట్స్‌ను స్నేహితుల మాటలు నమ్మి, విస్తరించాలనుకొని నష్టాల పాలయ్యారు. అప్పులు పెంచేశారు. ఆస్తులు కరిగించేశారు. ఫ్యాక్టరీల పైన చేసిన అప్పులు, వేరే తీసుకున్న లోన్లు ఇప్పుడు గోపాలానికి మిగిల్చి కుటుంబాలతో జారిపోయారు. పాపం గోపాలం!

కథంటే కావలసిన చోట ఆనందాన్ని అతికించవచ్చు. వద్దంటే విషాదాన్ని తీసేయవచ్చు. జీవితం అలా కాదు కదా! కానీ, దుఃఖాలను దాటి... మౌనంగా ఏడున్నర పదుల వయసులో నవ్వుతూ ఛాట్ బండి నడుపుకునే దంపతులు నాకు తెలుసు. వారే... సుబ్బయ్య దంపతులు! వైజాగ్ రామకృష్ణ బీచ్‌లో రోజూ సాయంత్రం ఆరు నుంచి రాత్రి పది వరకు మాత్రమే ఉంటారు. పగటిపూట తన రెండు గదుల ఇంటి ముందు డైరీ పాల ప్యాకెట్స్, పేపర్స్ అమ్ముతారు. మూడు వందల అరవై అయిదు రోజులు వారి ముఖంలో నవ్వు, సంతృప్తి ఇప్పటికీ నాకశ్చర్యమే... పేదరికం ప్రశాంతతనిస్తుందా? వారి గురించి

మా గోపాలానికి చెప్పాలి... కాదు.. చాలామంది గోపాలాలకు తెలియాలి!

డోర్‌బెల్ రింగయింది... నర్స్ వచ్చి పల్స్, టెంపరేచర్ వగైరాలు చూసి వెళ్ళింది. మళ్ళీ నా ఆలోచనలు నా దగ్గరకు వచ్చాయి.

కిటికీలో నుంచి సముద్రం... నల్లగా... "అప్పుడప్పుడు సముద్రం శిఖరాల మీద నిలబడుతుంది. రోజుల తరబడి తీరపు గవ్వలని సైతం కదిలించదు" యండమూరి వారి అనువాదం గుర్తుకు వచ్చింది..

"ఊ... ఊ..." వెనకనుంచి మా వాడి మూలుగు! కుర్చీ వెనుకకు జరిపి, వాడి మంచానికి దగ్గరగా వేశాను. వాడు నా చేతిని తన చేతిలోకి తీసుకొని... "నా కొడుకులు నాకన్యాయం చేశారురా! నాకు చావు తప్ప, నీవు గుర్తుకు రాలేదు... క్షమించు!" అన్నాడు. అతడి కంటి నిండా నీరు...

"ఏడవకు... జీవితానికి కామాలే కానీ ఫుల్‌స్టాపులుండవు. మరణమే చివరిది! నువ్వు దానిని కాస్త ముందు పేజీల్లోకి తెద్దామనుకున్నావు. కానీ ఓడిపోయావు! ఒక్కటి గమనించు... పిల్లలు మన స్థిరాస్తి కాదు. వారి జీవనం కోసమే జీవిస్తున్న ప్రాణులు వారు. మీతోనే జీవిస్తున్నా, వారు మీ సొంతం కాదు. ఇది నేను చెప్పిన మాటలు కాదు. ఖలీల్ జిబ్రాన్ తన ప్రాఫిట్‌లో చెప్పినవి. ఇవి నాకు వర్తిస్తాయి. ఊరడిల్లు... ఎక్కడి నుంచి ఇక్కడ వరకు వచ్చాము గుర్తుకుతెచ్చుకో! నేనున్నాగా... సర్దుకుందాం సరేనా! హ్యాపీగా ఉండు!! నీ వ్యవహారాలు తేల్చిన తర్వాతనే నేను తిరిగి వెళ్తాను... డోంట్ వర్రీ!" అన్నాను భరోసాగా. కానీ, నిజంగా నేను చేయగలనని కాదు, ఓ స్నేహితునిగా అతనికో మానసిక భరోసా అవసరమయ్యే సమయమిది! స్నేహమంటే దుఃఖ సమయంలో ఆనందాన్ని ఇవ్వడం, ఆనంద క్షణాలను సమంగా పంచుకోవటం!

రాత్రి 9 గంటల సమయంలో రేవతి, నిర్మల కలిసి వచ్చారు. ఆడవారు అయస్కాంతం లాంటివారు... ఎక్కడున్నా చటుక్కున కలుసుకుంటారు. నాకు నవ్వు వచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నారు? ఇది నవ్వే సమయమా, సందర్భమా!" అని రేవతి డొక్కలో ఎవరూ చూడకుండా పొడిచి, అంది.

గోపాలం చూసాడని నాకు, రేవతికి కూడా తెలుసు. ఇటువంటి సమయంలో రోగి చుట్టూ ఉన్న వాతావరణాన్ని సాధ్యమయినంతగా తేలికపరచాలి. నిర్మల అతని ప్రక్కన కూర్చుని చపాతీని ముక్కలుగా చేసి, కూరలో ముంచి తినిపిస్తున్నది. కానీ, "ఒకరి కోసం మరొకరు జన్మించి జతగానే జీవించి, జీవితపు పుటల్ని మృత్యువు చించేస్తున్నా, చివర వరకు జతగా అధ్యయనం చేయడం వివాహం. సాహో ఖలీల్ జిబ్రాన్..." వారిని అలా చూస్తుంటే నాకు గుర్తుకు వచ్చింది.

రాత్రి తొమ్మిదిన్నర సమయంలో డాక్టర్ రౌండ్స్‌కు వచ్చారు. 'ఓ రెండు రోజుల్లో డిస్చార్జ్ చేసేద్దాం..' అన్నాడు. 'థాంక్యూ డాక్టర్' అన్నాను.

"ఎందుకు... బిల్లు తగ్గినందుకా..." అన్నాడు డాక్టర్. మేమిద్దరం రాత్రుళ్ళు... తరచుగా విశాఖలో ఉంటే కలుస్తుంటాం. జతగా 'ఊగుతుంటాం'!

"బాకీ మీరు వదలరుగా" అన్నాను నర్మ గర్భంగా... నవ్వుతూ.

"మీరు మారలేదు. గుడ్ నైట్" అనేసి వెళ్ళిపోయాడు.

నేను గోపాలం మంచం దగ్గరకు వచ్చి, "డాక్టర్ మాటలు విన్నావుగా.." అన్నాను.

"నువ్వు డాక్టర్‌తో అన్న మాటలు కూడా" అన్నాడు సన్నగా నవ్వుతూ.

"మీరు రాగానే ఆయనకు నవ్వు కూడా వచ్చిందన్నయ్య" అంది నిర్మల.

"కాదమ్మా... నీ నిశ్శబ్ద ఓదార్పు వలన!" అన్నాను.

రేవతి "ఏంటో ఈయన వ్యాపారం లాగే మాటలు కూడా అర్థం కావు" అంది వెటకారం నటిస్తూ!

అందరం సన్నగా నవ్వుకొని, ఇద్దరు తెచ్చిన ఆహార పదార్థాలను తినేసాం.

"ఒక్క మాట గోపాలం! మనం ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కసారి కోటేశ్వరరావుగారిని కలుద్దాం... ఓ.కే.నా?"

"కోటేశ్వరరావు ఇంకా ఉన్నారా! ఆయన ఆత్మహత్య చేసుకున్నారని. ఐ.పీ. పెట్టేసారని విన్నాను. విశాఖలోనే ఆయన ఉన్నారా?" అన్నాడు ఆశ్చర్యంగా!

"సంతోషంగా ఉన్నారు. చూపిస్తాను, సరేనా..." అన్నాను.

★★★

రెండురోజుల తరువాత గోపాలం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చేసాడు. ఈ లోగా నేను పోలీసులు, లాయర్లు, బ్యాంకులు, అప్పుల వాళ్ళతో మాట్లాడి ఉంచాను. ఒక నెల రోజులలోపు అన్ని సెటిల్ చేస్తానని చెప్పాను. గోపాలం కాకపోతే నేను బాధ్యత వహిస్తానని వారికి చెప్పాను. నా ఆర్థిక స్థితి వారందరికీ తెలుసు కనుక ఒప్పుకున్నారు. బేసిగ్గా 'మనిషి' అంతో ఇంతో మానవత్వం, జాలి, దయ, సానుభూతి వంటి వాటితో కలిసిఉంటాడు. కాకపోతే వాదనలతో ముందుకు వెళితే 'ఈగో' తిరగబడుతుంది. మానవ సంబంధాలు ఈ పాయింట్ దగ్గర దెబ్బతింటున్నాయి.

నాలుగు రోజులు అనంతరం... పరిస్థితులు మెల్లగా సర్దుకోసాగాయి. గోపాలం పిల్లలు కూడా ఫోన్లో మాట్లాడేరు. ముందు అతను కోపగించుకున్నాడు. కానీ, నేను సర్ది చెప్పిన తర్వాత "దయచేసి మీరు మరి మా ఇద్దరి జీవితాల్లోకి రాకండి. మీరు నేర్పిన పాఠం గొప్పది" అని సరిపెట్టాడు. నిర్మల నిర్లిప్తంగా ఉండిపోయింది.

"మనం ఒకసారి కోటేశ్వరరావు గారిని కలుద్దామా" అన్నాడు ఓ రోజు గోపాలం!

"సరే... సాయంత్రం ఆరుకు వస్తాను. వెళదాం" అన్నాను..

కారు రామకృష్ణ బీచ్ దిశగా నడుపుతున్నాను. గోపాలం ఏదో ఆలోచనలో ఉన్నాడు. మెల్లగా రామకృష్ణ మఠం ఆలయం ఎదురుగా, సముద్రంను చూస్తూ ఆపాను.

వాతావరణం మబ్బుపట్టి ఉంది. వీకెండ్ కాదు... జనం పల్చగా ఉన్నారు. కారులో నుంచి ఇద్దరం దిగాము. గట్టుమీద యువతి యువకులు జంటలు జంటలుగా 'దగ్గరగా' కూర్చుని, ఈ ప్రపంచం మొత్తం 'మనిద్దరమే' అన్నంతగా ఉన్నారు.

నాకు నవ్వొచ్చింది... బహుశా వారికి పెళ్లి కాలేదనుకుంటా. ఇంకా ప్రేమికులే!

"ఏంటి ఇక్కడ కారాపావు? అసలు ఈ దారిలో కోటేశ్వరరావు గారి మేడ లేదుగా..." గోపాలరావు అనుమానం.

"ఆయన పది అయితే గాని ఫ్రీ కారని తెలిసింది. ఈలోగా ఇక్కడ సుబ్బయ్య అనే ముసలాయన ఛాట్ బండి పెట్టారు. పదిహేను రూపాయలే... దా... తిందాం" అన్నాను.

ఇద్దరం... సుబ్బయ్య ఛాట్ బండి దగ్గరకు వెళ్ళాం. అక్కడ చాంతాడంత క్యూ ఉంది. ముసలి, ముతక, పిల్లలు అందరూ ఉన్నారు. కానీ సుబ్బయ్య మంచాయన. పెద్దవారికి వేగంగా ఇస్తున్నాడు. అతని భార్య కూడా ఏ మాత్రం విసుగు, చిరాకు లేకుండా ఆడవారికి, పిల్లలకు అందిస్తున్నారు. వారి వయసు ఏడున్నర పదులు పైనే ఉంటుంది. అయినా వంగని విల్లులా 'స్టిఫ్' గా ఉన్నారు. కాలం నేర్పిన పాఠాలు... జీవితం చెప్పిన జ్ఞాపకాలు కారకాలై ఉండవచ్చు... వారిని నిటారుగా ఉంచాయి!

గోపాలం రెండు చాట్‌లు అడిగాడు. ముప్పై రూపాయలు ఇచ్చాడు. సుబ్బయ్య ముఖంలో నవ్వు, అతన్ని ఆకర్షించింది. కొద్దిసేపు ఆలోచనలో పడేసింది. "తీసుకున్నావా?" అన్నాను గోపాలం దగ్గరకు వెళ్లి.

"ఏం బాబుగారూ, బాగున్నారా?" అన్నాడు సుబ్బయ్య.

"అయ్యో... నేను మీ కన్నా అన్నింటా చిన్నవాడిని, నన్ను బాబుగారని పిలవద్దు" అన్నాను సుబ్బయ్యతో.

"మీరు కస్టమర్... దేవునితో సమానం అలానే పిలుస్తాను" అన్నాడు సుబ్బయ్య నవ్వుతూ!

"చాట్ బండి వాడితో గౌరవ మర్యాదల చర్చ అవసరమా! మనం డబ్బులిస్తాం, అతడు సరుకిస్తాడు అంతే!" గోపాలం ముఖంలో అసహనం.

నేను నవ్వి ఊరుకున్నాను.

"ఒకసారి సుబ్బయ్య కథ తెలుసుకుందాం అనుకున్నాను. వెళ్లి అడిగాను. అతనిది, నీ వంటి కథే... అంటే పిల్లలు వదిలించుకున్నారు! పూర్వాశ్రమంలో సుబ్బయ్య కూడా బాగా డబ్బున్న వాడేనట. కానీ.. పిల్లలను నమ్మి, వారి పేరున ఆస్తి రాసి, వారిచే ఇంటి నుంచి గెంటి వేయబడ్డారు ఆ ముసలి దంపతులు. ఒకసారి ఆయనే నాకు చెప్పాడు! పిల్లల్ని ప్రేమించే ప్రయత్నం తప్పు కాదు. వారు తిరిగి ప్రేమను ఇవ్వాలన్న నిబంధనే మహా పాపమని... ఇది కూడా ఆయన ఎక్కడో చదివినదేనట. అవమానం, ఆకలి, వేదన, నిస్సహాయత, దుఃఖం – ఇవన్నీ సోపానాలు దిగితే కిందకు వెళతాం. ఎక్కితే పైకి వెళతాం. సుబ్బయ్య ఎక్కిన మనిషి!"

"ఏంటి చాట్ బండి నడుపుకుంటూ నా మీదికి ఎక్కిన మనిషి!" గోపాలం గొంతులో చిన్న చూపు.

"నీకో విషయం చెప్పనా! సమస్యల్ని చిరునవ్వుతో సాధించిన వాడే తన లక్ష్యాన్ని చేరుకుంటాడు. సుబ్బయ్య కథలో నీతి అదే. ఈ మధ్య శాస్త్రజ్ఞులు చంద్రుని వెన్నెల ఆవల విపరీతమైన ఎండ ఉంటుందని అన్నారుట! కానీ, మనకు 'శశి' చల్లదనమే కావాలి!"

చాట్ పూర్తయింది. కప్పులు పారేశాం. గట్ల మీద కూర్చున్న జంటలు మెల్లగా చీకటి ప్రదేశాలలో సర్దుకుంటున్నారు. ”పద సమయం తొమ్మిది కావస్తున్నది, వెళదాం. మరో నాలుగయిదు రోజులలో ఇవన్నీ సర్దుకుంటాయి. భయం వదిలి, పూర్వపు జీవితం కావాలనుకోకు. క్రొత్త జీవితం ప్రారంభించు.. సుబ్బయ్యలా!” అన్నాను నవ్వుతూ.

అతడు నవ్వాడు. ఇద్దరం కారెక్కాము. నేను స్టార్ట్ చేసాను.

“నేను కూడా బెంగుళూరు వెళ్ళాలి. రేవతి కూడా తొందర పెడుతున్నది. మరో రెండు రోజులు ఉండగలను. అంతే!” అన్నాను.

“పోనీ ఈ రెండు రోజులు మా ఇంట్లోనే ఉండవచ్చు కదా నీవు, రేవతి!” గోపాలం అర్థింపు.

“మా బావమరిది ఇక్కడ ఉన్నాడని నీకు తెలుసుగా! రేపు అంతా నీతోనే ఉంటాను సరా!” అన్నాను వాడిని ఊరడిస్తూ!

వాడింటి దగ్గర వాడు దిగాడు. లోపలికెళుతున్న వాడు ఆగి, “అవునూ, కోటేశ్వరరావుగారి దగ్గరకు వెళదామన్నావు. నాకు ఆయనను చూడాలని ఉంది. పోనీ రేపు వెళదామా?” అన్నాడు.

“ఎందుకు రేపు? చూపించాను కదా!” అన్నాను సీరియస్‌గా.

“ఎవరిని? ఆ చాట్ బండి సుబ్బయ్యనా!”

“అతని అసలు పేరు కోటేశ్వరరావు. ఇండస్ట్రీయలిస్టు!” నేను కారును ముందుకురికించాను.

# కళ్ళు

ఇంద్రగంటి జానకిబాల
✆ 9640052509

**విశిష్ట అతిథి కథ**

***ఆమె ఒకసారి కళ్ళెత్తి చూసింది. తనను మోసం చేసిన కళ్ళను పీకి పారేయ్యాల్సిందే. కానీ, కానీ... రాజేశ్వరి మనిషిగా ఒక్కక్షణం కళ్ళు తెరిచింది. అవును, ఆ కళ్ళు నిజంగా సద్వినియోగపడేది ఇప్పుడే! లోకం చూడలేని గుడ్డివాడికి దృష్టినిచ్చే మహత్కార్యం చెయ్యగలిగేది ఈ తరుణంలోనే!***

ఆ ఇంటి ముందు వాతావరణం గంభీరంగా ఉంది. ఎంతోమంది జనం అక్కడ ఉన్నా కోలాహలంగా లేదు. అందరి ముఖాల్లోనూ విషాదం అలముకొని ఉంది. ఎవరైనా మాట్లాడినా, నెమ్మదిగా గుసగుసగా మాట్లాడుతున్నారు.

చనిపోయిన పరాంకుశం శవాన్ని పదినిమిషాల క్రితమే ఇంటికి తీసుకొని వచ్చారు. మంచుపలక అమర్చిన ఎత్తైన బల్లమీద శవాన్ని అందరికీ కనిపించేలా ఉంచారు.

నటుడూ, రాజకీయనాయకుడూ అయిన పరాంకుశం పోయాడన్న వార్త క్షణాల మీద అందరికీ తెలిసిపోయింది! కార్లూ, స్కూటర్లూ ఇంటి చుట్టూ చేరిపోయాయి. ఎక్కడెక్కడి మనుషులూ గుంపులుగా వచ్చి, గేటు దగ్గర చేరి, మునివేళ్ళమీద లేస్తూ, మెడలు చాచి, లోపలికి చూస్తున్నారు.

ఏనుగుతొండంలాంటి పూలదండ అతని మెడనలంకరించి ఉంది. ఎందరెందరో వస్తూ, అతని పాదాల చెంతా, గుండెల మీదా పుష్పగుచ్ఛాలూ, దండలూ ఉంచుతున్నారు.

శవానికి కాస్త దూరంగా తల వైపున రాజేశ్వరీదేవి కూర్చొని ఉంది. తలవంచుకొని కూర్చున్న ఆమె తలమీది కొంగు నుదుటి మీదకు జారి, కళ్ళవరకూ కప్పేసి ఉంది. మూసిన ఆమె కనురెప్పల వెనుక ఏముందో... ఎవరికీ తెలియదు.

"ఆమె ఎప్పుడూ నిండుకుండే! తొణకదు బెణకదు. హోదాతనం, దర్జా ఆమె సొత్తు!" ఎవరో అతిమెత్తగా, గాలిలో తేలి వచ్చిన గరగరలాగా అంటున్నారు.


ఆ మాటలు రాజేశ్వరీదేవి చెవిలో పడ్డాయో, లేదోగాని, ఆమెలో పెద్దగా స్పందనేమీ లేదు. కొన్ని క్షణాల తరవాత మళ్ళీ మాటలు.

"ఏం నటుడండీ! ఏం నటనండీ! ఆయనకాయనే సాటి!"

"కళ్ళలోనే ఉండేవి అన్ని భావాలూను!"

"అవును. లోకాల్ని జయించగల ఆ కళ్ల ఆకర్షణే ఆయన్ని రాజకీయాల్లోనూ రాణించేలా చేసింది."

"మరే... అతను ఎదుటపడి మాట్లాడితే, మారు చెప్పే శక్తి ఎవరికీ ఉండేది కాదు!" ఈ మాటలు చెవినపడ్డ రాజేశ్వరీదేవిలో కదలిక... నిశ్చలాంతరంగంలో ఒక జ్ఞాపకం రాయై... చెదరగొట్టిన కలకలం!!



కళ్ళు...కళ్ళు...!

అవును, ఆ కళ్ళలో మెరుపు... ఆ కళ్ళలో చమత్కారం... ఆ కళ్ళలో ఆకర్షణ... ఆమెకు తెలుసు! ఆమెకు అనుభవమే! యాభై ఏళ్ళనాటి దృశ్యం ఆమె మనోనేత్రంలో నెమ్మదిగా రూపు దిద్దుకుంటోంది.

ఆనాడు, పద్దెనిమిదేళ్ళ చిన్నదానిగా తాను పొందిన అలజడి... సిగ్గు విడిచి అమ్మా నాన్నల్తో మాట్లాడిన తీరు... ఇప్పటికీ కళ్ళ ముందు కదులుతూనే ఉంది. ఆ మాటలు చెవుల్లో వినిపిస్తూనే ఉన్నాయి.

"పిల్లాడు ఎర్రగా బుర్రగా బాగానే ఉన్నాడు. కాణీ సంపాదన లేదు. చదువు లేదు. నాటకాలేస్తాడు. నాటకాలు కూడు పెడతాయా?" నాన్న మాటలవి.

"రాజీకి బాగా నచ్చాడు" అంది తల్లి సన్నగా.

"నాటకాలేసేవాడు నచ్చకేం చేస్తాడు. దీనికే కాదు, ఊళ్ళో ఆడాళ్లందరికీ నచ్చుతాడు!"

"అయ్యన్నీ మనకెందుకు. నచ్చితే ఇవ్వడం, లేకపోతే కాదనడం." తుంచేసింది తల్లి.

"మనోళ్ళలో పట్టుమని పది ఎకరాలు లేకపోతే ఏం పరువూ? ఏమో నాకిష్టం లేదు." తండ్రి తేల్చేశాడు.

"అది ఏడుపు మొగమేసుకొని కూర్చుంది!" తన తల్లివేపు మాట.

"ఏం నావాటా పదిహేనేకరాలూ నాకున్నాయిగా... అతనికి లేకుంటేనేం?" తన ధైర్యానికి తానే కంగారుపడింది రాజేశ్వరీదేవి.

తండ్రి కూతురు వంక ఆశ్చర్యంగా చూశాడు. "నాటకాల వాళ్ళంటే నాకు నమ్మకం లేదు. అయినా ఆడితో బతకాల్సిన దానివి, నీకు నచ్చితే నాకేంటి. వెళ్ళి మాట్లాడుతాలే!" అన్నాడు ఒప్పుకుంటూ.

★★★

ఎవరో వచ్చి రాజేశ్వరీదేవి పక్కన కూర్చున్నారు. ఆమె చెయ్యి తన చేతిలోకి తీసుకొని,

"ఇంతలో ఇలా జరుగుతుందనుకోలేదు." అందామె.

రాజేశ్వరి ఆమె వేపు నిదానంగా చూసింది. మరీ స్నేహం లేకపోయినా పరిచయం ఉన్న మనిషే. రాజేశ్వరి కళ్ళలో కన్నీళ్లు కనిపించకపోయేసరికి, ఆమె ఒక్క క్షణం బిత్తరపోయి, వెంటనే సర్దుకొని, తానే కళ్ల నీళ్లెట్టుకొని, జాలిగా చూసింది.

రాజేశ్వరీదేవి... గతం, భర్త వర్తమానాల మధ్య... ఊగిసలాడుతోంది.

కళ్ళు... కళ్ళలో నీళ్ళు!! చారెడేసి కళ్లున్నా, చింతాకుల్లాంటి చీకిరి కళ్ళే ఉన్నా, కడవలుగా కురిసే కన్నీళ్ళకా భేదం లేదు.

★★★

అప్పుడే అక్కడ అడుగుపెట్టిన డాక్టర్ ప్రసాద్ రాజేశ్వరీదేవికి ఏదో చెప్పబోయేంతలో బయట కలకలం చెలరేగింది.

పెద్దగా ఏడుస్తూ ఒకామె దూసుకొచ్చింది. అందరూ ఆశ్చర్యంగా, ఇబ్బందిగా చూస్తుండిపోయారు. ఆమె సరాసరి శవం దగ్గరకెళ్ళి, శోకాలు మొదలుబెట్టింది. రాజేశ్వరి కళ్ళలో అరుణిమలు అలుముకున్నాయి. తనలోని కోపం ఎదుటివారికి కనిపించకూడదని, కళ్ళు గట్టిగా మూసుకుంది.

ఆ వచ్చిన శమంతకమణి... శవాన్ని చుట్టేసుకొని, గట్టిగా శోకాలు మొదలుబెట్టింది.

"నిన్నటి రోజున కూడా నాతో వేళాకోళం ఆడేదు నాస్వామి. ఇంతలోనే ముంచుకొచ్చిందా చావు! కన్నుగీటుతూ, నీకు మంత్రి పదవి ఇస్తానన్నాడే నా దొర! అప్పుడే ఆ కళ్ళు మూతలు పడ్డాయా! ఆకాశమంత విశాలమైన కళ్ళలో నామొహం చూసుకొని, బొట్టు పెట్టుకునేదాన్నిరో... నా దేవుడ్ని తీసుకుపోయి, నాకు బొట్టే లేకుండా చేశావా దేవుడా!"

అందరూ అవాక్కైపోయారు. డ్రామా చూస్తున్నట్టు చూస్తుండిపోయారు.

రాజేశ్వరి కళ్ళు అవమానభారంతో వాలిపోయాయి. పెద్దమనుషులు ముందుకొచ్చారు. పరాంకుశం ఇద్దరు కొడుకులూ కల్పించుకున్నారు. అరగంట అవస్థ పడ్డాక, ఆమెను దూరంగా తీసుకెళ్లగలిగారు.

డాక్టర్ ప్రసాద్ మళ్ళీ అటూ ఇంటూ అసహనంగా చూశాడు. అతను చెప్దామనుకున్న సంగతి అతని కళ్ళలో ప్రశ్నగానే ఉండిపోయింది కొంచెం సేపు! పరాంకుశం పెద్దకొడుకు దగ్గరకెళ్ళాడు నెమ్మదిగా.

"చూడు బాబూ, నాన్నగారు చాలా గొప్పవారు"

"అవునండీ"

"పేద ప్రజల మనిషి! అందర్నీ కన్నబిడ్డల్లా చూసుకునేవారు"

"నిజమేనండీ"

"తన మరణానంతరం కళ్ళు డొనేట్ చేస్తానని చెప్పారు. అవిప్పుడు..."

"అబ్బే, నాన్నగారిలాంటి గొప్ప వ్యక్తీ, కళాకారుడూ, ప్రజానాయకుడూ, అంగవైకల్యంతో అంత్యక్రియలు... ఛా, ఛా... కూడదండీ!"

"అది కాదు బాబూ, ఇది ఆయన కోరికే! ప్రపంచంలో ఉన్న గుడ్డివారిలో ప్రతీ మూడోవాడూ ఇండియనే తెలుసా!"

"తెలీదు. తెలిసినా ఇప్పుడు నేనేం చేయలేను! నాన్నగారి లాంటి మహావ్యక్తి కళ్ళు తీయడానికి నేనొప్పుకోను."

"కళ్ళు దానం చెయ్యడంవల్ల ఆయన మహోన్నతవ్యక్తి అవుతారు. బతికుండగానే కాక, చనిపోయాక కూడా, సాటిమనిషికి సేవ చేసిన చరిత్రపురుషుడౌతారు. సమయం అట్టే లేదు. మీరు..."

"డాక్టర్ గారూ మీరేమనుకోకండి. నేనొప్పుకోలేను."

అంతలో రెండోకొడుకు వచ్చాడు. మళ్ళీ అంతా వివరంగా చెప్పాడు డాక్టర్. అతను మరింత విసురుగా "నో..నో.. మా నాన్నగారు గొప్ప ఏక్టర్. ఆయన అభిమానులకు ఆ కళ్ళంటే ప్రాణం! అవి మూతలు పడినా వారి హృదయాల్లో చిరస్థాయిగా ముద్రపడి ఉన్నాయి. దయచేసి, ఆ ముద్ర చెరపవద్దు."

ప్రసాద్ మరేం మాట్లాడలేకపోయాడు.

ఇంతలో ఒకామె కాస్త నెమ్మదిగా, వయ్యారంగా, బిడియంగా, దుఃఖాభినయంతో శవం దగ్గరకి వచ్చి, పాదాలకు నమస్కరించి, తల పాదాలపై ఉంచి, దుఃఖించి, కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వెళ్లిపోయింది.

ఆమె పరాంకుశం సినీ నటజీవిత భాగస్వామి! ఆమెకిరువైపులా ఇద్దరిద్దరు బాడీగార్డులున్నారు. ఆమె రావడం, వెళ్ళడం కళ్ళు మూసి తెరిచేలోగా అయిపోయింది. అందరూ కళ్ళప్పగించి చూస్తుండిపోయారు.

రాజేశ్వరీదేవి కళ్ళు శరత్కాలపు మేఘాల్లా నీరెండి, నిర్మలంగా ఉన్నాయి.

మళ్ళీ ఎవరో అన్నారు “కళ్ళలో తడికూడా ఎవ్వరూ కనిపెట్టలేకుండా, పెద్దావిడ చూడండి, ఎంత నిబ్బరంగా ఉందో!” ఆ మాటలామెకు వినబడ్డాయి. కళ్ళలో తడి ఆరిపోయి నలభై ఏళ్ళయింది. పెళ్ళైన రెండేళ్లూ నానా ఇబ్బందీ పడినా, చిరునవ్వుతోనే ప్రేమ పంచి ఇచ్చింది. భర్త కళ్ళలో మెరిసే సిరులే సింగారించుకొని తిరిగింది.

కాని, అంతలోనే అన్నీ మారాయి. పరాంకుశం దశ తిరిగింది. సినిమా నటుడిగా ఏడాదిలో లక్షలు గడించాడు. ఎక్కడ చూసినా అతని బొమ్మలే! ఆకర్షవంతమైన అతని కళ్ళే. అందరూ రాజేశ్వరీదేవి అదృష్టమే అన్నారు. “నా రెండు కళ్ళూ నీవే” అన్న అతను, మరోకామెను చేరదీసి, ‘మీరిద్దరూ నా రెండుకళ్ళు’ అన్నాడు.

రాజేశ్వరి మనసూ, కళ్ళూ అప్పుడే తెరుచుకున్నాయి. ఆరోజు రాత్రే అతని రెండు కళ్ళూ పీకి పారెయ్యాలనుకుంది. కంటికీ, మింటికీ ఏడ్చింది. ఆ తరవాత కంట తడి పెట్టలేదు.

గడ్డి కప్పిన నూతుల్లాంటి ఆ కళ్ళను మరెప్పుడూ ఆరాధించలేదు. కాంక్షా సర్పద్వయమైన ఆ కళ్ళవేపు మరెప్పుడూ కాంక్షగా చూడలేదు. ‘అహం’ అనే రెండక్షరాల్లా మెరిసే ఆ కళ్ళను చదివేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదు.

ఆమె పరాంకుశం భార్య హోదాలో మిగిలిపోయింది. తనను మోసగించిన ఆ రెండు కళ్ళూ అంటే ఆమెకు కసి... పీకి పారేయ్యాలన్నంత క్రోధం!

చివరి ప్రయత్నంగా డాక్టర్ ప్రసాద్ రాజేశ్వరీదేవి దగ్గరకు వచ్చాడు. నెమ్మదిగా, మృదువుగా అంతా వివరించాడు.

ఆమె ఒకసారి కళ్ళెత్తి చూసింది. తనను మోసం చేసిన కళ్ళను పీకి పారేయ్యాల్సిందే. కానీ, కానీ... రాజేశ్వరి మనిషిగా ఒక్కక్షణం కళ్ళు తెరిచింది. అవును, ఆ కళ్ళు నిజంగా సద్వినియోగపడేది ఇప్పుడే! లోకం చూడలేని గుడ్డివాడికి దృష్టినిచ్చే మహత్కార్యం చెయ్యగలిగేది ఈ తరుణంలోనే!

ఆమెలోని కసి క్రమంగా కరుణగా మారింది. అతను తనపట్ల ప్రదర్శించిన నిర్లక్ష్యానికి తను అతనికి సద్గతినే ఇస్తోంది.

“ప్రసాదూ... మీ పని మీరు చేయండి! ఆ కళ్ళు మరొకరికి దృష్టినివ్వడమే కావాలి!” అంది.

శమంతకమణి మళ్ళీ రాగాలు మొదలుపెట్టింది.

“ఆ కళ్ళలో గూడు కట్టుకొని జీవించాను నాయనో! నా ఎదురుగా ఆ కళ్ళు తీయకండిరా నాయన్లారా”. రాజేశ్వరీదేవి మాట ముందు శమంతకమణి గోలెవరూ పట్టించుకోలేదు. ఆమె గోల వింటున్న కొడుకులిద్దరూ తల్లి మాటనే సమర్థించారు.

డాక్టర్ ప్రసాద్ చకచకా తన పని ముగించి, కళ్ళు థెర్మోస్ బాక్స్‌లో పెట్టుకున్నాడు!

చాలా ఏళ్ళ తరవాత, రాజేశ్వరీదేవి కళ్ళలో కన్నీటి పొర కమ్ముకుంది!

*(ఆంధ్రప్రభ, ఆదివారం 25 మే 1997 సంచిక నుంచి పునర్ముద్రణ)*

# శిథిల శిల్పాలు

అల్లం శేషగిరిరావు

**కథామార్గదర్శి కథ.**

***తాతతండ్రుల తైలవర్ణ చిత్రాల మీద సాలీళ్ళు తిరుగుతున్నాయి. నిరుపయోగంగా వ్రేలాడుతున్న గాజుదీపాల గుత్తుల్లో కొడిగట్టిన క్రొవ్వొత్తుల అవశేషాలు మసగ్గా కనిపిస్తున్నాయి.***
***మాసిపోయి చివికిపోతున్న పులి చర్మాలు, ముడతలు దేరుతూ జీర్ణావస్థలో గోడలకి వేలాడుతున్న పెద్దపులుల తలలు గత వైభవాన్ని వెక్కిరిస్తున్నాయి***

బ్రిటిష్ సామ్రాజ్యపు హయాం మంచి ఉచ్ఛదశలో ఉంది! సంస్థానాధీశులు సెక్స్, స్పోర్ట్స్‌లో మునిగి తేలుతున్న రోజులు! పెద్దపులి వేటకి వేలకి వేలు ఖర్చయినా లెక్కచెయ్యకుండా రోజుల తరబడి అడవుల్లో కేంపులు వేసి 'మృగయావినోదం'లోని రాయల్ థ్రిల్‌ని అనుభవించడం ఆనాటి రాచరికపు ఆనవాయితీ.

రామాపురం ఎస్టేటుకి వైస్రాయిగారు పులివేటకి వస్తున్నట్లు జమీందారు రఘుపతిగారికి వర్తమానం అందింది.

వైస్రాయా, మరొకరా?

వెంటనే హాలెండ్ – హాలెండ్ కంపెనీకి పురమాయించి వైస్రాయిగారి బరువుకి, ఎత్తుకి తగ్గట్టుగా పులివేటకి తగిన తుపాకీని తయారుచేయించి తెప్పించారు.

వైస్రాయిగారు దిగేరు. అంగరక్షకులు, కార్లు, మందీ మార్బలం, గుర్రాలు, వేటకుక్కల అరుపులు... ఒకటేమిటి ఎక్కడ చూసినా 'మృగయా వినోద' కోలాహలం.

ఆ రాత్రి రఘుపతిగారి ప్రయివేటు ఫారెస్టులో వైస్రాయిగారు ప్రత్యేకంగా దిగుమతి చేయబడిన తుపాకీతో, ఒకే ఒక దెబ్బతో పెద్దపులిని కిక్కురుమనకుండా కాల్చేశారు. ఆ పులిని చెప్పిన టైముకి, అనుకున్న జాగాకి, వైస్రాయిగారున్న మంచె దగ్గరకు ఠంచనుగా తోలుకొచ్చేరు. వైస్రాయా, మరొకరా! ఠపీల్మని పిట్టని పేల్చినట్టు పేల్చేశారు.

రఘుపతిగారి షికారీ నిర్వహణాదక్షతని తెగమెచ్చుకుంటూ వైస్రాయిగారు 'రావుబహద్దూర్' అని బిరుదు నిచ్చారు.

తుపాకీ మీద వైస్రాయిగారి పేరు, పులిని వేటాడిన తేదీ మొదలైన వివరాలు సంక్షిప్తంగా బంగారంతో చెక్కించి ఆ తుపాకీని జీవితాంతం ప్రాణప్రదంగా చూసుకుంటూ, ఒకరోజు రఘుపతిగారు కాలం చేశారు.

రఘుపతిగారి కుమారుడు నరేంద్రవర్మ.. తండ్రిగారి తుపాకీతో చాలా చాలా పులుల్ని వేటాడి సంస్థానం పేరు నిలబెట్టడమే కాకుండా, ఒకసారి ఎస్టేట్ తగాదాలో అరడజను మంది తిరుగుబాటుదారుల్ని వెంటాడి, వేటాడి వైస్రాయిగారి తుపాకీతో

కాల్చి హతమార్చేశారు. ఆనాటి కోర్టులు ఆ చర్య... ఆస్తి రక్షణ, ఆత్మ సంరక్షణ కోసం అలా జనాన్ని చంపడం న్యాయ సమ్మతమేనని తీర్పు ఇచ్చేయి!

అప్పట్నించీ నరేంద్రవర్మగారంటే ఆ సంస్థానంలో అందరికీ హడల్! తగువుకి దిగితే తుపాకీ చూపించేవారు. అతనూ చనిపోయారు!

తరువాత బ్రిటిష్ సామ్రాజ్యం అంతరించింది. సంస్థానాలు, సంస్థానాధీశులు పోయారు. పోయింది పోగా మిగిలిన రామాపురం ఎస్టేటుకి, రాజారావు వారసుడయ్యేడు! తరతరాలుగా వస్తున్న తుపాకీని మాత్రం అలనాటి వైభవ చిహ్నంగా తాతలు చంపిన పులి తలల మీద అందంగా అమర్చారు!



రాజారావుకి కూడా వేటంటే సరదా! స్నేహితుల్తో తరచూ వేటకి వెళ్తూంటాడు. వెంట వైస్రాయిగారు వాడిన తుపాకీ ఉంటుంది. మరో తుపాకీ ముట్టుకోడం అతని డిగ్నిటీకి లోపంగా భావించేవారు. 'రాజా వంశస్థులు పెద్ద పులిని మాత్రమే వేటాడాలి' అనే గట్టి అభిజాత్యం కలవాడు.

దేశం మొత్తం మీద పెద్ద పులుల సంఖ్య క్షీణించడంతో రామాపురం ఫారెస్టులో ఒక్క పులి కూడా మిగలకుండా పోయింది. అందుచేత రాజారావు వేటకి పులులు కరువయ్యాయి. స్నేహితులతో వేటకి వెళ్ళినప్పుడు మిగతా జంతువులు కనబడితే ఆ ఛాన్స్‌ని వారికే వదిలేసేవాడు. స్నేహితుల చేత వేటాడించి ఆనందిస్తూ ఉండేవాడు.

“రాజా! ఒక్కసారి మీరు మీ తుపాకీతో ఎగ్జిబిషన్ షాట్ కొడితే చూడాలని ఉంది” అని స్నేహితులు ప్రాధేయపడితే “నో, థేంక్స్! బలవంతం చెయ్యకండి. మా తాత ముత్తాతలు పులి వేటలో గజ వేటగాళ్ళు! నన్ను... జింకల్ని దుప్పుల్ని కొట్టమంటారా!” అని సగౌరవంగా నచ్చజెప్పేవాడు. “ఈ జన్మకింతే! ఈ తుపాకీని పేల్చే అదృష్టం మరి నాకులేదు!” అని నిట్టూరుస్తున్నప్పుడు అతని ముఖం మీద విషాదఛాయలు చూచాయగా కనిపించేవి.

ఒకరోజు అనుకోకుండా ఆకస్మాత్తుగా తన తుపాకీని పేల్చే అవకాశం లభించింది.

బంగళా గేటు ముందు రైతులు, వ్యవసాయకూలీలు గుంపుగా చేరి గోల చేస్తున్నారు. రాజారావుని బైటకి రమ్మంటున్నారు. పేద రైతులకు పంచిన బంజరుభూముల్నీ, దేముడి మాన్యాల్నీ ఆక్రమించుకోడానికి ప్రయత్నం చేస్తున్న రాజారావుని ప్రతిఘటించడానికి, వందల సంఖ్యలో రైతులు గుమిగూడేరు. ఏవేవో నినాదాలు చేస్తున్నారు.

రాజారావుకి తండ్రి జ్ఞాపకం వచ్చేడు. తనూ ఒక పదిమందిని కాల్చేద్దామనుకున్నాడు. ఒక అంగలో వెళ్ళి పులి తలల మీద ఉన్న తుపాకీని అందుకున్నాడు.

"ఒద్దు బాబూ, ఈ దురితం తగదు. రోజులు మనవి కావు" అని నౌకరు రాజారావు చేతిలో తుపాకీని బలవంతంగా లాక్కున్నాడు. బయట తలుపులు మూశాడు.

రాజారావు బోనులో ఇరుక్కున్న సింహంలా పిచ్చెత్తినట్టు పచార్లు చేస్తున్నాడు. జుత్తు పీక్కున్నాడు. తుపాకీని చేతుల్లోకి తీసుకుని వలవల ఏడ్చాడు. "నావంటి చవట చేతిలో ఉండదగినదానవు కాదు. మా తండ్రిగారే ఉంటే, ఈ పాటికి రక్తం ఏరులైపారేది."

బయట జనం గోల, గేటు తోసుకొస్తున్నారు.

రాజారావు మరి ఉండలేకపోయేడు. పట్టరాని కోపంతో నౌకర్ని లెక్క చెయ్యకుండా ప్రక్కకు నెట్టి తుపాకీ తీసుకుని గభాలున తలుపులు తెరచుకుని బయటకు వచ్చేడు.

జనం గోల. "అన్యాయం, అక్రమం!" అరుపులతో గింగుర్లెత్తి పోతోంది.

"అడుగు ముందుకు పడిందా పిట్టల్లా రాలిపోతారు. నా చేతిలో ఏమిటుందో తెలుసుగా! కొన్ని సంవత్సరాల క్రితం దీనితో అరడజను మందిని హరీమనిపించేరు మా నాన్నగారు. నన్నురెచ్చగొట్టద్దు!"

"కాలుస్తావా... కాల్చు!" అని ముందుకొచ్చేడొకడు.

"నువ్వేకాదు చాలామంది రాలిపోతారు. జాగ్రత్త. అసలు మీకు కావలసిందేమిటి?"

"మాకు పంచిన బంజర్లని, దేవుడి భూముల్ని అక్రమంగా ఆక్రమించుకుంటున్నారు. ఇదన్యాయం!"

"ఆగండి, మీలో ఏ ఒక్కరో లోపలికి రండి, దాన్ని గురించి ఆలోచిద్దాం! అనవసరంగా రాద్ధాంతం చేసి రక్తపాతం చెయ్యకండి!"

ముందున్న వ్యక్తి వచ్చి నిలబడ్డాడు. "నేను వస్తాను పదండి.' అన్నాడు లోపలకి వెళ్ళబోతూ.

"వద్దు చంపేస్తారు. లోపలికి వెళ్ళద్దు. అందరం వస్తాం."

"ఆ భయం మీకు అనవసరం. రాజకుటుంబంలో పుట్టినవాణ్ణి. అసహాయుల్ని చంపడం మా వంశంలో లేదు మీకు అభయం ఇస్తున్నాను!" అని రాజసం ఉట్టిపడుతున్నట్లు హుందాగా గదిలోకి వెళ్ళేడు.

వెంటే వెళ్ళాడు రైతు కూడా.

కూర్చోమని ఎదురుగుండా ఉన్న కుర్చీ చూపించాడు.

రైతు అనుమానంగా చూస్తూ నిలబడే ఉన్నాడు.

"ఫరవాలేదు, కూర్చో!" అని గంభీరంగా ఆజ్ఞాపించాడు.

రైతు కుర్చీలో కూర్చున్నాడు. ఇవతల వైపు రాజారావు కూర్చున్నాడు. వాళ్ళిద్దరి మధ్య తుపాకీ బల్ల మీద ఉంది.

"ఇప్పుడు చెప్పు. ఏమిటి కావాలి? ఎందుకీ గోల?"

"మాకు పంచిన బంజరు భూముల్ని కలిపేసుకుంటున్నారు మీ జనం. కాదంటుంటే కలబడుతున్నారు."

"ప్చ్! దీని కోసమా ఇంత రాద్ధాంతం? బంజరు భూముల్నీ, సాక్షాత్తూ మా తాతలు ప్రతిష్ఠించిన దేముడి భూముల్నీ మేం కలిపేసుకుంటామటయ్యా? ఒకప్పుడు ఈ ఎస్టేటంతా మాది కదూ! దీనిలో ప్రతీ గడ్డిపోచా మాది! మీకు వదిలేయలేదూ! ప్రజాసేవకి అంకితమైన మా కుటుంబం మీ అరముక్కా చెక్కా కలుపుకుంటుందా? ఒకవేళ అలా జరిగి ఉంటే అది మా వాళ్ళ పొరపాటు. మీది మీరు తీసుకోండి. సరా! లేక నన్ను చంపితే గాని మీకు తృప్తి లేదా... అదీ చెప్పండి! నా కంఠంలో ప్రాణం ఉండగా ఈ తుపాకీతో మిమ్మల్ని కాల్చి కాల్చి తరువాత నేలకొరిగిపోతాను! అరగంట వ్యవధి ఇచ్చేను, ఆలోచించుకుని మీ నిర్ణయం చెప్పండి. ఇక నువ్వు వెళ్ళచ్చు!"

"అదేంటి బాబూ, ఉత్తి పుణ్యానికి మిమ్మల్నెందుకు చంపుతాం? మా కష్టాల్ని చెప్పుకుందామని వచ్చేం గాని, చంపడానికి కాదే! ధర్మ ప్రభువులు, మీరు హామీ ఇచ్చారు కదా. వెళ్ళి పోతాం!" అంటూ బయటకు వస్తూ "రాజారావు బాబుకీ జై! "రాజారావు బాబుకీ జై" అని దిక్కులు దద్దరిల్లేలా అరిచాడు.

జనంలో జయజయ ధ్వానాలు హోరెత్తిపోతున్నాయి.

రాజారావు రైఫిల్ పట్టుకున్న గౌతమ బుద్ధుడిలా ప్రశాంత వదనంతో తుపాకీతో బయటకు వచ్చి అందరూ నమస్కరిస్తుండగా చిరునవ్వుతో ప్రతినమస్కారం చేసి లోపలికి వెళ్ళిపోయేడు.

తుపాకీని గోడకి తగిలించాడు.

జనం వెళ్ళిపోతున్నారు!

అకస్మాత్తుగా రాజారావు ఇంత మంచి నిర్ణయం తీసుకున్నందుకు అర్థం కాక, రాజారావు నౌఖరు తికమక పడిపోతున్నాడు.

రాజారావు సాలోచనగా సోఫాలో వాలి గదంతా కలయజూస్తున్నాడు. తాతతండ్రుల తైలవర్ణ చిత్రాల మీద సాలీళ్ళు తిరుగుతున్నాయి. నిరుపయోగంగా వ్రేలాడుతున్న గాజుదీపాల గుత్తుల్లో కొడిగట్టిన క్రొవ్వొత్తుల అవశేషాలు మసగ్గా కనిపిస్తున్నాయి. మాసిపోయి చివికిపోతున్న పులి చర్మాలు, ముడతలు దేరుతూ జీర్ణావస్థలో గోడలకి వేలాడుతున్న పెద్దపులుల తలలు గత వైభవాన్ని వెక్కిరిస్తున్నాయి.

రాజారావు కిటికీలోంచి బైటకి చూశాడు. దూరంగా పొలాల్లో దివాణం గుర్రం, పచ్చగడ్డి కోసం వెతుక్కొంటోంది. గోడకి

వేలాడుతున్న తుపాకీని మరొక్కసారి చూశాడు. వైస్రాయిగారు వాడిన తుపాకి!

కిటికిలోంచి నీరెండ పడి సువర్ణాక్షరాలతో నగిషీలు చెక్కిన తుపాకి తళతళ మెరుస్తోంది.

ఒకనాడు ఎన్నో పులుల్ని, ఎందరో మనుష్యుల్ని హతమార్చి తరతరాల వైభవాన్ని నిలబెట్టిన తుపాకి!

ఆ తుపాకీని చూస్తూ బరువెక్కిన హృదయంతో కళ్ళుమూసుకున్నాడు.

అసలు విషయం ఒక్క రాజారావుకే తెలుసు.

ఆ తుపాకీ పేలదు.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, దీపావళి ప్రత్యేక సంచిక 1991 నుండి పునర్ముద్రణ)*




ఆకాశంలో అందమైన చందమామను చూసి, తనకు కావాలని మారాం చేసిన బాలరాముడుకి దాన్ని అద్దంలో చూపించి, మరిపించాడుట దశరథుడు.

అదో ఇతిహాస కథ.

ఆ తర్వాత్తర్వాత 19వ శతాబ్దంలో తెలుగు నేలపై ఒక అద్భుత ఆవిష్కరణ జరిగింది. బాలలను మురిపించడానికి నింగిలోని 'చందమామ'ను భువికి దింపే ప్రయత్నం చేసారు శ్రీ చక్రపాణి. అద్దంలో కాకుండా, బాలల చిరుచేతుల్లో ఇమిడే అందమైన కథల పుస్తకంగా అందించి మరో ఇతిహాసాన్ని సృష్టించారు.

నీతి, భక్తి, జానపద, చారిత్రాత్మక, సామాజిక కథలను బాలలకు సులభంగా అర్థమయ్యేలా ఓ కథాప్రపంచాన్ని పరిచయం చేసారు. బాలకథాసాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయారు. అలా బాలలకు జ్ఞాన వెలుగులను పంచింది ఆ చందమామ.

ప్రతి ఊరి నింగిలో చందమామ ఉన్నట్టు, అప్పట్లో ప్రతి తెలుగు లోగిలిలో చందమామ కథల పుస్తకం ఉండేదిట. విచిత్రమేమిటంటే చందమామ కథలు పిల్లల్ని ఎంతగా ఆకట్టుకునేవో, పెద్దల్ని కూడా అంతగా అలరించేవి. ఆ కథలను చదవడానికి వారిరువురు ఒకరితో మరొకరు పోటీ పడేవారంటే అతిశయోక్తి కాదు.

కాలానుగతిలో నింగిలోని చందమామకు మల్లే నేల మీద చందమామకు కూడా గ్రహణం పట్టింది. సుమారు అరవై సంవత్సరాలు దేశంలోని అన్ని భాషల పిల్లలను, పెద్దలను అలరించిన చందమామను మబ్బులు కమ్మేసాయి. బాలకథలసాహిత్యానికి చీకటి కమ్ముకుంది. బాలసాహిత్యం వెనుకపడిందని అనుకునే సమయంలో అన్ని దిన, వార పత్రికలు బాల సాహిత్యంలో సమర్థవంతంగానే తమ పాత్రను నిర్వర్తిస్తున్నాయి. అయినా చందమామ లేని లోటును పూడ్చలేకపోతున్నాయి.

ఇటువంటి తరుణంలో బాలసాహిత్య వికాసానికి కథామంజరి తనవంతు కృషి చేయాలని తలచింది. బాలలలో రచనాశక్తిని, పఠనాశక్తిని పెంపొందించాలని భావిస్తోంది. ఆ సదుద్దేశ్యంతో 'బాల కథామంజరి'ని ప్రారంభించే దిశగా అడుగులేస్తోంది.

గత నాలుగు సంవత్సరాలుగా కథామంజరిని ఆదరించి అంతర్జాలంలో విలువైన పత్రికగా నిలబెట్టిన పాఠక దేవుళ్లు, 'బాల కథామంజరి'ని మరింత ఆదరించి ప్రోత్సహిస్తారని కోరుకుంటూ, వారి సలహా, సహకారాలను ఆశిస్తోంది.